# కరవీరపుర మాహాత్మ్యం

## (కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి దివ్యదర్శనం)

రచన

ఎమ్.ఎమ్.వి.సుబ్రహ్మణ్యం

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2017

# KARAVEERAPURA MAHATMYAM

## (KOLHAPUR SRI MAHALAKSHMI DIVYA DARSHANAM)

*by*

**M.M.V.Subrahmanyam**

T.T.D. Religious Publications Series No. 1253

© All Rights Reserved

*First Edition : 2017*

*Copies :* 1000

*Published by*

**Sri ANIL KUMAR SINGHAL** I.A.S.,

Executive Officer,

Tirumala Tirupati Devasthanams,

Tirupati - 517 507

***D.T.P:***

Publications Division,

T.T.D, Tirupati.

*Printed at :*

**Tirumala Tirupati Devasthanams Press,**

Tirupati - 517 507

# ముందు మాట

ప్రసిద్ధమైన శక్తిపీఠాలు పదునెనిమిది. వీటినే అష్టాదశశక్తి పీఠాలు అంటారు. ఈ దివ్యక్షేత్రాల్లో శక్తిస్వరూపిణి అయిన జగన్మాత ఒక్కొక్కచోట ఒక్కొక్క పేరుతో పిలువబడుతూ భక్తులచేత ఆరాధింపబడుతున్నది, అర్చింపబడుతున్నది. అందులో "కొల్హాపురే మహాలక్ష్మీః" అని శ్రీమహాలక్ష్మి పేరుతో వెలసిన ఏకైక శక్తిపీఠం మహారాష్ట్రలోని కొల్హాపుర క్షేత్రం.

శ్రీవేంకటాచల మాహాత్మ్యం గ్రంథం ప్రకారం భృగుమహర్షి పరీక్షవల్ల అలిగిన శ్రీమహాలక్ష్మి వైకుంఠలోకాన్ని విడిచిపెట్టి కొంతకాలం పాతాళలోకంలో కపిలమహర్షి ఆశ్రమంలో తపస్సు చేస్తూండేది. ఇంతలో భూలోకంలో కొల్హాసురుడు, కరవీరుడనే రాక్షసులు చేస్తున్న ఆగడాల్ని, పెడుతున్న బాధల్ని విన్నవించుకుని వీటిని పోగొట్టుమని దేవతలు శ్రీమహాలక్ష్మిని ప్రార్థించారు. ఆమె ఉగ్రస్వరూపిణియై పాతాళలోకంనుంచి వచ్చి ఆ రాక్షసులిద్దర్నీ సంహరించింది. ఆమెకు అనేక దేవతలు సహాయం చేశారు. ఆ జగజ్జనని అక్కడే అర్చామూర్తిగా నిత్యం పూజ లందుకొంటున్నది. ఆ రాక్షసులు అమ్మవారి చేతిలో మరణిస్తూ, తమ పేరుతో ఆ క్షేత్రం ప్రసిద్ధిని పొందాలని ప్రార్థించారు. అందువల్లే ఆ క్షేత్రం 'కొల్హాపురం' అనీ 'కరవీరపురం' అనీ, పేరు పొందింది.

ఆ నాటినుండి ఆ శ్రీమహాలక్ష్మికూడ "కరవీరపురవాసిని" "కొల్హాపురవాసిని" అని ప్రసిద్ధిని పొందింది. ఆ రాక్షస సంహారకార్యంలో సహాయపడిన దేవతలు, కొల్హాపుర క్షేత్రపరిసరాల్లో స్థిరపడినారు. ఆ యా దేవతలు కొన్ని తీర్థాల్ని ఏర్పరిచారు.

శ్రీనివాసుడు కూడ శ్రీమహాలక్ష్మి దర్శనంకోసం పదేండ్లపాటు కొల్హాపురంలో తపస్సు చేసినట్లు పురాణకథనం. ప్రతి సంవత్సరం దసరా

శరన్నవరాత్ర పర్వదిన సందర్భంగా తిరుమల శ్రీనివాసునినుండి కొల్హాపురమహాలక్ష్మికి "చీరసారె", పంపడం ఆనవాయితీగా వస్తున్నది.

అత్యంత పవిత్రమైన కొల్హాపుర క్షేత్రాన్ని గూర్చి ఆ క్షేత్ర పరిసర తీర్థాల్ని, ఆలయాల్ని గూర్చి సంక్షిప్తంగా శ్రీముక్తినూతలపాటి ఎం.వి.సుబ్రహ్మణ్యంగారు ఈ చిన్న గ్రంథంలో తెలియజేశారు.

'కరవీరపుర మాహాత్మ్యం' గ్రంథాన్ని తి.తి.దేవస్థానం స్వీయప్రచురణగా అందిస్తున్నది. భక్తులు ఈ గ్రంథాన్ని పఠించి, ఒక్కసారైనా కొల్హాపుర శ్రీమహాలక్ష్మిని దర్శించి తరించాలని ఆకాంక్షిస్తూ...

సదా శ్రీవారి సేవలో....

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# మున్నుడి

కొంతకాలం క్రితం మా అల్లుడు, కుమార్తెలు ఉద్యోగరీత్యా కొల్హాపురంలో ఉన్నందున వారిని చూడటానికి వెళ్లాను. విశాలమైన వీధులు, ప్రాచీన కట్టడాలు, దేవాలయాలు, జనజీవన శైలి, భక్త సమూహాల సంచారం, సాంప్రదాయాన్నంతా సంతరించుకొన్న ఆ క్షేత్రనగరం నా మనస్సును, ఒక్కసారిగా పురాణకాలానికి చేర్చింది. శ్రీమహాలక్ష్మి దివ్యదర్శనం, ఆలయ ప్రాంగణంలో సంచరించినంతసేపు ఓ దివ్యానుభూతిని పొందాను. ఆనందంతో వదలి రాలేనంత భక్త్యనుబంధం పెనవేసుకుంది. ఆ సందర్భంలోనే అమ్మవారి అనుగ్రహ విశేషంవల్ల నాకు, ఈ స్థల పురాణం, తెలుగు పాఠకులకు, పరిచయం చేయాలని భావించి రచన ప్రారంభించాను.

మరాఠీ భాషలో పండితుడు, కవి శ్రీమాన్ లతాదాజీబా జోషిరావ్ అను మాన్యుడు, మహాలక్ష్మి చరిత్రను రచించినట్లుగా తెలిసింది. బి.యల్.రానడే (ఎక్స్ వైస్ ప్రెసిడెంట్, డిస్ట్రిక్ట్ లిటెరసీ అసోసియేషన్, సాంగ్లి) వారి "కరవీరమాహాత్మ్యం" అన్న ఆంగ్ల గ్రంథం ఉపలబ్ధమైంది. ఆ గ్రంథాల ఆధారంగా ఈ పుస్తకాన్ని సంకలనం చేశాను.

వేంకటాచల మాహాత్మ్యపురాణం ప్రకారం, శ్రీవేంకటేశ్వర స్వామివారి పత్ని అయిన శ్రీమహాలక్ష్మి వెలసిన కొల్హాపురక్షేత్రాన్ని గూర్చి భక్తులకు తెలియనజెయ్యాలన్న సంకల్పంతో ఈ పుస్తకం మీ ముందు ఉంచుతున్నాను. ఈ చరిత్రను వ్రాయించుకొని, శ్రీమహాలక్ష్మి తన కలంగా నన్ను ఉపయోగించుకోవడం నా భాగ్యం.

ఇందలి దోషాలు నావి. సాగరసమానమైన అనుగ్రహం ఆ జగన్మాతది.

**రచయిత**

**- ఎమ్.ఎమ్.వి.సుబ్రహ్మణ్యం**

# మహాలక్ష్మ్యష్టకమ్

సమస్తేస్తు మహామాయే – శ్రీ పీఠే సురపూజితే
శంఖచక్రగదాహస్తే – మహాలక్ష్మీ ర్నమో–స్తుతే. 1

సమస్తే గరుడారూఢే – కోలాసురభయంకరీ
సర్వపాపహరే దేవీ – మహాలక్ష్మీ ర్నమో–స్తుతే. 2

సర్వజ్ఞే సర్వవరదే – సర్వదుష్టభయంకరీ
సర్వదుఃఖహరే దేవీ – మహాలక్ష్మీ ర్నమో–స్తుతే. 3

సిద్ధిబుద్ధిప్రదే దేవీ – భుక్తిముక్తిప్రదాయినీ
మంత్రమూర్తే సదా దేవీ – మహాలక్ష్మీ ర్నమో–స్తుతే. 4

ఆద్యంతరహితే దేవీ – ఆదిశక్తి మహేశ్వరీ
యోగజ్ఞే యోగసంభూతే – మహాలక్ష్మీ ర్నమో–స్తుతే. 5

స్థూలసూక్ష్మే మహారౌద్రే – మహాశక్తే మహోదరే
మహాపాపహరే దేవీ – మహాలక్ష్మీ ర్నమో–స్తుతే. 6

పద్మాసనస్థితే దేవీ – పరబ్రహ్మస్వరూపిణీ
పరమేశీ జగన్మాతా – మహాలక్ష్మీ ర్నమో–స్తుతే. 7

శ్వేతాంబరధరే దేవీ – నానాలంకారభూషితే
జగత్థితే జగన్మాతా – మహాలక్ష్మీ ర్నమో–స్తుతే. 8

మహాలక్ష్మ్యష్టకం స్తోత్రం – యః పఠే ద్భక్తిమా న్నరః
సర్వసిద్ధి మవాప్నోతి – రాజ్యం ప్రాప్నోతి సర్వదా. 9

ఏకకాలే పఠేన్నిత్యం – మహాపాప వినాశనమ్
ద్వికాలం యః పఠే న్నిత్యం – ధనధాన్య సమన్వితః. 10

త్రికాలం యః పఠే న్నిత్యం – మహాశత్రు వినాశనం
మహాలక్ష్మీ ర్భవే న్నిత్యం – ప్రసన్నా వరదా శుభా. 11

# కరవీరపుర మాహాత్మ్యం

శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండనాయకి, పరాశక్తి, సృష్టి స్థితి లయకారిణి శ్రీమహాలక్ష్మి. ఆ జగన్మాత, సృష్టించిన ఈ బ్రహ్మాండంలో, ఒక ఆణిముత్యం జంబూ ద్వీపం. అందులో, ఉత్తమ సంస్కార జీవనం, ధర్మాచరణ నిబద్ధత, దైవ సాయుజ్యం అందించే భరతఖండం మహోన్నతమైనది.

ఇలాంటి అద్భుతమైన భరతఖండంలో వేదవిజ్ఞానాన్ని తమలో నిగూఢంగా నింపుకొని, గర్వంగా నక్షత్ర స్థాయికి ఎదిగిన పర్వతరాజాలు! ఆ పర్వతాలనుండి జాలువారుతూ, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అంది పుచ్చుకొని, తమ పరీవాహక ప్రదేశాన్ని, అందులోని సమస్త జీవరాశుల్ని పునీతం చేస్తున్న పుణ్యనదులు. ఆ నదీతీరాల్లో నిత్యం ఋషివర్యుల వేదశ్రవణంతో కిలకిలా రావాలతో వంత పలికే వివిధ పక్షిజాతులు! ఇంకా, విత్తునాటిన నాటినుండి భాగవతాది పురాణాలను చెవినవేసుకుంటూ, ఆధ్యాత్మికంగా ఎదిగిన పెనువృక్షాలతో దట్టమైన నైమిశారణ్యాలు.... ఇలా ఇంకా వర్ణనల కందని ప్రకృతి సోయగాలతో నిండిన ఈ భరతావని శోభ నిరుపమానం!

ఈ ఖండంలో కోలాసుర సంహారంతో సమస్త మునివర్యులను లోకాలను రక్షించి తన దివ్యానుగ్రహంతో కరవీరపురాన్ని సుసంపన్నం గావించింది శ్రీ మహాలక్ష్మి.

కరవీరపురం దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచింది. ఈ క్షేత్రం భూలోక స్వర్గమై సకల భక్తజనావళి ఐహిక పారలౌకిక సుఖసంపదలతో తులతూగడానికి కారణభూతమైంది. శ్రీమహాలక్ష్మి వెలసిన ఈ ప్రదేశం సుసంపన్నమై భక్తుల కష్టాలను పారద్రోలి సర్వజగత్తును రక్షించే శ్రీమన్నారాయణుని భక్తసందోహం చేత సేవింపబడుతోంది. అట్టి కరవీరపురం ఎంతో పవిత్రక్షేత్రమై సమస్త పాపాలను పరిహరిస్తూ వ్యాధులను తొలగిస్తూ భక్తుల పాలిట కామధేనువై వెలుగొందుతోంది.

ఒక దినం నైమిశారణ్యంలో మహాలక్ష్మి సంకల్పంతో దేవతలందరూ కలిశారు. వీళ్లతోపాటు యక్ష గంధర్వులు, అగస్త్య, కాశ్యప, గౌతమ,

దూర్వాస, మార్కండేయ, కపిల, జాబాలి, ముద్గళ, చ్యవన, వశిష్ఠ, విశ్వామిత్రాది మహర్షులు అందరూ సూతమహాముని కి సాదరంగా నమస్కరించి ఈ విధంగా ప్రార్థించారు.

"ఓ మహామునీ! మునుపు తమరు మాకు ఎన్నో క్షేత్ర మాహాత్మ్యాలను కథలరూపంలో వివరించి విజ్ఞులను చేశారు. మీకు దీర్ఘాయువును ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తున్నాం. తమ ద్వారా వివిధ పుణ్యస్థలాల ప్రాశస్త్యం విన్నాం. కాని ఇంకా మా మదిలో మరెన్నో సందేహాలు కలుగుతున్నాయి. కావున మాపై దయతో, ఏ క్షేత్ర సందర్శనంతో "గంగ, ప్రయాగ, రామేశ్వరం, గోకులం, శ్రీశైలం, చంద్రభాగ, పుష్కర మరియు కాశీ వంటి పుణ్యక్షేత్రాల సందర్శన సమష్టిఫలం లభిస్తుందో, ఆ పుణ్యక్షేత్ర గాథను మాకు తెలియజేయండి" అంటూ ఆసక్తిగా అడిగారు.

అప్పుడు సూతమహాముని ఇలా చెప్పసాగాడు. ఓ మునివరేణ్యులారా! మీరు దైవప్రేరణచే నాకు ఇలాంటి సమున్నత అవకాశాన్ని కల్పించారు. ధన్యుణ్ణి. భగవంతుని అనుగ్రహంతో చెప్తున్నాను. మీరు శ్రద్ధగా ఆలకించండి.

భూలోకంలో కరవీరం అనే ఒక పుణ్యక్షేత్రం ఉంది. ఈ క్షేత్రం వివిధ పవిత్రతీర్థాలతో అలరారుతోంది. ఈ నగరం కాశీపట్టణం కన్న మహోత్కృష్టమయింది. ఇచ్చట శ్రీమహావిష్ణువు స్వయంగా శక్తిరూపంలో అవతరించి ఉన్నాడు.

ఈ క్షేత్రంలో శ్రీమహాలక్ష్మి తన ఎడమచేతియందు దివ్యజ్ఞాన మకరందం నింపబడిన పాత్రను, కుడిచేతియందు మాతులుంగ ఫలాన్ని ధరించి దర్శన మిస్తుంది. ఆ దివ్యమంగళ రూపం "భక్తులారా! ఈ కలియుగంలో జీవితంలో ఎదురయ్యే ప్రాపంచిక యిక్కట్లను సమర్థవంతంగా అధిగమించడానికి ఈ పాత్రలోని పూతేనెను సేవించండి. దానికి తోడుగా మీకు ఈ మధురఫలాన్ని ప్రసాదిస్తాను" అనే అనుగ్రహాన్ని వ్యక్తీకరిస్తున్నట్లు ఉంటుంది.



శ్రీ మహాలక్ష్మిని దర్శించినంతనే ఘోరపాపాలు, భయంకరవ్యాధులు, ఎడతెగని కష్టాలు సైతం భస్మీపటల మవుతాయి. అందుకే ఈ తల్లి 'మహామాతృక' అనికూడ సార్థక నామధేయురాలు.

యుగయుగాలనుండి పరమపవిత్రమైన భాగీరథినది గంగవలెనే మహిమాన్వితమైన పంచగంగనది కూడ సర్వపాప హారిణిగా, ముక్తిదాయినిగా కొనియాడబడుతోంది. ఈ పుణ్యనదీ తీరాన వెలసిన దివ్యక్షేత్రం కరవీరపురం!

ఈ కరవీర క్షేత్రం పరిసరాల్లో సుమారు 1800 శివలింగాలు దివ్యశోభతో ప్రకాశిస్తూ, మనోజ్ఞమై, సందర్శకులకు భక్తిభావంతోపాటు దివ్య అనుభూతులను ప్రసాదిస్తున్నవి.

ఇచ్చుటికి దగ్గర్లోని "రుద్రగయ" పితృదేవతలకు పిండ ప్రదానం తప్పనిసరిగా ఆచరించవలసిన పవిత్రతీర్థం! ఈ నగరం అష్టదిక్కుల్లో రక్షణకై ఎనిమిది శివలింగాలు ప్రతిష్ఠింపబడి వున్నాయి. ఇవి జీవన్ముక్తిని ప్రసాదించే తేజోలింగాలు!

దైవాంశ సంభూతమైన 'జీవంతి' నదిని అంతర్లీనం గావించుకొని వున్న జయంతినది, పవిత్ర జలాలతో నిండిన సరస్సులు, కూతవేటు దూరాన కొండపై రామేశ్వరం, మల్లికార్జున మహాలింగం, కల్లేశ్వరం, శ్రీచక్రపురి, సిద్ధులు, యోగులచే సేవించబడే ప్రయాగ మరియు రుద్రపాదం ఇలా కరవీర క్షేత్రానికి నల్దిక్కుల శోభ కల్గించే నదులు, తీర్థాలు గుళ్ల గోపురాలు చాలా వున్నాయి.

## క్షేత్ర ఔన్నత్యం

### (కరవీర ఖండం-పద్మపురాణం)

సూతమహాముని ఋషిపుంగవులతో ఈ విధంగా చెప్పాడు. మహాత్ములారా! ఒకదినం మార్కండేయమహర్షికి ఓ ఆలోచన కల్గింది.

'నేను వేద శాస్త్రాలన్నింటిని అభ్యసించి భూమండలంలోని సమస్త జ్ఞానాన్ని సముపార్జించాను. వివిధ ప్రాంతాలు పర్యటించాను. పలుభాషల పరిజ్ఞానం కూడా పొందాను. జ్ఞానసంపదతో పరిపూర్ణ జీవనం గడుపుతున్నాను. ఎన్నో యుగాలు గడిచాయి. కానీ, సమస్త దుష్కర్మ ఫలాలను వినాశనం చేసే ఆ భగవంతుని అనుగ్రహాన్ని మాత్రం ఈనాటికీ పొందలేకపోయాను. కావున స్వల్పకాలిక తపస్సు చేతనే శీఘ్రంగా జీవన్ముక్తిని ప్రసాదించే మహిమగల ప్రదేశమేదో?' అని చింతించసాగాడు. అంతలో అక్కడ త్రిలోకసంచారి నారదమహాముని ప్రత్యక్షమయ్యాడు.

మార్కండేయుడు ఆయనకు మ్రొక్కి 'స్వామీ! తమరు ప్రత్యక్షమవడం నా అదృష్టం. మీ రాక ఆకలిగొన్న వ్యక్తికి పంచభక్ష్య పరమాన్నాలు సిద్ధించినట్లుగా వుంది. కావున మీరు నాయందు దయతో ఈ భూమండలంలో ఏ పుణ్యక్షేత్రంలో సమస్త దేవతామూర్తులు దర్శనమిస్తారో, ఎక్కడ నా తపస్సు ఫలించి సత్వరం దైవానుగ్రహాన్ని, మోక్షప్రాప్తిని పొందగలనో తెలియజేయండి' అని ప్రార్థించాడు.

నారదుడు ఆత్మీయంగా 'మార్కండేయా! నీవు నా చిరకాల మిత్రుడవైనందున అట్టి రహస్యాన్ని నీకు మాత్రం తెలియజేస్తున్నాను. ఈ సమాచారం గతంలో శ్రీమన్నారాయణుడు బ్రహ్మదేవునికి చెప్పగా, బ్రహ్మదేవుని ద్వారా నేను తెలుసు కొన్నట్టిది. అట్టి పుణ్యక్షేత్రం సాక్షాత్ మహాలక్ష్మికి స్థానమై ఎచ్చట జలరూపంలో పరమశివుడు, శిలారూపంలో శ్రీమహావిష్ణువు, సైకత రూపంలో మహాయోగులు స్వయంభువులై వున్నారో అట్టి కరవీరపురం తప్ప వేరొకటి లేదు. సూర్యగ్రహణ కాలంలో స్నానమాచరిస్తే ప్రాప్తించే పుణ్యఫలం, కరవీర క్షేత్రంలోని తీర్థరాజాల పవిత్రజల సంప్రోక్షణ మాత్రాన్నే సర్వదా కలుగుతుంది. మహావిష్ణువు యొక్క స్థానానికి శ్రీమహాలక్ష్మి రాకతో ఇచ్చట ఐహిక సుఖాలతోపాటు ఆముష్మిక ఫలం కూడా సమృద్ధిగా ప్రాప్తిస్తుంది. కావున ఇది కాశీక్షేత్రంకన్నా మిన్న. శ్రీమహావిష్ణువు ఈ



భూమండలంలో రెండు పవిత్ర క్షేత్రాలను ముక్తిధామాలుగా సృష్టించి వున్నారు. అవి భరతఖండపు ఉత్తరార్ధంలో కాశీ క్షేత్రం మరియు దక్షిణార్ధంలో కరవీర క్షేత్రం. ఈ కరవీర క్షేత్రంలో శ్రీవిష్ణువు స్వయంగా 'శక్తి మరియు శంకరుల' రూపాలలో వెలిసివున్నాడు".

తన సమస్య పరిష్కారమై మార్గం సుగమం కాగా మార్కండేయుడు పరమానందభరితుడయ్యాడు.

ఇంకా నారదుడు ఇలా చెప్పసాగాడు.

ఆహ్లాదకరమైన ఒకరోజు సాయం సమయంలో కైలాసంలో శివపార్వతులు సరస సల్లాపాలాడుతుండినారు. వీరి సంభాషణల్లో, కాశీ మరియు కరవీర క్షేత్రాలలో ఏ క్షేత్రం గొప్పది అనే చర్చ తలెత్తింది.

శ్రీమహావిష్ణువు ఒక తుల(తక్కెడ)లోని రెండు పళ్ళెరాలలో ఈ రెండు నగరాలను ఉంచి చూడగా 'నా నగరమైన కాశీ క్షేత్రమే భారవంతమైనదని' తేలినట్లు శంకరుడు వాదించసాగాడు. వివిధ పుణ్యతీర్థాలు కల్గియుండి దేవతలందరకు నెలవైన నా నివాసమే ఉన్నతమై తులతూగుతున్నదని మందహాసంతో తల్లి పార్వతి ఖండించింది. వారికి సర్దిచెప్తూ శ్రీ మహావిష్ణువు "కాశి–కరవీర నగరాలను రెండింటిని నేను భేదరహితంగా సృష్టించాను. కాని పార్వతి నుడివినట్లు ఒక వరిగింజ ఎత్తు కరవీరపురం అధికంగా బరువువున్నది" అని తెల్పగా శివపార్వతులు సంతుష్టులయ్యారు.

కావున "ఓ మార్కండేయా! ఆలకించు. ఆనాటి నుండి కరవీర క్షేత్రం ముల్లోకాల్లో ప్రాశస్త్యం పొందింది. సమస్త గణాలతో కూడి సదాశివుడు కాశీనగరంలోను, కరవీరనగరంలోని మణికర్ణిక తీర్థమందున, ఇరుక్షేత్రాల్లోను దర్శనమిస్తున్నాడు.

ఇక్కడి సరస్సుల్లోని జలం సాక్షాత్ మహాశివుని శిరస్సు నుండి భువికి దిగిన గంగే. కాశీ నుండి విశ్వనాథుడు నిష్క్రమిస్తున్నట్లు తెలుసుకొన్న

ప్రయాగ బిందుమాధవ క్షేత్రాలు కూడా కరవీర నగరానికి తరలివచ్చాయి. మహాకాళి రూపంలో పరమశివుడు, సరస్వతి రూపంలో బ్రహ్మ, లక్ష్మీదేవి రూపంలో మాధవుడు, ముప్పది మూడు కోట్ల దేవతలతో కలిసి కరవీరపురంలో కొలువైనారు. ఈ నగరంలోనే మోక్ష ద్వారాలైన ద్వారక, గోమతి స్థిరంగా వున్నాయి. ఇచ్చటి పృథ్వి, జల, తరుపాషాణాదులు సైతం పవిత్రాలై ఆధ్యాత్మికతతో తొణికిసలాడుతుంటాయి.

అడుగడుగునా శివలింగాలు ప్రతిష్ఠింపబడి ఉన్నందున ఈ ప్రదేశం కైవల్యాన్ని ప్రసాదించడంలో ప్రపంచంలో సాటిలేనిదయింది. ఇచ్చట అర్హులైనవారికి చేసిన చిరుదానం, మేరుపర్వత సమానమైన ఫలాన్నిస్తుంది. ఇచట మహాలక్ష్మి నామస్మరణ మాత్రాన్నే సకల సంపదలు ఒనగూడుతాయి. ఆకలిగొన్న వారికి చేసిన గుప్పెడు అన్నదానం, భూ, వజ్ర, వైఢూర్య దానాలతో సమానమైన ఫలాన్నిస్తుంది. ఈ క్షేత్రంలో చేసిన ఆహార వస్త్రాది దానాలు కోటి దేవాలయాలు కట్టిన ఫలంతో సమానం. అనగా గోదాన ఫలంతో సమానం.

దానాలు, విరాళాలు, స్తోత్రాలు కావించిన వారికి సమస్త పాపాలను తొలగించి స్వర్గలోకప్రాప్తి కల్గించేందుకు శ్రీదత్తుడు ఈ క్షేత్రంలో సంచరిస్తుంటాడు. ఆ సత్యం తెలుసుకొన్న కపిలమహాముని ఈ క్షేత్రానికి వచ్చి దైవ అనుగ్రహం కోరి ఇచ్చుటనే నివసించసాగాడు. కాశీపురాన్ని వీడిన వ్యథను మరచి అగస్త్య మహాముని ఈ నగర దక్షిణదిశలోను, పరాశరుడు సోమతీర్థంలోను, వ్యాసమహర్షి వైశాలినగరంలోను నివసించసాగారు.

ఈ దివ్యక్షేత్రానికి వశిష్ఠుడు తన ఎనభైఎనిమిది వేలమంది శిష్య సమూహంతోను, వారి పరివారంతోను కలసి చేరుకున్నాడు.

కరవీరక్షేత్రం వైపు వేసే ప్రతి అడుగు పితృదేవతల మోక్షప్రాప్తికి బాసట కాగలదు. కరవీర పురాన్ని దర్శించని వాని జన్మకు సార్థకత లేదు. సృష్టి



స్థితి లయ కారకులు వున్న ఈ నగరంలో నివసించడం, దేహాన్ని చాలించడం, పరిపూర్ణ జీవన సాఫల్యానికి, దైవ సన్నిధి ప్రాప్తికి, సోపానాలని పురాణాలు వల్లిస్తున్నాయి.

## అగస్త్య శాపం - సుద్యుమ్నుని గజరూపం

నారదుడు ఇంకా ఈ విధంగా చెప్పసాగాడు.

“ఓమారు పరమభక్తుడైన అగస్త్యుడు తన శిష్యబృందంతో దక్షిణదేశంలోని పుణ్యక్షేత్రాల సందర్శన ప్రారంభించాడు. మొదటగా కరవీరపురానికి చేరుకొని శ్రీమహాలక్ష్మిని నమస్కరించాడు. శ్రీమహాలక్ష్మి అగస్త్యుని ప్రథమంగా “శ్రీమహాగణపతికి సోదరుడైన కార్తికేయుని సందర్శించి రమ్మని” ఆదేశించింది.

తదుపరి అగస్త్యుడు కులపర్వత ప్రదేశానికి అరుదెంచి అచ్చటి ప్రకృతి శోభను ఆస్వాదించసాగాడు. దట్టమైన పచ్చని ఎత్తైన చెట్లమీది, పక్షుల కిలకిల రావాలతో, సరస్సులలోని తామర పూవుల మకరందాన్ని ఆస్వాదించే నల్లని తేనెటీగల ఝుంకారాలతో, ఆ ప్రదేశం మనోజ్ఞంగా భాసిల్లుతోంది. ఆ పర్వత శోభను తిలకించిన అగస్త్యుడు ఆనందంతో పులకించాడు. కానీ అక్కడే ధ్యాన నిమగ్నుడైన సుద్యుమ్నమహర్షి, అగస్త్యుని రాకను గమనించలేదు మరి!

సుద్యుమ్నమహర్షిచేత సాదరంగా ఆహ్వానించబడని అగస్త్యుడు అవమాన భారంతో ఆగ్రహోదగ్రుడైనాడు. “నేను వాతాపి–ఇల్వలుడు’ అనే రాక్షసులను చంపి సాగరాన్నే పుక్కిట బట్టిన వాడను. నా ఔన్నత్యాన్ని గుర్తించి, గౌరవించని వాడవైనందున నీవు గజరూపివై అడవులందు తిరుగాడు చుందువు గాక! అని సుద్యుమ్నుణ్ణి శపించాడు.

శాపవిమోచనకై సుద్యుమ్నుడు ఆవేదనతో దీనంగా ప్రార్థించగా, దయాళువైన శ్రీమహావిష్ణువు “పూర్వజన్మ దుష్కర్మ వలన నీవు గజరూపం ధరించవలసి ఉన్నది. తరువాత నీవు సత్వరమే నా వద్దకు చేరగలవు.

ఒకరికి కష్టం కలిగించిన వ్యక్తికి కష్టం కలుగక మానదు. నిను శపించిన వారు దుఃఖాన్ని అనుభవిస్తారు" అని అనుగ్రహించాడు.

నారదమహర్షి మార్కండేయునితో తన ప్రసంగాన్ని ఇలా కొనసాగించాడు.

"ఒకదినం వైకుంఠంలో శ్రీమహావిష్ణువు నాతో ఈ విధంగా అన్నాడు. సాత్వికులైన నా భక్తులను అగస్త్యుడు కష్టాలపాలు చేశాడు. కావున నీవు అతనికి తగు విధంగా గుణపాఠం నేర్పవలెను. పూర్వం ఉత్తరదేశంలో కాశీనగరాన్ని, దక్షిణదేశంలో కరవీరనగరాన్ని నేను సమతుల్యం చేసి ఉన్నాను. కాశీనగరంలో నేను విశ్వేశ్వరుని రూపంలో వెలసియుండి తారకమంత్ర ప్రభావంతో ఈ మానవులకు భవబంధాల నుండి విముక్తి కల్పిస్తున్నాను. కరవీరనగరంలో మహాశక్తి రూపంలో శ్రీమహాలక్ష్మిగా నా భక్తులకు దర్శనమిస్తున్నాను. శక్తిస్వరూపిణి మాత్రమే ఈ లోకంలో భక్తజనులకు సుఖమయమైన జీవితాన్ని కల్పించగలదు. కరవీర నగర ప్రవేశం మానవులకు జీవితకాలంలో సుఖసంపదలు, మరణానంతరం ముక్తి కల్పించగలదు. కావున ఈ నగరం కాశీపట్టణం కన్న మేటి అయింది.

అయోధ్య మొదలైన సప్త ప్రదేశాలు ముక్తి ప్రదాయకాలు. శ్రీశైలం, కరవీరం, రామేశ్వరం, విరూపాక్షపురం, పాండురంగపురం వంటి పుణ్య క్షేత్రాలు దర్శనభాగ్యం చేతనే ఇహ పరలోకాల సుఖాలను ఏకంగా ప్రసాదించు నట్టివి. ఈ సత్యాన్ని గ్రహించలేనివాడు మూర్ఖునితో సమానం. నా భక్తులను ద్వేషించువారు ఉత్తర, దక్షిణ కాశీ పట్టణాల్లో ఎచ్చటా నివసించడానికి అర్హులు కానే కారు. కావున అగస్త్యుని కాశీనగరం నుండి బహిష్కృతుని చేయవలెను" అని ఆదేశించారు.

## మేరువు - వింధ్య రాజుల స్పర్థ

నారద మహర్షి మార్కండేయునితో సంవాదం ఈ విధంగా కొనసాగించాడు.



"శ్రీ మహావిష్ణువు ఆదేశం మేరకు అగస్త్యమహర్షిని కాశీ నగరం నుండి బయటకు పంపే ప్రయత్నాన్ని ప్రారంభించాను. ముందుగా పవిత్ర నర్మదానది ప్రవహిస్తూ తన దివ్య స్పర్శచే మానవుల సంసార దుఃఖాలను రూపు మాపుతున్నదో, అట్టి వింధ్య పర్వతసానువులకు చేరాను. అచ్చట వృక్షాలన్నీ వివిధ ఫలపుష్పాలతో సమృద్ధిగా వుండి దట్టమైన అరణ్యం మనోజ్ఞంగా వుంది. పక్షుల కిలకిలరావాలు ప్రతిధ్వనిస్తున్నాయి. భాస్కర సమానతేజుడైన వింధ్యపర్వతరాజు నన్ను ఆహ్వానించి అర్ఘ్యపాద్యాల నిచ్చాడు. అంతట నేను మేరుపర్వతరాజుతో అతనికి గల స్పర్థను వెలికితీసి అతనికి గల పటిమను గుర్తు చేస్తూ ఉత్తేజితుడ్ని చేశాను. వింధ్య పర్వతరాజు ఎంతో వినయ సంపన్నుడు. అది ఆతని ఔన్నత్యం. అంతటి ఆకారోన్నతుడైనా నాకు సాష్టాంగ ప్రణామా లాచరించి భక్తి ప్రపత్తులతో పూజలు సల్పి, "ఆర్యా! ఇది నా భాగ్యం. ఈ సదవకాశం మరొక్కమారు రాదు. మేరు పర్వతం మాత్రమే ఈ భూమిని భరించగలదన్న మాటకు కాలం చెల్లింది. స్వయంగా నేనొక్కడినే అతన్ని అధిగమించ గలవాడను. నేను మేరు పర్వత రాజు ఔన్నత్యాన్ని గుర్తించను. ఆత్మస్తుతి ఉత్తముల లక్షణం కాదు. అతని ఆధిక్యాన్ని, అంగీకరించి నేనెందుకు ప్రణామం చేయాలి" అని పలికాడు.

అందుకు నేను "ఓ పర్వతోత్తమా! నీవు సత్యం పలికావు. ఆ మేరువు క్రితంలో పలుమార్లు నిన్ను అవమానపరచాడు. కాని, నీవు సాగరమంత సహనంతో నిలిచావు. వాస్తవానికి మాకు మీరు ఇరువురు సమానులే. కానీ నీవు జీవితమంతా ఆతని ఆధిపత్యాన్ని అంగీకరించి క్షేమంగా వుండగలవా? అని ప్రశ్నించాను.

అంత ఆ నగరాజు ఇలా ఆలోచించాడు. "నారదుడు నన్ను గొప్పవానిగా ప్రశంసించాడు. ఈతని నమ్మకాన్ని వమ్ము చేస్తే నా జీవితం అర్థరహితం అవుతుంది. స్వకులస్థులచే అవమాన పడినవాడు ప్రశాంతంగా నిద్రించగలడా? అసత్యం పలుకవలసిన అవసరం నారదుని కేమున్నది?

ఇది సముచితమా, కాదా అని చాల రోజులు బలహీనులు మాత్రమే యోచిస్తారు. సూర్యుడు, నక్షత్రాలు అతనికి చాల దూరంలో సంచరిస్తున్నందునే మేరువు గర్విష్ఠి అయినాడు. నేను ప్రత్యర్థులచేత గేలి చేయబడరాదు. ప్రతిభ చూపకుంటే సమర్థులు కూడా అవమానింపబడతారు కదా!".

అని ఇలా ఆలోచించిన వింధ్యుడు తన ఔన్నత్యాన్ని నిరూపించు కొనేందుకు మేరుపర్వతం మీది స్పర్థతో పైకి ఎత్తుగా ఎదుగనారంభించాడు.

వింధ్యుని ఎదుగుదలవల్ల సమస్త జగతికి వెలుగునిచ్చే సూర్యదేవుని రథగమనం నిరోధించబడింది. సమస్త లోకాలలో అంధకారం అలముకొని కాలచక్రం స్తంభించింది. ఈ ఘోరస్థితి త్రిలోకాలను కలచివేసింది. ప్రళయకాలం ఆసన్న మైందని తలచిన సమస్త మునులు, దేవతలు, సృష్టికర్త బ్రహ్మదేవుని ఈ విపత్కర పరిస్థితి తొలగించుమని శరణు కోరారు. అంత బ్రహ్మ "ఓ బిడ్డలారా! మీ భక్తిపూరిత ప్రార్థనకు ప్రసన్నుడనయ్యాను. మీరు ఈ కష్టానికి వెరువరాదు. కాశీనగరంలో అగస్త్యమహాముని దరిచేరి ప్రార్థించండి. వింధ్యుడు ఆ అగస్త్యమహర్షి శిష్యుడు. మీ సమస్యను పరిష్కరించటానికి అతడే సమర్థుడు" అని పలికాడు. వెంటనే సకలదేవతలు, మునివర్యులు, దేవగురువు బృహస్పతి, ఇంద్రుడు మొదలగువారు కాశీనగరానికి చేరుకున్నారు.

## వింధ్యుని శృంగభంగం

సకల దేవతలు, ఋషులు నిత్యానుష్ఠానాలను ముగించి భక్తితో భవాని శంకరులను పూజించి, లోపాముద్ర సహితుడైన అగస్త్య మహామునిని సందర్శించారు. రుద్రాక్షధారియైన అగస్త్యుడు ధ్యానముద్రలో వున్నాడు. అతిథుల ప్రశంసలను అందుకున్న అగస్త్యుడు వారిని ఆశీర్వదించాడు.

అంత బృహస్పతి అగస్త్యునకు ఈ విధంగా నివేదించాడు. "ఆర్యా! ఈ ప్రదేశం లోపాముద్ర పాతివ్రత్య మహిమ చేత, తమ తపశ్శక్తిచేత



పరమపవిత్రమైనది. మీ కటాక్షం గంగాస్నాన సదృశం. ఇచ్చటికి మహేంద్రుడు తన బృందంతో, దైవిక శక్తుల రూపంలో నిత్యం మిమ్ము కొలిచేందుకు వస్తారన్నది సత్యం. అలాంటి ఉదాత్తులైన తమరు వింధ్య పర్వత ఔద్ధత్యాన్ని ఉపశమింపచేయ తక్షణమే ఉపక్రమించి మమ్మల్ని అనుగ్రహించండి".

అగస్త్యుడు ఈ విధంగా యోచించాడు. "రుద్రులు, ఆదిత్యులు, యముడు, అశ్వినీదేవతలు, వింధ్యుని ఔద్ధత్యాన్ని హరింప శక్తిలేని వారా? ఈ కార్యాన్ని నేనే ఏల నిర్వహించవలసి వున్నది? కాశీనగరాన్ని వీడవలసిన ఈ వైపరీత్యం పూర్వజన్మ దుష్కర్మలవలన సంభవించినట్లున్నది. నా మనస్సు ఆవేదనా భరితమవుతోంది. గత జన్మ కర్మల ననుసరించి ఎవ్వరైనా, తత్ఫలాన్ని అంగీకరించి అనుభవించ వలసిందే కదా? పూర్వం దేవతల శ్రేయస్సు కోరి దధీచి మహర్షి తన ఎముకలను సైతం త్యజించాడు. అలాగే కాశీ నిష్క్రమణకు సంసిద్ధమగుటయే నా ప్రస్తుత కర్తవ్యమై ఉన్నది".

## అగస్త్యుని దక్షిణదేశ యాత్ర

తల్లిని ఎడబాయు బిడ్డవలె ఆవేదనతో కాశీనగరమంతా ఒక్కమారు సందర్శించినవాడై యోగిపుంగవుల అనుజ్ఞ పొందిన అగస్త్యుడు తన తపోమహిమ చేత క్షణమాత్రాన వింధ్యపర్వత ప్రాంతానికి చేరాడు.

రుద్రునిలాగా కోపంగా వున్న అగస్త్యుని చూచి భయకంపితుడైన వింధ్యుడు తన ఆకారాన్ని పూర్వపుస్థాయికి తగ్గించుకొన్నవాడై శిరస్సు వంచి ప్రణమిల్లి "ఓ మహర్షీ! నీ సేవకు సిద్ధమై ఉన్నాను. ఆజ్ఞాపించండి" అని పలికాడు.

అంత అగస్త్యుడు "ఓ పర్వతరాజమా! నీవు జ్ఞానసంపద గల్గిన మహా యోగివి. నేను దక్షిణ ప్రదేశానికి ప్రయాణిస్తున్నాను. నేను తిరిగి వచ్చేవరకు నీవు ఇలాగే వంగివుండు పెరగకు. లేకుంటే తదుపరి పరిణామాలకు నీవే

బాధ్యత వహించవలసి ఉంటుంది. నీవు నా తపశ్శక్తి, సామర్థ్యాలను ఎరిగి వున్నవాడవే కదా!" అని పలికాడు. ఆ ఆదేశాన్ని వింధ్య పర్వతరాజు సవినయంగా అంగీకరించాడు.

అలా అగస్త్య లోపాముద్రల పాదముద్రలు దక్షిణ భారతాన్ని పవిత్రం కావించాయి. యధావిధిగా దివ్యకాంతులతో భాస్కరుని రథం తన ప్రయాణాన్ని కొనసాగించింది. ప్రపంచమంతా సుఖసంతోషాలు వెల్లి విరిసాయి. అగస్త్యుని పునరాగమనానికి వింధ్యపర్వతం, చకోరంలా ఇంకా ఎదురు చూస్తూనే ఉంది.

## అగస్త్యుని మనోవ్యాకులత నివృత్తి

అగస్త్యమహర్షి పత్నితో గూడి సుందర గోదావరినదీ తీరంలో ఆశ్రమవాసియై యజ్ఞ యాగ, తపోచర్యాది క్రతువులు నిర్వహించసాగాడు.

నిత్యం పరమశివుని ప్రత్యక్ష అభిషేక పూజాదికాలు నిర్వహింపలేని అగస్త్యునికి ఆవేదన కలచివేయసాగింది. అతడు దక్షిణదేశంలో కాశీనగరంతో సమానమైన క్షేత్రాన్ని ఎంచుకోలేక విషణ్ణవదను డయ్యాడు. మతిస్థిమితం లేనివాడై వ్యవహరిస్తూ "ఓ పరమశివా! సదా నిన్ను వీక్షిస్తూ, నీ పాదసేవ చేసుకుంటూ తరించటానికి అనువైన పవిత్ర పుణ్యస్థలాన్ని చూపించి నన్ను ధన్యుణ్ణి చేయి" అంటూ ప్రార్థించాడు.

అంత సదాశివుడు అతని మనస్సులో "కరవీరక్షేత్రం" స్ఫురించేలా అనుగ్రహించాడు. అలా అగస్త్యుడు కరవీరక్షేత్ర మాహాత్మ్యాన్ని తన దివ్యశక్తితో గ్రహించి తన సతి లోపాముద్రకు వెల్లడిస్తూ మహాలక్ష్మి రూపంలో వున్న సాక్షాత్ శ్రీమహావిష్ణువు, దక్షిణహస్తంలో వున్న కరవీరపుష్పం యొక్క ప్రాధాన్యతను విశదపరిచాడు. ఇలాగ దైవప్రేరణవల్ల అగస్త్యమహర్షికి కాశీనగర వియోగ వేదన పరిహారమైంది.



అతడు దివ్యానందంతో లోపాముద్రకు ఇంకా ఇలా వివరించసాగాడు. "ఈ ప్రదేశం సకల దేవతామూర్తుల సాన్నిధ్యం వల్ల ఎంతో పవిత్రమైంది. ఇచట కాశీవిశ్వేశ్వరుడు మణికర్ణిక యందు విడిది చేసియున్నాడు. భోగభాగ్యాలను ప్రసాదించి ముక్తిని అనుగ్రహించే శ్రీమహాలక్ష్మి తనంతట తానే స్వయంవ్యక్తమై నిలిచివుంది. ఇక్కడి తీర్థాలలో సమస్త దేవతలు కొలువై ఉన్నారు. ఈ ప్రదేశం పవిత్ర జలాశయాలతో అలరారుతోంది. ఇచ్చట చేసిన దానాలు సర్వసంపదల సిద్ధికి ఏకైకమార్గం. రుద్రప్రయాగలో చేసిన పిండప్రదానం పితృదేవతలకు అత్యంత ప్రీతికరం!

పూర్వం ఒకమారు శ్రీమహావిష్ణువు పరమశివునితో "నీ ఆయుధమైన త్రిశూలంలోనికి కాశీనగరాన్ని ఆవాహన గావించు. కరవీరనగరాన్ని శ్రీమహాలక్ష్మి కౌమోదకి యందు ధరించి కాశీతో సమానంగా చేస్తుంది. నేనే లక్ష్మీ స్వరూపంలో ఈ నగరంలో అవతరిస్తాను. అనేక పుణ్యతీర్థాల చేత అలరారే ఈ నగరాన్ని లక్ష్మీదేవి తన దక్షిణ హస్తాన ధరించి వుండగలదు" అని పలికి ఈ కరవీర నగరాన్ని ఆవిష్కరించాడు.

ఈ దక్షిణకాశి ఇన్ని విశిష్టతలతో వున్నందున సమస్త దేవతలు ఇచ్చటనే వేంచేసి ఉన్నారు. పాపనాశన తీర్థంలో స్నానం ఆచరిస్తే సమస్త వ్యాధులు నయమవటమేగాక, పాపాలన్నీ పరిహారమవుతాయి. ఈ తీర్థరాజాలలో స్నానమాచరించడం చేతనే భగీరథుని పితృదేవతలు మోక్షప్రాప్తి నొందారు. ఈ తీర్థ మాహాత్మ్యంవల్లనే రుద్రుడు, చంద్రుడు, ఇంద్రాది దేవతలు వారి వారి పాపాల నుండి విముక్తి పొందారు. అదేవిధంగా బ్రాహ్మణుడైన సుశర్మ, చంద్రసేనుడు, పరశురాముడు, దుర్వాసుడు, నారదుడు మరియు పాండవులు తమ తమ శాపాలనుండి ఈ క్షేత్రమందే విముక్తి పొందారు. కరవీర నగర ప్రవేశమాత్రాన్నే సమస్త జనులకు జన్మ సార్థక్యత కల్గి మోక్షం ప్రాప్తిస్తుంది. నాలుగు యుగాల కాలప్రభావం వల్ల ఈ పుణ్యక్షేత్ర పరిధి క్రమంగా క్షీణించసాగింది.

ఇచ్చటి ముక్తిమండపంలో చేసిన దానధర్మకార్యాలు సిద్ధిస్తాయి. సమస్త దేవతలు సర్వదా శ్రీమహాలక్ష్మిని ఇక్కడ స్తోత్రం చేస్తుంటారు. స్వర్ణ కలశంతో కాత్యాయని తన నవకోటి సఖులతో కలిసి దీపహారతులనిస్తుంది. చతుషష్టి యోగినీ గణాలు అనునిత్యం శ్రీమహాలక్ష్మిని స్తుతిస్తుంటారు. దండపాణి, భైరవుల భేరి నాదాలతో జరిగే దివ్యమంగళ హారతులను చూస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలను వినే భక్తుల జన్మ ధన్యమవుతుంది. శ్రీమహాలక్ష్మి సమక్షంలో నృత్యదర్శనం, సంగీత శ్రవణం, తపస్సు కైవల్య ప్రదాయకాలు. ఇలాంటి తీర్థరాజం గుర్చి మున్నెన్నడు ఎవ్వరు విని వుండరు. దర్శించి వుండరు"

భర్త మనోవ్యాకులత వీడి పూర్వపు తపోశక్తితో ప్రకాశించడంవల్ల లోపాముద్ర మిక్కిలి ఆనందంతో, పరవశయై భక్తిమీర పరమశివుని స్తోత్రం చేయసాగింది.

## పరాశరుని రాక

పావన గోదావరినదీతీరం నుండి కరవీరపురానికి ప్రయాణం సాగించే సమయంలో లోపాముద్ర అగస్త్యమహామునిని ఇలా ప్రశ్నించింది.

"నాథా! కరవీరపురానికి పరాశర మహాముని రాక ప్రాధాన్యమేమిటి? వారు ఎట్టి పుణ్యకార్యాలను నిర్వహించారు?"

అగస్త్యుడు ఇలా చెప్పసాగాడు. "సాధ్వీ! పరాశరుని కథలు మహిమాన్వితమై లోకకళ్యాణ కారకమైనవి. శ్రద్ధగా విను.

అది భూలోక నందనం. నైమిశారణ్యం. కలియుగంలో మానవకోటిని కబళిస్తున్న "అల్పజీవన ప్రమాణం, బుద్ధిమాంద్యం" అన్న అవలక్షణాలు మహాముని పరాశరుని కలచి వేశాయి. కలిప్రభావాన్ని నియంత్రించి లోకకళ్యాణం కావించ దలచాడు పరాశరుడు. విష్ణుని గూర్చి తపస్సు చేసి ప్రసన్నుని కావించుకొని వేదవిజ్ఞానం పొందాలన్న దీక్ష బూనాడు. కలి ప్రభావాన్ని నియంత్రించే శక్తి కలిగిన కరవీరపురమే, కాశీనగరంకన్నా



మిన్న అని గ్రహించి, అక్కడే తపస్సు చేయదలచాడు. నైమిశారణ్యం నుండి సతీసమేతంగా కరవీరనగరంలో ప్రవేశించాడు పరాశరుడు. నాలుగు చెరగుల నిండుగా ప్రవహిస్తున్న నదులు, కనువిందు చేస్తున్న పూమొక్కలతో సుందరవనాలు, స్వచ్ఛమైన జలంతో సమృద్ధిగా తొణికిస లాడుతున్న సరస్సులు, పిల్లగాలులకు లయగా సున్నితంగా ఊగుతూ ఆహ్వానాన్ని అందించే తామరపూలు, నగర సంరక్షణకోసం నాలుగుదిక్కులలో వెలసిన అష్టలింగాలు, వాటి నడుమ సుదర్శనాన్ని ధరించి శేషశయనుడైన శ్రీమహావిష్ణువుని చూచి సంతోషంతో పులకించాడు.

"ఆహా! బ్రహ్మాది దేవతలు సదా అన్వేషించే పవిత్ర ప్రదేశాన్ని నేను ఇప్పుడే కనుగొన్నాను. ఇది జన్మాంతర సుకృతమేగాక ఈ జన్మలో చేసుకున్న పుణ్యఫలం. ఈనాటికి సంపూర్ణ భగవదనుగ్రహం పొందగలిగాను" అని తలచుకొంటూ, పులకితుడై ప్రయాగతీర్థం వైపు ప్రయాణమయ్యాడు. వాయువ్యదిశలో 'బాల్ ఖిల్వ' ప్రదేశం కనువిందు చేసింది. అక్కడ బ్రహ్మ కుంభీనదీ రూపంలోను, విష్ణువు – భద్రనదీరూపంలోను, మహేశ్వరుడు – శివనదీ రూపంలోను సమ్మిళితమైనందున ఈ త్రిమూర్తి సంగమం ఎంతో పవిత్రతను సంతరించుకున్నది.

పరాశరుడు "ఈ త్రివేణిసంగమంలో స్నానమాచరించి వేదపఠనం గావించిన వారి సమస్త పాపాలు తొలగి జన్మ సాఫల్యత సిద్ధిస్తుంది" అని అనుగ్రహించాడు.

పరాశరుడు త్రివేణీసంగమంలో స్నానం ఆచరించి, సంధ్యావందనం ముగించి విప్రులకు గో, భూ, సువర్ణాది దానాలు చేశాడు. తక్షణం ప్రాప్తించిన అపూర్వ దైవశక్తితో దివ్యానందభరితుడై కరవీరక్షేత్రం చేరాడు.

అచ్చటి కాశీ తీర్థంలో స్నానమాచరించి భవాని, విశ్వేశ్వర, విఘ్నేశ్వర, దండపాణి, కామాక్షి, వారాహి, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది త్రిమూర్తులు, నంది రుద్ర, వితలాదులకు మ్రొక్కి ప్రార్థించాడు.

## పరాశర తీర్థం

తదుపరి పరాశరుడు శ్రీమహాలక్ష్మిని దర్శించి పులకితగాత్రుడై ఇలా స్తోత్రం చేయసాగాడు. "ఓ మహామాతృక! జ్ఞానులై త్యాగధనులైనట్టివారికి నీవు సుఖసంపదల నిచ్చి ధన్యులను చేశావు. సృష్టి, స్థితి, లయ కారకురాలవు నీవే. భక్తులకు సర్వోన్నతిని ప్రసాదిస్తావు. నీ దర్శనమాత్రాన్నే నేను ధన్యుడనయ్యాను. ఈ పవిత్ర ప్రదేశంలో సదా నిన్ను సేవిస్తూ తరించేలా అనుగ్రహించు".

ఆ ప్రార్థనకు ప్రసన్నురాలైన పద్మవాసిని, పరాశరుని అనుగ్రహించి ఇలా పలికింది. "ఓ పరాశరా! నీవు ధన్యుడవు. భగవద్భక్తి హీనులు, సకల ధర్మాలను తెలియజేసే వేదాలను, సదాచారులై ధర్మబోధ గావించే బ్రాహ్మణులను గౌరవించనివారు, నా భక్తులకు కడగండ్లు కల్పించేవారు, కరవీరంలో వుండడానికి అర్హులు కారు. నీవు తత్వవేత్తవు. జ్ఞానివి. జితేంద్రియుడవు. నీ నివాసం ఇక్కడి నుండి పశ్చిమదిశలో ఐదు క్రోసుల పరిధి "పరాశర తీర్థం" అను నామంతో ప్రసిద్ధి పొందుతుంది. నీ కోరికలన్నీ నెరవేరేలా అనుగ్రహిస్తున్నాను"

అలా మహాలక్ష్మిచేత ఆశీర్వదింపబడిన పరాశరుడు, ముక్తిమండపంలో ప్రవేశించి హారతిని స్వీకరించాడు. అచటికి పశ్చిమదిక్కున పర్ణశాల ఏర్పరచుకొని శాస్త్రోక్తంగా మహాలింగ ప్రతిష్ఠ గావించి నిత్య అభిషేకార్చనలతో కొలిచినందువల్ల ఆ ప్రదేశం "పరాశరలింగక్షేత్ర"మని, "పరాశర తీర్థమని" ప్రసిద్ధి గాంచింది.

ఇక్కడ పరమశివుని పూజించి సేవించినవారికి మోక్ష సామ్రాజ్యం కలుగుతుందని పరాశరుడు అనుగ్రహించాడు.

ఇచ్చటి గయక్షేత్రంలో ఒకటిన్నర నెల కాలం నివసిస్తే ఏడుతరాల పితృ దేవతలు, సమస్త పాపాలు తొలగినవారై కృతార్థులవుతారని శాస్త్రాలు వల్లిస్తున్నాయి. ఇది పితృదేవతలకు పిండ ప్రదానాలు జరుపవలసిన పవిత్ర ప్రదేశం. స్వపిండ ప్రదానం కూడా ఇచట ఆచరణీయం. గయతీర్థంలో నిర్వహించబడిన శ్రాద్ధకర్మలు, – "బ్రహ్మజ్ఞానాన్ని పొందివుండటం, గోశాలయందు మరణం, కురు క్షేత్రసందర్శన"లతో సమానమైన మోక్ష ప్రదాయకాలు. ప్రేతపర్వతం వద్ద నిర్వహించబడిన శ్రాద్ధకర్మలు పితృదేవతలకు ఉత్తమగతులు ప్రాప్తింపచేస్తాయి. కాబట్టి ఆ ప్రదేశం మిగుల విశిష్టమైనదిగా అభివర్ణింపబడింది. స్వయంగా శ్రీమహావిష్ణువే ఇచట నెలకొనివున్నాడు. ఇచటి మోక్షప్రదాయని అయిన వటవృక్షరాజం సమస్త లోకాలయందు పూజలందుకొను నట్టిది. శ్రాద్ధపిండములు, వాయసములకు ఆహారంగా నివేదించుట బహు పుణ్యకార్యం. ఈ వటవృక్ష సమీపంలో ఆకలిగొన్న వారికి గావించిన అన్నదానం, వేయిమంది బ్రాహ్మణులకు చేసిన అన్నదానంతో సమానం. ఈ క్షేత్రంలో తరతమ వర్గభేదం చూపకుండా ఆకలిగొన్నవారిని అన్నదానంతో తృప్తిపరచటం విధిగా పాటించే ఆచారమై వుంది. పూర్వం ఈ పవిత్రక్షేత్రంలోని ఆశ్రమంలో పరాశరుడు తపోదీక్ష సాగించాడు.

## బ్రహ్మగిరి సందర్శనం

తరువాత పరాశరుడు "బ్రహ్మగిరి" క్షేత్రాన్ని సందర్శించాడు. ఇది బ్రహ్మ దివ్యతపస్సు ఆచరించి, సరస్వతిని భార్యగా పొంది, సకల చరాచర జీవరాశులను సృష్టించిన ప్రదేశం. ఇచట సోమేశ్వరలింగం ప్రతిష్ఠితమై ఉన్నది. ఇక్కడ తపస్సు కావించిన వారి కోర్కెలు సత్వరమే సఫలమవుతాయని ప్రతీతి!

ఈ ప్రదేశం మహావృక్షాలతోనేగాక మనోహరమైన పుష్పగుచ్ఛాలతో కూడిన లతలతో అలరారుతుంటుంది. మత్తకోయిలల కుహూకుహూ గానాలు, తుమ్మెదల ఝంకారాలు సందర్శకులను ఆత్మీయంగా ఆహ్వానిస్తుంటాయి. ఆ దుర్గమారణ్యం సింహాది క్రూరమృగాలకు నివాసం.

పరాశరుడు ఆ ప్రదేశంలో ఒక కుటీరంలో తన పత్ని మరియు శిష్యబృందంతో కలిసి నివసింప దలచాడు. సదాశివుని పూజించి పంచాగ్ని మధ్యలో సాధన ప్రారంభించాడు.

దేవలోకంలో ఇంద్రుడు ఇది గమనించి తన పదవికి ప్రాప్తించబోయే గండాన్ని తలచి భయభ్రాంతుడయ్యాడు. అంత మన్మథుని పిలిపించి అద్వితీయమైన అతని అందాన్ని ప్రశంసించాడు. ఉత్తేజితుడైన మదనునికి పరాశరుని తపోభంగం కావించే బాధ్యతను అప్పగించాడు. మదనుడు ఇంద్రుని సహకారంతో అకాల వసంతఋతువును సృష్టించి, నర్తకియైన రంభతో బ్రహ్మగిరికి చేరుకొన్నాడు. ఆ ప్రదేశం ప్రకృతి సహజశోభతో మనోజ్ఞంగా విరాజిల్లుతోంది. కదళీఫల వృక్షాలు ఫలభారంతో వయ్యారంగా వంగి ఆ ప్రదేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచివున్నాయి. అక్కడంతా సూర్యరశ్మి సైతం సోకని దట్టమైన హరితవనాలు, బలంగా పెరిగిన ఎత్తైన మానులు కను విందు కల్గిస్తున్నాయి. పచ్చని ఆకులపై సేద తీరే నీటిబిందువులు, సూర్యకిరణాలు సోకగానే మాణిక్యాల్లా ప్రకాశిస్తున్నాయి. వివిధ వర్ణాల పూపొదరిండ్లు ఇంద్ర ధనుస్సును మరపిస్తున్నాయి. సంపూర్ణంగా పండిన దానిమ్మపండ్లు తమ సౌందర్య ప్రదర్శనకన్నట్లు చిట్లి మనస్సులను దోచుకొంటున్నాయి. ప్రియుని ఆత్మీయంగా ఆలింగనం చేసుకొన్న స్త్రీలా, ప్రేమతో పెనువృక్షాలను అల్లుకొన్న లతలు అందంగా అలరారుతున్నాయి. అప్సర, మన్మథుడు, వసంత ఋతురాజు, మలయమారుతాల ఆగమనంతో ఆ ప్రదేశం మరింత శోభ గూర్చుకొని ఆహ్లాదం కల్గిస్తోంది. వారు దూరంనుంచే పరాశరుని గమనించసాగారు.

కానీ, ఏ భగవంతుని సమక్షంలో క్రూరమృగాలు సైతం తమ జన్మ సహజ సిద్ధమైన క్రౌర్యాన్ని, జంతువులు తమ పరస్పర శతృత్వాన్ని వదలి శాంతితో జీవిస్తాయో అట్టి శ్రీహరి ధ్యానంలో గాఢ నిమగ్నమై ఉన్నాడు మహర్షి పరాశరుడు.



## పరాశర స్థితప్రజ్ఞత

మన్మథుని సృష్టియైన సుగంధ పరిమళాలు, సమ్మోహనమైన సంగీతం, నృత్యాదులు పరాశరుని దీక్షను భంగం గావించాయి. మునిశాప భయంతో మన్మథాదులు రంభను అక్కడే వదలి వైదొలగారు. స్థల మాహాత్మ్య ప్రభావం చేత పరాశరుడు నిగ్రహం పొందాడు. అంత రంభను చూచి కోపోద్రిక్తుడై “అవశ్యం ఈ ప్రదేశాన్ని వీడిపో. లేకుంటే నా కోపాగ్నిచే నిన్ను దగ్ధం చేయగలను” అని పల్కి, తన పత్ని సత్యవతిని ఉద్దేశించి ‘ఈ దుష్ట స్త్రీని శాపగ్రస్తను చేసి శిక్షించు’’ అని ఆదేశించాడు. అంత రంభాది అప్సరగణాలతో గూడిన మన్మథాదులు భయకంపితులై పశ్చాత్తాపంతో పరాశరునికి మొక్కి క్షమాభిక్షకై ప్రార్థించారు. స్థితప్రజ్ఞుడైన పరాశరుడు “ఓ దేవతలారా! మీ పశ్చాత్తాపానంతర సంస్కారానికి ప్రసన్నుడనయ్యాను. ఆవేదన చెందకండి. మా ఆతిథ్యం స్వీకరించి వెళ్లండి. అతిథులైన మీరు నా పూజాదికాలు అంగీకరించని ఎడల ఈ స్థల మాహాత్మ్యమే శూన్యమవుతుంది. ఆతిథ్యం స్వీకరించకుండా వెళ్ళడం తమ పాపాలను గృహస్థుకు సంక్రమింప చేయడం వంటిది” అని పలికాడు. విస్మయంతో అప్సరసలు పరాశరుని ఔన్నత్యాన్ని వేనోళ్ళ ప్రశంసించసాగారు. అంత మన్మథుడు ముకుళిత హస్తుడై “ఓ మహర్షీ! నీవు నీ కోపాన్నేకాక నన్ను కూడా జయించావు. నీ సహచరియై సర్వదా పూజ్యురాలైన నీ పత్ని సౌశీల్యాది గుణాలను గూర్చి విన్న మాత్రాన్నే మేము పవిత్రుల మవుతాం. పరమ పతివ్రతలు అయిన సావిత్రి, మేనాదేవి వంటి సాధ్వీమణులు ఈమెను సదా పూజిస్తారు. ఆమె తమకు అనుకూలవతి అయినట్టిది. భర్త అభీష్టాలు తనకు ప్రీతిపాత్రాలుగా తలచునట్టిది. రతి సమయంలో తప్ప భర్తతో వేరెప్పుడు హాస్యప్రసంగం చేయనిది. అట్టి పవిత్ర స్త్రీ విష్ణుసాన్నిధ్యానికి అర్హురాలు. యమదూతలు సైతం ఆమె దరిచేర సాహసించరు. తమ పత్ని తేజోస్వరూపిణి. అట్టి మీ ఇరువురకు అజ్ఞానులమై మేము అపకారం గావింప

తలచాం. మమ్ము క్షమించి అనుగ్రహించండి" "ఓ మహర్షీ! దేవేంద్రునకు తమరు ఏ ఆదేశాలను తెలియచేయమంటారో సెలవివ్వండి" అని పలికాడు.

మందస్మితుడై, మన్మథాది దేవతలతో పరాశరుడు ఇలా పలికాడు. "తపో శక్తిని – భోగభాగ్యాలు పొందడానికి, ఐహికసుఖాల కోసం, వానికి బానిసలవడం కోసం, కాకుండా సమస్త లోకాల సౌఖ్యం కోసం వినియోగించాలి. కరవీర పుర వాసులు స్వర్గసౌఖ్యాలు ఆశించరు. గతంలో ఇచ్చటి కుండాలలో స్నానం ఆచరించి నీవు పాపాన్ని పోగొట్టుకొన్న విషయం మరిచావా? కష్టాలను కలిగించే దేవతలు బుద్ధిహీనులు కదా!" అన్నట్లు ఇంద్రునకు తెలియజేయండి.

మన్మథుడు భక్తిపారవశ్యంతో ఇలా ఆలోచించాడు. "పూర్వం సదాశివుడు నన్ను భస్మం గావించి తన కోపంపై కాక – నాపై మాత్రం విజయం సాధించినాడు. కానీ, ఏ మాశ్చర్యం! పరాశరుని తపోభంగం చేయడానికి నేను ప్రయోగించిన త్రివిధాస్త్రాలు వ్యర్థమయినాయి. నాకు జ్ఞానోదయమైంది. ఇట్టి దుశ్చర్యలు గావించే నా ఈ బుద్ధిహీనతకు లోకం నన్ను పరిహసించదా?"

'కరవీరపురంలోని కుండాలలో స్నానమాచరించి హారతి స్వీకరించి, దాన ధర్మాలాచరించిన భాగ్యశీలురకు అపరిమిత శక్తి ప్రసాదింపబడుతుంది. ఆ క్షణంలో పరాశరుడు మన్మథాదులను శపించి వుంటే, తన సమస్త తపోశక్తిని కోల్పోయేవాడు. కోపాన్ని జయించినవాడు ధన్యుడు."

## నాగేశ్వరలింగ ప్రతిష్ఠ- నాగజారి

అగస్త్యుడు లోపాముద్రతో ఇలా చెప్పసాగాడు.

పరాశరుడు మదనునిచే భంగం కావించబడిన ఘోరతపస్సును పునః ప్రారంభించాడు.



పరాశరుని తపోనిష్ఠకు పాతాళలోకంలో సైతం ఉష్ణజ్వాలలు ప్రజ్వరిల్లాయి. ప్రతీకారంగా నాగదేవతలు పరాశరుని తపోశక్తికి మూలాధారమైన వేలాది కుండాలలోని నీటిని గ్రహించి కరవీరనగరాన్ని నిర్జలం గావించారు.

ఈ దుశ్చర్య గ్రహించిన పరాశరుడు తన తపోశక్తితో మంత్రించిన దర్భలచే కుండాలన్నింటిని తిరిగి జలభరితం చేశాడు. అంత సర్పరాజాలన్నీ పరాశరుని తపోశక్తికి దాసులై అతని ఔన్నత్యాన్ని వేనోళ్ళ ప్రశంసించాయి. అప్పుడు పరాశరుడు "ఓ నాగులారా! కుండాలలోని నీటిని పరిగ్రహించిన మీరందరు పవిత్రులైనారు. అట్టి మీరు మిమ్ము పూజించినవారిని పవిత్రులను చేయగలరు. మీ రాకచే పవిత్రమైన ఈ ప్రదేశం ఈనాటి నుండి "పన్నగాలయం"గా ప్రసిద్ధి కాగలదు" అని వరమిచ్చాడు. అంత నాగదేవతలు మిక్కిలి ఆనందంతో తిరిగి పాతాళ గంగను భూలోకాన ప్రవహింపజేశారు. పూర్వం పుణ్యకుండాలలోని జలాన్ని సేవించని నాగులు మాత్రం నిరాశతో, విషణ్ణవదనాలతో తమ తమ నివాసాలకు వెళ్లాయి.

అలా పరాశరుడు అచ్చట "నాగేశ్వరుని" ప్రతిష్ఠించి ఆ ప్రదేశానికి 'నాగజారి" అను పేరిడినాడు. ఇచ్చట నాగేశ్వరుని సేవిస్తే సమస్త నాగదోషాలు పరిహార మయ్యేలా అనుగ్రహించాడు.

## నాగుల శాపవిముక్తి

"నాగజారి" యందు పరాశరుడు తపస్సు చేసే రోజుల్లో ఒకనాడు నాగులు విష జ్వాలలు వెళ్ళగక్కుతూ ఆ ప్రాంతాన్ని కలుషితం చేశాయి. సమస్త జీవరాశులకు ప్రాణభీతి కలుగసాగింది. ఆగ్రహించిన మునిపత్ని సత్యవతి వారిని "మూగవారలై పోవుదురుగాక" అని శపించింది. పశ్చాత్తాపంతో వ్యథ చెందిన నాగులు పరాశరుని శరణుగోరి శాపం నుండి బయటపడే ఉపాయం సూచించమని ప్రార్థించారు.

అంతట పరాశరుడు వారితో "సహజ సిద్ధమైన విషం త్యజింపలేనిది. మీ కోరిక నెరవేరుటకు కరవీర క్షేత్రాన్ని సందర్శించండి. అచట జమదగ్ని మహాముని కోపమనే దుర్గుణాన్ని ,యజ్ఞయాగాది క్రతువుల నిర్వహణతో జయించాడు. అక్కడ మీ కోరిక ఫలిస్తుంది. దాతృత్వంచే ఎన్నదగినవారు, భగవదారాధకులు, తమ తమ పాపాల నుండి అచ్చట సత్వర నిష్కృతి పొందుతారు. నాస్తికుడు మాత్రం ఈ నిష్కృతి పొందలేడు.

భౌతికశరీరం శాశ్వతం కాదని, ఆత్మయే శాశ్వతమని గ్రహించి జీవిత కాలంలో నిస్వార్థంగా దానధర్మాదులు చేస్తూ, నియమనిష్ఠలతో మహామాతృకను ఆరాధిస్తూ జీవనం సాగించే వ్యక్తి ధన్యజీవి. గంగాస్నానానికై బయల్దేరిన వ్యక్తి మార్గమధ్యంలో మరణిస్తే అతడు పుణ్యస్నానం చేసిన ఫలం పొందగలడు. అది మనసా వాచా, కర్మణా నిబద్ధతతో ఆచరించబడే ధర్మం యొక్క విశిష్టఫలం.

కరవీర క్షేత్రం సుమంగళియైన స్త్రీకి పరదేవతా నిలయం. కావున, క్షుర కర్మలు మరియు ఉపవాసాలు ఇచట నిషిద్ధాలు.

మానసతీర్థంలో స్నానమాచరిస్తే కైవల్య పదప్రాప్తి కల్గుతుంది. మనోస్వచ్ఛత అనేది "అగ్నిదేవతకు, అతిథికి చేయు పూజాదికాల కన్నా, వివాహ త్యాగం మరియు సత్యవ్రత ఆచరణకన్నా మిక్కిలి శ్రేష్ఠమైనది. కేవలం పుణ్యతీర్థాలలో స్నానమాచరించటంవల్లనే మోక్షం రాదు. అలా అయితే జలచరాలైన చేపలు సైతం స్వర్గఫలం పొందగలవు కదా! కావున మనస్సులోని కల్మషాన్ని కడిగివేసి, ఇంద్రియాలను నియంత్రించగల్గడం పవిత్రతీర్థస్నాన ఫలసమానం. గంగ, సింధు మొదలైన నదులు, అయోధ్యాది సప్త నగరాలు, హిమాలయాలు నిస్సందేహంగా సమున్నతమైనవి. సందర్శన మాత్రాన్నే అవి మోక్షం ప్రసాదించగలవు.



అలా పుణ్యక్షేత్రాలన్నింటిలో శ్రీచక్ర నిలయమైన కరవీరపురం ప్రముఖ దివ్య శక్తిపీఠం. కావున మీరు కరవీరనగరంలో వివిధ తీర్థాలలో భక్తిగా పుణ్యస్నానాలు ఆచరించి, మహాలక్ష్మి దర్శనం చేసుకొని, పూజించి ఆ దేవి కృపతో శాప విముక్తిని పొందండి" అని జ్ఞానోపదేశం చేసి అనుగ్రహించాడు.

అదే విధంగా నాగులు మహాలక్ష్మిని సేవిస్తూ ఆ దేవికృపచేత పునీతులై తిరిగి వాక్కును పొంది ఆనందంగా జీవించసాగారు.

## నాగతీర్థ ప్రశస్తి

ఓమారు ఆకస్మికంగా గరుడుని రాకను గమనించి ఆతని ఆ జన్మ వైరులైన నాగులు ప్రాణభయంతో పాతాళం వదలి కరవీరనగరం చేరాయి. ఆ నాగదేవతలు అందరూ ముక్తిమండపాన్ని వైభవోపేతంగా అలంకరించి సమస్త పూజాద్రవ్యాలను సేకరించి, సందర్భోచితంగా శ్రీమహాలక్ష్మిని, అచట వేంచేసియున్న సమస్త దేవతలను భక్తితో పూజిస్తూ సర్వసిద్ధి మంత్రాన్ని పఠిస్తూ యజ్ఞం చేశారు.

"ఓంకార రూపిణి! శుభప్రభ, విష్ణు హృదయగామిని, పద్మాక్షి, విశ్వాంగ, నందిని, సూక్ష్మ, శృంగార, కమల, చక్రి, స్వానంద, శక్తిరూపిణి, అష్టాదశ పీఠవాసిని, కోటిచంద్ర సమప్రభ, ఆద్యంత రహిత, వారాహి, మంత్రయోగిని, యోగద్రష్ట, హంసవాహిని, బ్రహ్మాండకోటి సంయుక్త, నాదబిందు-కళాబిందు రూపిణి, శక్తిరూపిణి, సహస్రారస్థాన, ఉమ, పద్మిని, జ్వాలాశోభిత, సూర్యకోటి ప్రతీకాశ, సుశీతల, మహాదేవి, సర్వమూర్తికళ, బ్రహ్మరూపవ్యవస్థిత" ఇత్యాది నామాలతో సన్నుతిస్తే శ్రీమహాలక్ష్మి ప్రసన్నురాలవుతుందన్నది పరమసత్యం. అట్టి ఆరాధనకు ఫలం :

మొదటి మాసానంతరం - దుఃఖాలు తొలగిపోవటం

రెండవ మాసానంతరం - పేదరికం నశించటం

మూడవ మాసానంతరం – ఆకాశ గమనం

నాల్గవ మాసానంతరం – విద్యాధర రూపం పొందటం

ఐదవ మాసానంతరం – ఆస్థాన ధర్మసిద్ధి

ఆరవ మాసానంతరం – భగవదంశను పొందగోరి భక్తిశ్రద్ధలతో నాగులందరు ప్రార్థించసాగారు.

ప్రసన్నురాలై ప్రత్యక్షమయిన లక్ష్మీదేవిని చూచి నాగదేవతలు, 'ఓ మహా మాతృక! మమ్ము నీ పవిత్ర క్షేత్రంలో నివసింప అనుమతించండి. గరుడుని వల్ల కలిగే ప్రాణభీతిని తొలగించండి" అని వేడుకొన్నారు.

అంత లక్ష్మీదేవి "ఓ నాగదేవతలారా! మీకు అభయ మిస్తున్నాను. గరుడిని వల్ల మీకు ఎట్టి ప్రమాదం వాటిల్లదు. భీతిల్లకుడు. గతంలో మీ విషం వెదజల్లబడిన ప్రదేశాలు పవిత్ర కుండాలుగా వాసి కెక్కగలవు" అని అనుగ్రహించింది.

అంత నాగదేవతలు ముక్తి మండపంలో సంగీతనృత్యాది కార్యక్రమాలతో వేడుకలు జరుపుకొంటుండగా శ్రీమహాలక్ష్మి శిరస్సున నాగప్రతిమ కనిపించింది. అది దేవి అనుగ్రహసూచకమనీ, లక్ష్మీ కటాక్షం పొందినామని నాగదేవతలు గ్రహించి మిక్కిలి సంతోషించారు. వారంతా కరవీరక్షేత్రంలో తూర్పు దిక్కున ఓ మాసకాలం మిక్కిలి భక్తిశ్రద్ధలతో శ్రీమహాలక్ష్మిని పూజిస్తూ జీవించారు. ఆ ప్రదేశం నాగతీర్థ మనే పేరుతో వినుతి కెక్కింది.

## కల్లేశ్వరం

లక్ష్మీదేవిచే అనుగ్రహింపబడిన నాగదేవతలు కాత్యాయనీదేవి సమక్షంలో చక్రేశ్వర తీర్థ ప్రాంతంలో విషాన్ని త్యజించి పశ్చిమదిక్కుకు ప్రయాణం సాగించారు.



ఆ ప్రదేశం వేవేల పవిత్ర జలకుండాలతో శోభిల్లుతోంది. పూర్వం ఇచ్చట శివపార్వతుల పాదస్పర్శచే పునీతములైన కల్లేశ్వరం, హరిపురంలోని సంగమేశ్వరం కూడా జగజ్జనని కృపచేత ఆధ్యాత్మికత వెల్లి విరియగా మిక్కిలి ప్రఖ్యాతి పొందాయి. ఈ తీర్థమందు కల్లేశ్వరలింగం ప్రతిష్ఠించబడి ఉంది. శ్రావణమాసమందు ఇక్కడి తీర్థంలో స్నానమాచరించి, కల్లేశ్వరుని అభిషేకించి పూజించిన వారికి సకల సంపదలు చేకూరుతాయి.

శ్రావణశుద్ధ పంచమినాడు ఇచ్చట నాగపూజ గావించిన వారికి సమస్త పాపాలు నశిస్తాయి.

ఐహిక సుఖాలకు దాసులై భక్తిభావం లేక శ్రీమహాలక్ష్మిని స్మరించనివారు గరుడునిచే చంపబడతారన్నది నిర్ధారిత సత్యం. ఇలా విషాన్ని త్యజించి శ్రీమహాలక్ష్మిని శరణుకోరిన నాగులు దేవీకృపతో సూక్ష్మరూపులై ధన్యులైనారు.

## నాగశిల

నాగదేవతలను అనుగ్రహించి ప్రసన్నురాలైన లక్ష్మీదేవి ఇలా చెప్పసాగింది. "ఇచ్చటకు ఉత్తరభాగంలో పెనుశిల ఒకటి వున్నది. ఏదో ఒకనాడు ఆ పెనుశిల పెద్ద సర్పాకృతిలోనికి మారుతుంది. ఆ ప్రదేశం మీకు నివాస యోగ్యంగా ఉంటుంది. మీరచ్చట నివసిస్తూ భక్తులైన మానవుల నాగదోషాలను నివృత్తి కావించండి. ఆ ప్రదేశం నేటి నుండి మీ నామంతో ప్రసిద్ధి పొందగలదు. అచట మిమ్ము ఆరాధించిన వారి కోరికలన్నీ తీరగలవు.

పూర్వం ఇక్కడ మహిషాసురుడనే రాక్షసుడు నివసించేవాడు. అతని దుశ్చర్యలకు దేవతలు భయాందోళనలకు గురి అయ్యారు. దేవతలను రక్షించి ధర్మాన్ని నెలకొల్పేందుకు మహిషాసురుని వధించే సందర్భంలో నా పాదాలు ఆ రాతిపై ముద్రింపబడ్డాయి. మహిషాసురుని వధ సమయంలో నా వైజయంతిమాల నుండి జారిపడిన ఒక ముత్యం మహాశంభులింగ రూపంలో

భాసిల్లుతోంది. నేను పూర్వం ఒకమారు అక్కడ ఏడురోజులు దివ్యదర్శనం కల్పించి వున్నాను. ఆ ప్రదేశం 'షిరోల' అనే నామంతో ప్రసిద్ధి గాంచింది.

అక్కడ నేను శ్రియాదేవి రూపంలో శ్రీకుండవాసినినై ఉన్న సమయంలో కాత్యాయని తన తొమ్మిది కోట్ల పరిచారికలతో కూడి నన్ను దర్శించి సేవించింది. కావున ఈ ప్రదేశం ఎంతో మహిమాన్వితమయింది. శ్రావణశుద్ధ పంచమి దినాన ఇచట మిమ్ము పూజించిన భక్తులు ఎట్టి విష ప్రభావాలను పొందరు. అంతేగాక సమస్త సంపదలతో వర్ధిల్లుతారు."

సందేహ నివృత్తి పొందిన నాగులు అక్కడ సుఖసంతోషాలతో నివసించ సాగారు. నాటి నుండి ఆ శిల 'నాగశిల'గా పేర్గాంచింది. సమీపంలో వున్న కొలనులో స్నానమాచరిస్తే కుష్ఠు మొదలుగాగల దీర్ఘవ్యాధులు తొలగటమేగాక సమస్త పాపాలు పరిహారమయ్యేలా శ్రీమహాలక్ష్మి అనుగ్రహించింది. ఈ నాగుల పవిత్ర కథ విన్నా, చదివినా, అట్టివారు కామ, క్రోధాది అరిషడ్వర్గాల ప్రభావాలకు లోను కాకుండా, అంత్యంలో స్వర్గలోకాన్ని పొందుతారని శ్రీమహాలక్ష్మి వరమిచ్చింది.

## శ్రీలక్ష్మి అనుగ్రహం

ఎన్ని అడ్డంకులు కలిగినా పరాశరుడు తన తపస్సును తదేక దీక్షతో కొనసాగించాడు. అందువల్ల ఆయన శరీరం శుష్కించి బలహీనుడయ్యాడు. అతని తపోనిష్ఠకు ప్రసన్నురాలైన లక్ష్మీదేవి గరుడవాహనంపై ప్రత్యక్షమై, "పరాశరా! నీ తపస్సుకు మెచ్చాను. నీకేం వరం కావాలో కోరుకో!"– అని పలికింది.

"శ్రీహరివంటి తనయుని కోరుకుంటే, ఆ వరం ఆమె దివ్యశక్తికి మించినదేమో," అని మనసులో సందేహించాడు పరాశరుడు. మరుక్షణమే ఆ తలపును గ్రహించిన శ్రీదేవి చిరుదరహాసంతో "నీవు శ్రీహరికి



ప్రీతిపాత్రుడవైన భక్తుడవు. నేను స్వయంగా శ్రీహరి స్వరూపిణిని" అని పల్కుతూ సమస్త ఆయుధధారియై శ్రీమహావిష్ణురూపంలో దర్శనమిచ్చింది.

వెంటనే చేతులెత్తి నమస్కరిస్తూ, పరాశరుడు ఇలా ప్రార్థించాడు. "ప్రపంచ మంతటికి సదా దివ్య తేజస్సును ప్రసాదించే ఓ తల్లీ! నీవు ద్వివిధ భ్రమలను కల్గించేదానవు. అజ్ఞులైన మాకు సత్యం కూడ కొన్నిమార్లు అసత్యంగా తోచవచ్చు. నీవు బహుద్వైకరూపిణివి. నీ స్త్రీ – పురుష స్వరూపాలు భేదరహితాలు".

అంత శ్రీమహావిష్ణువు ఇలా పలికాడు. "శ్రీమహాలక్ష్మికీ, నాకూ ఎట్టి భేదం లేదు. పూర్వం శుంభనిశుంభుల ఘోరతపస్సుకు మెచ్చి, వారు ఏ పురుషునిచేతా మరణం చెందకుండేలా వరమిచ్చాను. వారు సమస్త లోకాలను జయించిన వారై అధికారబల గర్వాలచేత ప్రజలను ఇక్కట్లపాలు చేశారు. అంత లోకకళ్యాణార్థం నేను లక్ష్మీరూపధారుడనై వారిని సంహరించాను. వారివలె ద్వంద్వ బుద్ధితో కరవీరపురంలో నివసించటం వ్యర్థం" అని పలుకుతూ, యథారూపం దాల్చింది శ్రీలక్ష్మి,

"పరాశరా! విష్ణువు అంతటి కుమారుని ప్రసాదించమని కోరావు. అనుగ్రహించాను" అని పల్కుతూ అదృశ్యమయింది. దివ్యానందంతో వినమ్రుడైన పరాశరుడు అచటనే తన తపస్సును సభక్తికంగా కొనసాగించాడు.

అగస్త్యమహర్షి లోపాముద్రతో 'దేవీ! ఇలా కరవీరక్షేత్రంలో శ్రీమహాలక్ష్మి అనుగ్రహంతో సమస్త సుఖాలు కరతలామలకాలు" అని పలికాడు.

## వ్యాసమహర్షి జననం

ఒకనాడు పరాశరుడు భార్యాసమేతుడై భద్రనదిలో స్నానమాచరించి తీరాన ధ్యాననిమగ్నుడయ్యాడు. ఆ సమయంలో సత్యవతి ఆ నదిలోని

ఆడామగా చేపల శృంగారకేళిని ఆసక్తితో వీక్షించసాగింది. ఆలస్యానికి ఆగ్రహించిన పరాశరుడు ఆమెను 'మత్స్యగర్భాన జన్మించెదవుగాక' అని శపించాడు.

భయంతో కంపించిన సత్యవతి భక్తితో మ్రొక్కి "స్వామీ! కరుణించండి. నియంత్రణ లేని మనోజనితాలైన తప్పులు మానవ సహజం కదా! తప్పిదం అతి సూక్ష్మమైనది కాగా అందుకు శిక్ష పర్వతమంతనా!'' అని ప్రాధేయపడింది. పశ్చాత్తాపంతో పరితపించే సత్యవతి ప్రార్థన విన్న మహర్షి "నా శాప ప్రభావంచే నీవు స్త్రీగా జన్మించగలవు" అని కటాక్షించాడు.

అంత సత్యవతి "స్వామీ! నా గర్భాన సాక్షాత్ శ్రీమహా విష్ణువే మీ బిడ్డగా జన్మించేట్లు వరమీయండి" అని ప్రార్థించింది. అందుకు పరాశరుడు చిరు నగవుతో అనుగ్రహించాడు. అలా సత్యవతి యోగమాయ అనుగ్రహంతో ఓ మత్స్యగర్భంలో ప్రవేశించింది.

తన వలలో చిక్కిన చేప గర్భంలో వున్న ఓ అందమైన బాలికను గమనించిన ఆ మత్స్యకారుడు ఆ బిడ్డను అల్లారుముద్దుగా పెంచాడు. ఆ యువతి మత్స్యగంధి అయినందున యువకులు ఏ ఒక్కరు ఆమెను వివాహమాడ ఇష్టపడకుండిరి. ఆమె సరంగుగా జీవనం గడపసాగింది. దివ్యజ్ఞానియైన పరాశరుడు ఆమెను అనుగ్రహించాడు. పరాశర సంభోగంతో మత్స్యగంధి గర్భవతియై వ్యాసునికి జన్మనిచ్చింది. సాక్షాత్ శ్రీమహావిష్ణువే వ్యాసుని రూపంలో జన్మించాడు. మత్స్య గంధిని కన్యగా, యోజనగంధిగా, మహారాణిగా అయ్యేలా ఆశీర్వదించాడు పరాశరమహర్షి. కొంతకాలం తరువాత ఒక దినం పరాశరునితో పాటు వ్యాసుడు కూడా తపమాచరించ బయల్దేరుతూ విషణ్ణవదనయైన తల్లికి "స్మరించినంత మాత్రాన్నే వచ్చి కలుసుకోగలనని" వాగ్దాన మిచ్చాడు.

వేద ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి తెలియచేయడానికి, మానవకోటికి మార్గ దర్శిగా, భువిలో ఉద్భవించిన వ్యాసుడు, యజ్ఞయాగాది క్రతువులను



ఆచరిస్తూ లోక కల్యాణార్థం నిరాఘాటంగా తన విధులను నిర్వర్తింపసాగాడు. ఆ దివ్యజ్ఞాని పాదస్పర్శచే పరాశరపర్వతం తన ఎత్తును తగ్గించుకొని పునీతమైంది.

## విశ్వామిత్రుని శాపం

కొంతకాలానికి బ్రహ్మర్షి పదం చేపట్టాలని విశ్వామిత్రుడు ఘోరతపస్సు చేశాడు. తన పదవికి ప్రాప్తించబోయే గండానికి వెరచి ఆ తపోభంగం కోసం ఇంద్రుడు సుగంధ అనే అప్సరసను నియోగించాడు.

విశ్వామిత్రుడు ఎంతకూ చలించనందున, ఆ అప్సర కన్య ఆయన వడిలో కూర్చొని సరససల్లాపాలాడసాగింది. కోపోద్రిక్తుడైన విశ్వామిత్రుడు ఆమెను "నీవు గోవుగా మారి కరవీరనగరాన మహాలయంలో తిరుగుతూ తదుపరి శ్రీకృష్ణుని కరస్పర్శచే విముక్తి పొందగలవు" అని శపించాడు.

అలా మహాలయంలో గో రూపంతో సంచరిస్తూ అనతి కాలంలోనే శ్రీకృష్ణుని మురళీగాన పరవశయై ప్రమాదవశాన నదిలో పడి ప్రవాహంలో కొట్టుకుపోతూ వుండింది. శ్రీకృష్ణుడు దాన్ని రక్షించాడు. ఆయన కరస్పర్శచేత అప్సరసగా మారి తిరిగి ఇంద్రలోకం చేరుకుంది సుగంధ.

## కాలయవనుని వధ

శ్రీకృష్ణుని జయించాలన్న దీక్షతో ఓమారు కాలయవనుడు అనే రాక్షసుడు మధురానగరంపై దండెత్తాడు. కాలయవనుని వధింప ఉపాయ మాలోచించిన శ్రీకృష్ణుడు అతనికి భయపడి పరుగెత్తుతున్నట్లుగా నటించాడు. కాలయవనుడు తనను వెంటాడుతూ రాగా ఒక పర్వతగుహ లోపల ప్రవేశించాడు.

ఆ పర్వతగుహలో ముచికుందుడనే మహారాజు ఎంతోకాలంగా తపస్సు చేసి నిద్రిస్తుండినాడు. కాలయవనుడు అతని దృష్టిలో పడేలా సమయోచిత

సందర్భాన్ని రచించాడు శ్రీకృష్ణుడు. గుహలో దూరిన కాలయవనుడు అక్కడ పడుకొన్న ముచికుందుని కృష్ణుడనుకొని తన్నాడు. తనకు నిద్రాభంగం చేసినవారిని ముచికుందుడు చూస్తేచాలు. భస్మమైపోయేట్టు వరం పొందాడు. తపోదృష్టికి కాలయవనుడు భస్మమయ్యాడు. లోకకళ్యాణానికి కారకమయిన ఆ పర్వతం గోవర్ధనగిరిగా ప్రసిద్ధ మయ్యేలా శ్రీకృష్ణుడు అనుగ్రహించాడు.

## పరాశరాశుని ఆశ్రమవైభవం

లోపాముద్ర కోర్కె మేరకు అగస్త్యుడు పరాశర ఆశ్రమ పరిసరతీర్థాల ప్రశస్తిని గూర్చి ఇలా చెప్పసాగాడు.

“దేవీ! ఇచ్చటి తీర్థస్థాన ఫలితం చెప్తాను విను.

బ్రహ్మకుండ తీర్థస్నానం వల్ల బ్రహ్మలోక ప్రాప్తి

కృష్ణకుండ తీర్థస్నానం వల్ల విష్ణులోక ప్రాప్తి

పరాశరకుండ తీర్థస్నానం వల్ల మోక్ష ప్రాప్తి

నాగకుండ తీర్థస్నానం వల్ల కుష్ఠు మొదలగు ఘోరవ్యాధుల నివృత్తి

సిద్ధకుండ తీర్థస్నానం వల్ల అతీంద్రియ శక్తి ప్రాప్తి

నృసింహకుండ తీర్థస్నానం వల్ల సార్వభౌమత్వ సిద్ధి

సోమకుండ తీర్థస్నానం వల్ల చంద్రలోక ప్రాప్తి

ఊర్వశికుండ తీర్థస్నానం వల్ల ఊర్వశిలోక ప్రాప్తి

మదనేశ్వరకుండ తీర్థస్నానం వల్ల ఆరోగ్యసంపదల ప్రాప్తి

శరమతేశ్వరకుండ తీర్థస్నానం వల్ల బ్రహ్మలోక ప్రాప్తి

వటకుండ తీర్థస్నానం వల్ల ఇష్ట ఫల ప్రాప్తి

గంధర్వేశ్వర కుండ తీర్థస్నానం వల్ల సుమధుర కంఠం



నాగేశ్వరకుండ తీర్థస్నానం వల్ల సమస్త పాప పరిహారం

వ్యాఘ్రకుండ తీర్థస్నానం వల్ల ప్రకృతి వైపరీత్యాల నుండి ఉపశమనం సిద్ధిస్తాయి.

ఆ విధంగా కరవీర మాహాత్మ్యం వర్ణనాతీతమైంది. “ఓ దేవీ! అశ్వాలయ దర్శనం ఘోర పాపాల నుండి విముక్తి కల్గిస్తుంది. శైలతీర్థంలో ఆరుమాసాల కాలం స్నానమాచరిస్తే శరీరం రాతివలె దృఢత్వం పొందుతుంది”.

## శుక్లతీర్థం

ఏ ఒక్క ప్రదేశంలోనైనా నిమిషం కూడా నిలువనివాడైన శుకమహర్షి వెలయింప చేసిన శుకతీర్థం. ఇదే “శుక్ల తీర్థం” పేరుతో ప్రయాగకు వాయువ్య దిశలో ఉంది. ప్రయాగ నుండి కొద్ది క్రోసుల దూరంలో ‘మను’ క్షేత్రం వెలసివున్నది. ఆ ప్రదేశానికి దక్షిణ దిక్కులో నదియందు కపిలతీర్థం నెలకొని వుంది.

ఒకనాడు దీర్ఘతపస్సు అనంతరం కపిలమహర్షి తిరిగి కరవీరపురానికి చేరుకున్నాడు.

ఒకప్పుడు ఈ తీర్థంలో స్నానం ఆచరించిన శ్వేతకేతువు అనే అతని పాపపంకిలమైన మురికి వస్త్రాలు, పరిశుభ్రమై తెల్లగా ప్రకాశించాయి. ఆనాటినుండి ఆ ప్రదేశం ‘శుద్ధతీర్థం’, ‘శుక్లతీర్థం’ అన్న పేర్లతో ప్రసిద్ధి గాంచింది. శుక్లతీర్థానికి తూర్పు దిక్కున భైరవ, విశాల మరియు వ్యాసాది తేజోమూర్తుల పాదస్పర్శవల్ల పలుతీర్థాలు వెలశాయి.

రాక్షస వంశజుడైన కోలాసురుడు పరిపాలించే కొల్హాపురం భోగభాగ్యాలతో, విజ్ఞానసంపదతో, ప్రజల సుఖసంతోషాలతో అలరారుతోంది. ఆ నగరాన్ని వైభవాన్ని విహంగ వీక్షణంతో పరిశీలించినా చాలు. సాటిలేని ఆ మహానగర ఔన్నత్యం అన్ని విధాలా సాక్షాత్కరిస్తుంది.

## బ్రహ్మావ్రతం

పావనమైన 'సరస్వతి' – 'హర్షధ్వతి' నదుల మధ్య "బ్రహ్మావ్రతం" అనే ప్రదేశం విరాజిల్లుతోంది. కురుక్షేత్ర పాంచాలాది ప్రదేశాలు, అందులో అంతర్భాగంగా వుండి దాన ధర్మాది త్యాగక్రతువులకు ఆచరణయోగ్యంగా ప్రసిద్ధమై వున్నవి. అట్టి ప్రదేశాల సందర్శన ఫలం అనుభవైక వేద్యం.

## జ్యోతిబా

ఆ విధంగా అగస్త్యమహాముని 'కరాడ' పట్టణం చేరి కృష్ణానదిలో స్నానం ఆచరించి పావకేశ్వరునకు మ్రొక్కి కరవీరనగరానికి ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో 'కోలే' వద్ద, 'వాటేగాంవ్' రాజైన కోలుని వధించిన నృసింహస్వామిని దర్శించుకొన్నాడు. తదుపరి పర్వతాగ్రాన వున్న 'జ్యోతిబా'ను సందర్శించాడు. భైరవుని అంశే 'జ్యోతిబా'.

జ్యోతిబా, పౌగంధుడు, విమలాంబుజలకు చైత్రశుద్ధ షష్ఠినాడు జన్మించాడు. భైరవుని అవతారమయిన జ్యోతిబా చతుర్భుజుడు.

దేవి ఆదేశంతో జ్యోతిబా ప్రజాకంటకుడైన రత్నాసురుని వధించాడు. రత్నాసురుని వధించిన ప్రదేశమే 'వాడి రత్నగిరి'గా ప్రఖ్యాతి గాంచింది. ఈ ప్రాంతం కొల్హాపురికి దక్షిణదిశన పర్వతంగా నెలకొని ఉంది. దానిచుట్టూ పచ్చని పర్వతాలతో, ఏటవాలుగా వున్న కొండచరియలతో, లోతైన లోయలతో ఆహ్లాదంగా వుంటుంది. ఈ పర్వతాలు మది దోచే పుష్పజాతుల మయమై గులాబిరంగుతో గోచరిస్తాయి.

అగస్త్యమహాముని అక్కడినుండి చంద్రవంకలా ప్రకాశిస్తున్న కరవీర నగరాన్ని వీక్షించాడు. ఆ సమయంలో తన కుడివైపు నుండి ఎడమకు నెమళ్ళు, నక్కలు, జింకలు గుంపులు గుంపులుగా పరుగెత్తడం గమనించాడు. అది త్వరలో ప్రాప్తించబోయే దేవి దివ్యదర్శనానికి, ఆశీస్సులకు శుభ శకునం.



కరవీర నగరాన కొలువైన దేవతలందరు మహాలక్ష్మి కటాక్షానికి పాత్రులై నగరానికి దివ్యశోభ కూర్చారు. ఈ నగరం మహాలక్ష్మీదేవి హస్తంలోని చక్రంలా గోచరిస్తోంది. ఇచ్చట లెక్కలేనన్ని పవిత్ర పుణ్యతీర్థాలు, స్థూపాలు, గుడి – గోపురాలు, యతులు మరియు సన్యాసినుల ఆశ్రమాలు కనువిందు కల్గిస్తూ చూపరులను భక్తిసాగరంలో ఓలలాడిస్తున్నాయి.

అలా రమణీయమైన ప్రకృతి, ఆధ్యాత్మిక సువాసనలు వెదజల్లే పూతోటలతో కొలువైన కరవీరంలోని మహాలక్ష్మి ఆస్థానంలో అనునిత్యం ముప్పొద్దుల నిర్వహించే వీనుల విందైన వేదప్రవచనాలను వింటూ నృత్య సంగీతాదులను, హారతులను ఆస్వాదిస్తూ లోపాముద్ర దివ్యానుభూతిని పొందసాగింది.

పిదప అగస్త్యుడు తన పత్నితో కలసి పంచనదుల సంగమ ప్రదేశమైన ప్రయాగ చేరుకుని అచ్చటి తీర్థంలో పుణ్యం స్నానం ఆచరించాడు. శక్తిమీర దానధర్మాలు చేసి పితృదేవతలకు శ్రాద్ధ కర్మలు నిర్వహించాడు.

## పంచగంగ సృష్టి

వైకుంఠంలో ఒకనాడు శ్రీమహావిష్ణువు బ్రహ్మదేవుని పిలిచి, ధర్మపరిరక్షణార్థం ప్రపంచజీవన గమనాన్ని పునఃసమీక్షించుమని ఆదేశించాడు. బ్రహ్మదేవుడు సరస్వతితోగూడి రక్షణగల ప్రదేశంలో కుటీరం ఏర్పాటు చేసికొని తపస్సు ప్రారంభించాడు. అచ్చట దశాశ్వమేధ యాగం యధోక్తంగా, విజయవంతంగా నిర్వహింపబూనాడు. ఆహూతులైన మహర్షులు 'కశ్యప, మాలవ, వశిష్ఠ, విశ్వామిత్ర, గార్గేయులకు' కుటీరాల్లో వసతి ఏర్పాటు కల్పించబడింది. ఆ యాగాన్ని వీక్షించడానికి సమస్త దేవతలు, యోగులు హాజరయ్యారు. వారు సృష్టికర్త బ్రహ్మ విగ్రహాన్ని మహోన్నతంగా వేదమంత్రాల మధ్య అపారమైన భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. తదుపరి అచటి, కుండంలో స్నానం చేసిన భక్తులకు దశయాగాలు చేసిన పుణ్యఫలం కలిగేలా వరమిచ్చి స్వర్గ లోకానికి ప్రయాణమయ్యారు.

పంచనదులలో పుణ్యస్నానం చేయటంవల్ల సంపూర్ణ యాగఫలం సిద్ధిస్తుంది. కనుక కశ్యప, గాలవ, గార్గేయ, విశ్వామిత్ర మరియు వశిష్ఠాది మహర్షులు ఏకమై తమ దివ్యశక్తిచే శివ, భద్ర, కుంభి, సరస్వతి, భోగవతి మొదలైన పంచ గంగలను ఇచ్చటికి ఆహ్వానించి స్థిరపరచారు. ఈ నదులన్నీ సాక్షాత్ బ్రహ్మ, విష్ణు శివుల స్వరూపాలే. అలాంటి పవిత్ర పంచగంగల సంగమ ప్రదేశంలో స్నానం చేస్తే ప్రాప్తించే ఫలం అమూల్యమైనదే కాక అనుభవైక వేద్యం కూడ!

ఈ పంచగంగ ప్రదేశం సర్వదా పుష్కలమైన పవిత్రజలంతో అలరారుతూ సమస్త దేవతా నిలయంగా ప్రాశస్త్యం పొందింది. దేవతలు ఇక్కడే యాగానంతర పుణ్యస్నానం (అవబృథం) చేశారు. సమస్త మునులు వేదశ్లోకాలను పఠిస్తూ వుండగా బ్రహ్మాది దేవతలు, భక్తులను అనుగ్రహిస్తూ ఇక్కడే వేంచేసి వుంటారని ప్రతీతి!

ఇక్కడి తీర్థాల విశిష్టతను గూర్చి వివరించండని ఆసక్తితో లోపాముద్ర కోరగా మళ్లీ అగస్త్యుడు ఇలా అన్నాడు.

## దశాశ్వమేధ తీర్థం

ఒకనాడు ప్రశాంత సాయంసమయంలో గౌరీదేవి, ఈశ్వరుని దశాశ్వమేధతీర్థ ప్రాశస్త్యం వివరించమని కోరింది.

అంత పరమేశ్వరుడు "దేవీ! ఈ దశాశ్వమేధ తీర్థంలో బ్రహ్మదేవుడు ప్రతిష్ఠితుడై వున్నాడు. పూర్వం నా అంశయైన భృగుని శాపప్రభావంవల్ల అతడు పూజలందు కొనడానికి అనర్హుడైనాడు. కాని ఆ శాపం ఈ పవిత్ర దివ్యక్షేత్రంలో మాత్రం వర్తించదు. అది క్షేత్ర మహిమ.

ఇచ్చట పుణ్యస్నానాలు, ప్రార్థనలు మరియు దానధర్మాదులు ఎల్లప్పుడూ నిర్వహింపబడుతుంటాయి. ఈ తీర్థంలో వున్న పవిత్రజలాన్ని సాధారణ



జలంగా భావించినవారు గార్దభసమానులు. విధి నిర్వహణలో, దైవ, పుణ్యక్షేత్ర సందర్శన సందర్భాల్లో, జ్యోతిష శాస్త్రవేత్తను లేదా వైద్యుని కలసిన సందర్భాల్లో ఒక వ్యక్తి కనపరచే శ్రద్ధ, ఏకాగ్రత, విశ్వాసాలకు అనుగుణంగా ప్రతిఫలం ప్రసాదింపబడుతుంది. నేను భవిష్యత్‌లో ఇచట ఒక బ్రాహ్మణునిగా జన్మించి తదుపరి దేహం చాలిస్తాను. ఆ పార్థివ శరీరాన్ని పది అశ్వమేధ యాగాలు నిర్వహించిన వ్యక్తి తప్ప వేరెవ్వరు కదిలించడం గాని, దహన సంస్కారాలు కావించడం గాని చేయలేరు. ఆ పరీక్ష స్థల మహత్వానికి నిర్ధారణ కాగలదు" అని పలికాడు.

దైవనిర్ణయానుసారం కొంతకాలానికి ఈ తీర్థంలో శివుడు బ్రాహ్మణునిగా జన్మించి కాలక్రమాన వయోవృద్ధుడై శరీరాన్ని త్యజించాడు.

ఆ దేశాన్ని పాలిస్తున్న గంజ మహారాజు సూర్యభగవానుని ఆరాధించే వాడు. ఎల్లపుడు సత్యమే పలికేవాడు. జితేంద్రియుడు. ఆయన భక్తికి మెచ్చినవాడై భాస్కరుడు కర్ణకుండలాలను, ఒక బంగారుపాత్ర నిండుగా వజ్ర వైఢూర్యాలను ప్రసాదించాడు. అలా భోగభాగ్య సంపన్నుడైన ఆ మహారాజు కరవీరనగరంలోనే నివసిస్తున్నాడు.

ప్రతిదినం సూర్యానుగ్రహంతో ఆహారం పొందే గంజమహారాజుకు విచిత్రంగా ఆ దినం ఆహారం లభించలేదు. అతడు నగర పర్యవేక్షణ చేస్తూ, దహనసంస్కారాన్ని పొందని ఆ శవాన్ని గమనించాడు. అక్కడ గుమిగూడిన పుర ప్రజలు, ఆ శవాన్ని కదిలించలేని తమ అశక్తతను మహారాజుకు తెలియ పరిచారు. ఆ జటిల సమస్య పరిష్కార మార్గానికై మహారాజు భాస్కరుని ప్రార్థించాడు. అందరికి మిక్కిలి ఆశ్చర్యం కలిగించేలా ఓ అశరీరవాణి "దశ అశ్వమేధ యాగాలు నిర్వహించిన వ్యక్తి తప్ప వేరెవ్వరు ఈ అంతిమ సంస్కారాన్ని నిర్వర్తించలేరు" అని పలికింది.

దశాశ్వమేధయాగాలను చేసి, ఆ సంస్కారాన్ని నిర్వర్తించగల అర్హుడైన వ్యక్తి నృపునకు కానరాలేదు. ఆ సమయంలో అక్కడకు ధర్మశర్మ అను

పేరుగల ఒక యతి విచ్చేశాడు. అతడు గతంలో అనేక వైదికక్రతువులను దిగ్విజయంగా నిర్వర్తించినవాడు. అతడు “ఆ అనాథ శవ దహన సంస్కారానికి నిర్వహించవలసిన కర్మక్రతువులు, యజ్ఞయాగాదులు ఏవి?' అని అచటివారిని ప్రశ్నించాడు. వేదద్రష్టలై ప్రాజ్ఞులైన బ్రాహ్మణుల సూచనల మేరకు యాగపూర్వ ధర్మాలను ఆచరించిన తర్వాత అతడు పది అశ్వమేధయాగాలను నిర్వహించాడు. అతని చేష్టలకు సాటి ప్రజలు గేలి చేయసాగారు. దహన సంస్కారాలను చేయడానికి సిద్ధమైన ధర్మశర్మ ఆ శవాన్ని భక్తితో పూజిస్తుండగా, దైవశక్తితో, దివ్యతేజస్సుతో ఆ ఆత్మ జ్యోతిరూపంలో ఆకాశమార్గంలో ప్రయాణించడం కన్పించింది. అది చూచిన మానవులు, సమస్త దేవతలు ఆశ్చర్యం పొంది దశాశ్వమేధ తీర్థ మాహాత్మ్యాన్ని తెలుసుకొన్న వారయ్యారు.

“ఈ క్షేత్రంలో మరణించినవారు, జీవించివున్నవారికంటే మిక్కిలి ధన్యులు” అని పలుకుతూ శ్రీహరి ధ్యానంలో నిమగ్నుడైన ధర్మశర్మ ఆ శవాన్ని కట్టెల కుప్పపై వుంచి దహన సంస్కారం కావించాడు.

తదనంతరం ఉమామహేశ్వరులు పుష్పక విమానంలో ఆశీనులై కైలాసానికి చేరుకున్నారు. మహారాజు గంజ, ఇతర పురప్రజలు దశాశ్వమేధ తీర్థంలో స్నానమాచరించి భక్తితో పూజాదికాలు నిర్వహించారు. అందరూ సంభ్రమాశ్చర్యాలు పొందేలా, పూర్వంలోలాగా సూర్యభగవానుని అనుగ్రహంతో ఆ దినం వారికి ఆహార పదార్థాలు సమృద్ధిగా లభించాయి.

## రుద్రగయ ఆవిర్భావం

ఓ మారు పార్వతీదేవి శంకరునితో ఇలా అంది. ‘‘స్వామీ! కరవీరనగరం, కాశీనగరం యొక్క అన్ని లక్షణాలను సంతరించుకొని ఉన్నది. ఇక ఇచట భక్తులకు తారక మంత్ర ఉపదేశం జరుపబడవలసి ఉన్నది”.



అంత త్రిపురాంతకుడు చిరునగవుతో ‘దేవీ! బ్రాహ్మణుడైన ధర్మశర్మ ఇచట నివసిస్తూ దేవి దర్శనభాగ్యం చేతనే ముక్తి నొందాడు. మహాలక్ష్మి దివ్యహారతి స్వీకరించినవారు ఐహిక బంధాల నుండి విముక్తులవుతారు. బీదవారి కష్టాలను తొలగించే సత్కార్యాలు, వారికి అందించే దాన ధర్మాలు, ముక్తి నొందడానికి ముఖ్యమైన రెండు మార్గాలు. కరవీర వాసులకు ఈ ద్వారాలు సర్వదా తెరువబడి ఉంటాయి. అయినా నీ కోరిక మేర ఆ దేవి ఆదేశానుసారం భక్తులకు తారక మంత్రం ఉపదేశించగలను” అని పలుకుతూ అనుగ్రహం కొరకు శ్రీమహాలక్ష్మిని ప్రార్థించాడు.

అంత మనోన్మణి శ్రీమహాలక్ష్మి ప్రత్యక్షమై “శంకరా! భక్తుల సంక్షేమ, సౌకర్యార్థం నీవు సదా ఇచట దర్శనమీయ వలెను. ఇక్కడ నీవు స్థిరమైన ప్రదేశంలో ఆకల్పాంతం వరకు భక్తులను అనుగ్రహించు. ఆ పవిత్రస్థలం “రుద్రగయ” నామంతో ప్రాశస్త్యం పొందుతుంది. నీవు నా శిరస్సు పైభాగంలో నివసించే భాగ్యం కల్పిస్తాను. నీవు భక్తుల కోర్కెలు తీరుస్తూ తారక మంత్రోపదేశం కావించు. నీ యొక్క దర్శనం చేసుకొని నిన్ను ప్రార్థించిన వారి తీర్థయాత్ర మాత్రమే పూర్ణ ఫలప్రదం కాగలదని నిర్దేశిస్తున్నాను” అని పలికింది.

## పంచగంగ ప్రాశస్త్యం

పుణ్యక్షేత్రాలన్నింటిలో సర్వేశ్వర లింగం ప్రతిష్ఠితమైన ఈ ప్రదేశం సాయుజ్యాన్ని ప్రసాదించడంలో, ప్రథమస్థానం పొందుతోంది. దశాశ్వమేధ యాగం నిర్వహింప చేయుటకు వచ్చిన సమస్త దేవతలు, మునులు ఇలా ఆలోచించారు. “మన మందరం చతుర్ముఖ బ్రహ్మ యాగానికి వచ్చినవారం. ఈ తీర్థరాజం కైవల్య ప్రదాయకమేగాక మనోజ్ఞమై అలరారుతోంది. ఇచట మనోహరమైన అన్ని తీర్థాలను దర్శించడానికి మొదలిడితే మనం యాగాన్ని చూడలేం. యాగఫలితాన్ని పొందలేం. అంతేగాక బ్రహ్మదేవుని ఆగ్రహానికి గురియై దండనకు కూడా గురికావచ్చు”.

ఇలా ఆందోళనపడుతూ వారంతా గురువైన బృహస్పతిని ఇలా ప్రార్థించారు. "గురుదేవా! ఈ ప్రపంచంలో సంసారార్ణవాన్ని దాటించి ఆధ్యాత్మిక సమున్నతిని కల్పించే గురువు ఒక్కడే మార్గదర్శకుడు. మేమందరం తమ శరణుజొచ్చాం. యాత్రాఫలం మరియు యజ్ఞయాగాది నిర్వహణ ఫలం ఒకేసారి పొందగల ఏకైక మార్గాన్ని తెలియజేయండి". అంత బృహస్పతి అనుగ్రహించి "శిష్యులారా! సమస్త పుణ్యక్షేత్రాల దర్శనఫలాన్ని ప్రసాదించే "విమల"తీర్థంలో స్నానమాచరించి ఉభయఫలాలను ఏకంగా పొంది పునీతులు అవండి" అని సూచించాడు.

సమస్త దేవతలు ఈ స్థల ప్రాశస్త్యాన్ని గ్రహించినవారై పరవశించి ఇచ్చటి పుష్కరాది కుండాలన్నింటిని ఐక్యం గావించి "సర్వతీర్థం" అనే పేరుపెట్టి అందు ఎల్లెడలా సమస్త ఈశ్వర లింగాలను ప్రతిష్ఠించారు. ఈ తీర్థంలో స్నానమాచరించి సర్వేశ్వరుని ఆరాధించినవారు మోక్షప్రాప్తిని పొందేలాగా, పవిత్రమైన ఈ పంచగంగ ప్రదేశం పాపహారిణిగా కాశీ పట్టణంకన్న వేయిరెట్లు ఉన్నతమయ్యేలాగా నిర్దేశించారు. సర్వతీర్థంలో స్నానమాచరించిన సమస్త శుభాలు కలుగుతాయని, ఇచట తప మాచరించినవారు సిద్ధులవుతారని అనుగ్రహించారు.

ఈ స్థల మాహాత్మ్యాన్ని మరింతగా తెలియజేయండని ఆసక్తితో లోపాముద్ర ప్రార్థించగా అగస్త్యుడు క్రిందివిధంగా చెప్పసాగాడు.

"సాధ్వీ! పూర్వం ఈ పుణ్యక్షేత్రంలో మరీచి అనే బ్రాహ్మణుడు నివసిస్తూ వుండేవాడు. అతడు ఎన్నో పాపకార్యాలు చేసినవాడు. సమస్త దుర్వ్యసనాలకు బానిస అయినవాడు. సర్వసంపదలు కోల్పోయినవాడై ఒక పర్వతగుహలో నివసిస్తూ, తన వ్యసనాలకు అవసరమయ్యే ధనం కోసం యాత్రికులను దారి కాచి దోపిడి చేస్తుండేవాడు.

అతడు ఒకనాడు పులివాత బడి మరణించాడు. యమదూతలు అతన్ని నరక లోకానికి తోడ్కొనిపోయారు. ఆ శవాన్ని కుక్కలు మరియు పందులకు



ఆహారంగా వేశారు. మాంసంతోకూడిన ఆ ఎముకలను ఒక గ్రద్ద తన్నుకొని పోతుండగా అవి పట్టుజారి పంచగంగ తీర్థంలో పడ్డాయి. తక్షణమే ఆ బ్రాహ్మణునికి స్వర్గలోకం ప్రాప్తించింది. అతనిని నరకలోకం నుండి విడుదల చేయమని యముడు తన దూతలను ఆదేశించాడు. అంత విష్ణుదూతలు ఆ బ్రాహ్మణుని ఒక దివ్య విమానంలో స్వర్గానికి చేర్చారు.

అపర భగీరథులైన కశ్యపాది పంచ మహర్షులు తమ తపోమహిమచే ఈ నదిని కరవీర నగరానికి కొనితెచ్చారు. ఈ పవిత్ర నదీతీరంలో ఎక్కడ మరణించిన వారికైనా పుణ్యలోకం సిద్ధిస్తుంది.

క్షేత్రమాహాత్మ్యాన్ని విన్న లోపాముద్ర భక్తి పారవశ్యంతో పులకించింది.

## సహస్రనామ శోభ

అంత అగస్త్యమహర్షి మహాలక్ష్మిమందిరంలో తూర్పున ఎదురుగా ముఖంగా వున్న "దేహ్లి" వినాయకునికి శ్రీగంధ సింధూరాలను, ప్రియమైన మోదకాలను భక్తితో నివేదించాడు. మణికర్ణిక ఘట్టంలో పుణ్యస్నానం చేసి భవానీ శంకరులకు చెరకురసం, మరియు నారికేళ జలంతో అభిషేకం చేసి పూజాదికాలు నిర్వ హించాడు. మహాకాళి మహాసరస్వతులను దర్శించి భక్తితో మొక్కి ముక్తిమండపంలో శ్రీమహాలక్ష్మికి వినమ్రుడై భక్తితో నమస్కరిస్తూ,

"ఓం శ్రీమహామాయ, సిద్ధిబుద్ధికర, జగన్మాత, ఆద్యంతరహిత, ఆదిశక్తి, భక్తి ముక్తి ప్రదాయని, సర్వేశ, యోగిని, మహోదయ, మహాశాంత, మహాపాప హర, గరుడారూఢ, పరమేశ్వరి, మనోమూర్తి, సదానంద, సర్వాధార, శ్రీమహాలక్ష్మి నమోస్తుతే!"

అని ప్రార్థించాడు మకరందంతోను సుగంధ భరిత పుష్పజలంతోను పంచామృత స్నానం సమర్పించి, కస్తూరి చందనాది సుగంధ లేపనం గావించి, సువర్ణ ఆభరణాలతో సర్వాలంకార భూషితను గావించి, నానావిధ

సుమధుర ఫలాలను నైవేద్యం చేసి, కర్పూర, పూగీఫల ముక్తాచూర్ణ సహిత నాగవల్లీ దళాలతో కూడిన తాంబూలం సమర్పించాడు.

దుష్టరాక్షసుడైన మహిషాసురుని వధ సందర్భంలో సమస్త దేవతలు దేవిని శ్లాఘిస్తూ వల్లించిన రహస్య దివ్యసహస్రనామాలతో స్తుతించారు. మహాలక్ష్మి సహస్రనామ ప్రాశస్త్యాన్ని, వాని అంతరార్థాన్ని చతుర్ముఖ బ్రహ్మ, యోగి సనత్ కుమారునకు ఛందోనుష్టుప్ సహితంగా ఉపదేశించాడు. కేవలం ఈ స్తోత్రం చెవినబడినంత మాత్రాన్నే కలిగే దివ్యానందం, ఇంతింత అని చెప్పలేం. అనునిత్యం లక్ష్మీ సహస్రనామ స్తోత్ర పారాయణం భోగ భాగ్య సిద్ధికి, ముక్తిపద ప్రాప్తికి సోపానం.

ప్రసన్నురాలైన దేవి వారితో "ఓ దేవతలారా! సర్వదా నా శుభాశీస్సులు మీకు లభిస్తాయి. ఏమి కావాలో కోరుకోండి" అని పలికింది.

అంత దేవతలు "తల్లీ! నీవు మహేశ్వరివి. జగదేకమాతవు. మేమందరం సర్వాంతర్యామియైన మిమ్ము ఆరాధించి, పూజించి తరిస్తాం. అన్యులు ఈ శ్లోకాలను పఠించినా, విన్నా అట్టివారికి అష్టైశ్వర్యాలు, ఆరోగ్యసంపదలు, అభీష్టసిద్ధి ప్రాప్తించేలా అనుగ్రహించు" అని ప్రార్థించారు.

"అష్టమి, నవమి, చతుర్దశ్యాది తిథులందూ, ముఖ్యంగా పౌర్ణమి అమావాస్యాది పుణ్యతిథులందూ దేవి సహస్రనామాలను పఠించినా కరవీర మాహాత్మ్య మకరందం జాలువారే పురాణాన్ని పఠించినా, విన్నా, సమస్త సుఖ సంపదలు ప్రాప్తించటమేగాక, తానే స్వయంగా అలాంటి గృహాలలో నిత్యం నివాసం చేయగలనని" దేవి మందస్మితయై అనుగ్రహించింది.

## అగస్త్యునకు అనుగ్రహం

భక్త్యావేశంతో కన్నుల వెంట ఆనందాశ్రువులు జాలువారుతుండగా అగస్త్య మహర్షి ఇలా ప్రార్థించాడు.



"ఓ భక్తానుగ్రహకారిణీ! నీవు సమస్త వరాలను ప్రసాదించే కల్పవృక్షానివి! పాపాలనెడి తృణాలను కాల్చివేసే అగ్నివి. మదమాత్సర్యాది గుణాలచే గర్విష్ఠులైన మహారాక్షసులను వధించి ధర్మసంస్థాపన చేసేదానవు! నీవు గాయత్రివైన వేదమాతవు! ఓంకార స్వరూపిణివి. సమస్త భక్తుల పాలిట సాక్షాత్ కామధేనువవు! తల్లీ! నా తదుపరి జన్మలన్నింటిలోను నాకు కాశీ మరియు కరవీర పురాలు రెండున్నూ నివాసంగా ఉండేలా అనుగ్రహించు".

అంత శ్రీవైష్ణవి ఇలా పలికింది.

"అగస్త్యా! నీవు ముల్లోకాల ఆర్తిని రూపుమాపేందుకు వింధ్యపర్వత మద మణచినవాడవు. పరుల కోర్కెలను సాదరంగా అనుగ్రహించేవారు అమరులు. స్వార్థపరులు మృతులతో సమానులు. మానవజీవితం సర్వదా అస్థిరమైంది. పుణ్యప్రదమైన కరవీరనగరాన్ని సందర్శించి నీవు మా అనుగ్రహం పొందావు. నీవు కార్తికేయస్వామి దర్శనం కావించుకొని, ఆతనితో పాటు శ్రీశైలపుణ్యక్షేత్రం దర్శించు. కార్తికేయుని పునరాగమనం వల్ల గౌరీదేవి పుత్ర సమాగమంతో మిక్కిలి సంతోషపడుతుంది".

అంత ఖిన్నుడైన అగస్త్యుడు ఆర్ద్రంగా ఇలా ప్రార్థించాడు.

"తల్లీ! మరల నన్ను తమ సాన్నిధ్యం నుండి దూరం చేస్తారెందుకు? నేను ఇప్పటికే జీవితమంతా త్యాగం చేసినవాణ్ణి".

అంత శ్రీమహాలక్ష్మి మిక్కిలి దయతో అగస్త్యుని శిరంపై తన వామహస్తాన్ని ఉంచి "ఈ నా నివాసం అత్యంత పవిత్రమైనది. నీవు సమస్త శైవారామాలను సందర్శించి దైవదర్శనంచే కృతార్థుడవు అవటానికి నీకు ఆరుమాసాల సమయం అనుగ్రహించాను. నీవు ద్వాపరయుగంలో కాశీనగరంలోను, కరవీరపురంలోను, రెండింటా లింగరూపంలో వుంటావు. లోక కళ్యాణార్థమైనా ఆజ్ఞను శిరసావహించి, విష్ణువు అనుగ్రహం పొంది వేయి కల్పాలు వర్ధిల్లు" అని ఆశీర్వదించింది.

# ఇంద్రసేనుడు

జగజ్జనని అయిన విష్ణుప్రియ అగస్త్యమహామునికి ఇంద్రసేనుని గూర్చి ఇలా చెప్పసాగింది. "ఇంద్రసేనుడు సతారా సమీపాన వున్న పాడి మహాసామ్రాజ్యానికి అధిపతి. శౌనకాది మహామునులు అతని కొలువులో ధర్మపరిరక్షణార్థం సమస్త క్రతువులను ఆచరించేవారు. ఇంద్రసేనుడు గొప్ప దానశీలి. అయినా మహారాజులకు మరణానంతరం నరకప్రాప్తి సంభవిస్తుందన్న సత్యాన్ని తెలుసుకొన్నవాడై భూసురులను రావించి తనకు ప్రాప్తించబోయే పాప పరిహరణార్థం మార్గం సూచింపమని వేడుకొన్నాడు. వారి సూచనల మేరకు కాశీమహానగరం కంటె వరిగింజ ఎత్తు బరువుగావున్న కరవీరపురాన్ని సందర్శించిన ఇంద్రసేన మహారాజు లవణాలయ సమీపంలోని పద్మజాదేవి ఆలయం దర్శించి, ఆ తల్లి కృపాకటాక్షంతో అంత్యాన పుణ్యలోకప్రాప్తి పొందాడు. సోమ, మంగళవారాలలో, అమావాస్య తిథియందు పంచగంగలో పుణ్యస్నాన మొనర్చి తర్పణ, దాన, తులసీతీర్థ ప్రోక్షణ మొదలైన క్రతువులు ఆచరిస్తే పునర్జన్మ రహితమైన ముక్తి ప్రాప్తిస్తుంది. ఇది ఈ స్థలమాహాత్మ్యం.

ముద్గల తీర్థంలో పుణ్యస్నానమాచరిస్తే ఎలాంటి దుస్సాధ్యమైన కార్యం అయినా సులభతరం అవుతుంది. పంచగంగలో స్నానం చేసి శ్రీమహాలక్ష్మికి మొక్కనివాడు జీవన్మృతుడు".

కరవీరపురంలో స్థిరనివాసం ఏర్పరచుకొని శేషజీవితం సాగించదలచిన ఇంద్రసేన మహారాజు తన మంత్రివర్యునకు సమస్త రాజ్య పరిపాలనాది బాధ్యతలను అప్పగించి ఋషిపుంగవులతో గూడి సతీసమేతుడై ప్రయాణ మయ్యాడు. మార్గమధ్యంలో వివిధ పుణ్య తీర్థాలలో స్నానమాచరించి, పూజాదికాలు నిర్వర్తించాడు. ఆర్తులకు గృహ, కనక, వస్త్ర, వజ్ర, వైడూర్యాది దానాలు చేశాడు. ప్రజలకు నీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, ఔషధాలు



తదితర సౌకర్యాలు కల్పించాడు. తుదకు కరవీరపురం చేరి అనునిత్యం పావన పంచగంగలో స్నానం చేస్తూ శ్రీమహాలక్ష్మిని భక్తితో సేవిస్తూ ఆధ్యాత్మిక జీవనం గడుపసాగాడు.

కానీ దుష్టబుద్ధి అయిన మంత్రి రాజ్యాధిపత్యానికై పన్నాగం పన్నిన ఫలితంగా ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. అంత ప్రజలు రక్షణకై దీనంగా రాజును ఆశ్రయించారు. విజ్ఞులైన మునిపుంగవులు మహారాజును తిరిగి రాజ్య పాలన స్వీకరించి ప్రజలను కాపాడమని కోరారు. కానీ మహారాజు అందుకు సమ్మతించలేదు. కరవీరంలో నివసించడం పుణ్యప్రదం, జన్మసార్థకం అని భావించాడు. మునిశ్రేష్ఠులు రాజధర్మాన్ని గుర్తు చేస్తూ కరవీర మాహాత్మ్యాన్ని రాజుకు ఈ విధంగా విశదపరిచారు.

"పూర్వం శ్రీమహావిష్ణువుచే వరంగా స్త్రీచేత మాత్రమే మరణాన్ని కోరిన రాక్షసులు, గర్వంతో ముప్పదిమూడు కోట్ల దేవతలను జయించారు. వారిని అనేక కష్టాలకు గురిచేశారు. ఆర్తులైన దేవతలు ముకుందప్రియ అయిన లక్ష్మిని శరణు జొచ్చారు. దీనశరణ్యయైన శ్రీమహాలక్ష్మి ఈ సమస్యను సామరస్యంగా తీర్చుకుని మహాశివుని నియోగించింది.

"ఇంద్రుని పదవికి ఎసరు పెట్టకుండటం, దేవతలకు హాని కల్గించ కుండటం, తిరిగి పాతాళలోకానికి వెళ్ళిపోవడం" అన్న రాజీ అంశాలను ఆమోదించని బుద్ధిహీనులైన అసురులు, తదనంతరం అమ్మవారి ఆగ్రహానికి గురై మరణించారు".

రాజధర్మమనే కర్తవ్యాన్ని పునశ్చరణ గావించుకొన్న ఇంద్రసేనుడు తిరిగి రాజ్యానికి చేరి శత్రువులను వధించి ప్రజలకు సుఖశాంతులను అందించాడు. తదుపరి సంసారిక సుఖాలను, కోరికలను త్యజించినవాడై వార్ధక్యంలో తన కుమారునకు రాజ్యపాలన బాధ్యతలను అప్పగించి, ఆధ్యాత్మిక జీవనం సాగించాడు. అంత్యంలో కరవీరపురంలో అనునిత్యం

గోపీచందన లేపనంతో సాలగ్రామానికి, అర్చన మహాన్యాసపూర్వక అభిషేకాలు చేస్తూ శివసాయుజ్యం పొందాడు.

## అగస్త్య - కోటి తీర్థాలు

లోపాముద్ర అగస్త్యుని ఇలా ప్రశ్నించింది. "స్వామీ! మనం ఇచ్చటికి ఈ దినమే వచ్చి వున్నాం. కాని ఇక్కడి పుణ్య తీర్థాల నామ క్రమంలో మీ పేరు ఎలా ప్రాచుర్య మయింది?"

అంత అగస్త్యుడు ఇలా చెప్పసాగాడు. "దేవీ! గత కల్పంలో నేనిక్కడే నివసించేవాడను. నా తపస్సుకు మెచ్చిన క్షీరసముద్రరాజతనయ సర్వలోక శ్రేయస్సుకై లింగరూపంలో నేనిచ్చట ఆవిర్భవించేలా అనుగ్రహించింది. ఆ తల్లి అనుగ్రహంతో లోక కళ్యాణార్థం ఎన్నో అద్భుత కార్యాలను చేసి వున్నాను. నిన్ను అర్ధాంగిగా పొందాను. ఈ పుణ్యక్షేత్రం ఎన్నో కల్పాల నుండి విరాజిల్లుతోంది. ఇక్కడి పవిత్ర జలాశయాలు త్రైలోక్యకుటుంబిని అనుగ్రహం వల్ల ఎల్లప్పుడూ పవిత్ర పుణ్యజల పూర్ణములై అలరారు తుంటాయి. బ్రహ్మ సృష్టి నశ్వరం అనేది సత్యం. కాని ఈ పుణ్య తీర్థం శ్రీహరి యొక్క సృష్టి కావున ఇది పరమప్రదం మరియు పాపవినాశకరం. ఈ క్షేత్రంలో కాలయమునికి సైతం తన అధికారాన్ని ప్రదర్శించ శక్యం కాదు. ఈ క్షేత్రంలో ఎవ్వరూ  పాపకార్యం చేయలేరు. ఏ ఇతర పుణ్య క్షేత్రమూ కరవీరనగరంతో సాటిగాదు. కరవీరపురంలోని నా ఈ తీర్థం పంచగంగా పరివాహక ప్రదేశంలో పరిఢవిల్లుతున్నది. ఇచ్చట స్నాన మాచరించిన గొడ్రాలు సైతం సంతానవతి కాగలదు. ఇది వర్ణన, విశ్లేషణల కందని దేవీమాహాత్మ్య నిదర్శనం".

శ్రీలక్ష్మి మొదలైన దేవతలను స్మరిస్తూ అగస్త్యమహర్షి మణికర్ణిక ఘట్టంలో స్నానం చేసి సంధ్యాది కర్మల నాచరించాడు. పత్ని లోపాముద్ర, కోటి తీర్థరాజాల ప్రాశస్త్యాన్ని వివరించండని అగస్త్యుని కోరింది.



అప్పుడు అగస్త్యుడు "సాధ్వీ! ఈ పవిత్ర ప్రదేశం సమస్త తీర్థాలకు నెలవైనదని ఎరిగినవాడై పుష్కరేశ్వరుడు ఇచ్చటకు అరుదెంచి స్థితమయ్యాడు. ఆనాటి నుండి ఇచ్చటి పంచగంగ మొదలైన కుండాలలోని జలరాశి ప్రత్యేక దైవత్వాన్ని సంతరించుకొని పుష్కరేశ్వర తీర్థమని ప్రసిద్ధి గాంచింది. ఇచ్చట కావించబడ్డ తర్పణాలు పితృదేవతలకు మిక్కిలి ప్రీతపాత్రమవుతాయి. భాను మహారాజు యొక్క కోటిజన్మాల పాపాలు క్షణకాలంలో ఇచ్చట ప్రక్షాళన గావించబడ్డాయి.

ఓ మారు ముప్పైమూడుకోట్ల దేవతలకు అరవైఆరు కోట్ల దానవులకు వైరంతో యుద్ధం జరుగింది. దేవతలు పరాజితులయ్యారు. అంత వారు కాళిక, భేతాళ, యోగిని, కాత్యాయని మొదలైన దేవతలతో కూడి లక్ష్మీదేవిని దర్శించి, అనుగ్రహింపుమని వేడుకొన్నారు. ధర్మపరిరక్షణార్థం కాళిక రూపిణియైన శ్రీలక్ష్మి ఆ క్రూర దానవులను కేశపాశాలతో బంధించి తన ముష్టిఘాతాలతో సంహరింపబోగా వారు రక్తం కక్కుతూ విలవిల లాడసాగారు. అలా రుద్రకాళి దానవులందరినీ హతమార్చింది. అనంతరం భక్తజనుల ఆనందహేలను శ్రీదేవి సంభ్రమాశ్చర్యాలతో వీక్షించుచుండగా మిగిలిన దానవులు పశ్చాత్తాపంతో "ఓ మహామాతృకా! నీ శక్తి అపారం. నీ చేత మరణం మాకు ముక్తిప్రదాయకం. మమ్ము పుష్కరఘట్టంలో వధించి ఆ ప్రదేశం కోటితీర్థ నామంతో ప్రాచుర్యమయ్యేలా అనుగ్రహించు" అని ప్రార్థించి దేవి అనుగ్రహంతో తరించారు. ఆనాటి నుండి ఈ పుణ్యక్షేత్రం కోటితీర్థం అనే నామంతో విరాజిల్లుతోంది" అని వివరించాడు.

## నృసింహ తీర్థం

గోమతినదిలో స్నానానంతరం అగస్త్యుడు సంధ్యావందనాది నిత్య అనుష్ఠానాలను పూర్తిచేసి, తన పత్నితో కూడి నృసింహతీర్థంలో ప్రవేశించాడు.

శ్రీహరి నరసింహావతారంలో హిరణ్యకశిపుని వధించిన పిమ్మట అతని సుతుడైన ప్రహ్లాదుడు ధర్మదీక్షను స్వీకరించే ముందుగా పుణ్యక్షేత్ర దర్శనం మొదలైన క్రతువులను ఆచరింప దలచాడు.

అందుకు మహర్షులు "మహాలక్ష్మీరూపంలో సాక్షాత్ మహావిష్ణువు పరివేష్టితుడై యుండి, భక్తి ముక్తి ప్రదాయని అయిన పవిత్ర కరవీరపురం" అనువైన క్షేత్రమని ప్రహ్లాదునకు సూచించారు. అంత ప్రహ్లాదుడు కరవీరం విడిదిగా చేసుకొని అన్ని క్రతువులను, ధర్మకార్యాలను ఆచరించి, దేవీ అనుగ్రహం కొరకు తపస్సు కొనసాగించాడు.

కొంతకాలానికి కరవీరవాసిని శ్రీదేవి ప్రసన్నురాలై ప్రత్యక్షమై "ప్రహ్లాదా! నీ భక్తికి మెచ్చాను. ఒక వరం కోరుకో ప్రసాదిస్తాను" అన్నది.

ప్రహ్లాదుడు "తల్లీ! ఇచ్చట కడు బీదవారు సైతం తమ అనుగ్రహం చేత సకల సంపదలు పొందినవారై ఐహిక ఆముష్మిక చింతనలతో పరిపూర్ణులవుతున్నారు. ఈ ప్రదేశం నృసింహతీర్థం అనే పేరుతో ప్రసిద్ధిని పొందేలాగ అనుగ్రహించండి" అని వేడుకొన్నాడు.

మహాలక్ష్మి కరుణించి "ప్రహ్లాదా! నీ శ్రీహరిభక్తి చిరస్మరణీయం. నీవు పన్నెండు బండ్లకు నిండుగా సాలగ్రామాలను తెప్పించి పద్మాలయ తీర్థంలో ప్రతిష్ఠించు. నీ కోరిక నెరవేరుతుంది. ఇచ్చట ముఖ్యంగా శని (మందవాసరం) వారం రోజున భక్తిశ్రద్ధలతో పూజలు గావించినవారికి ఎట్టి గ్రహదోషాలు వాటిల్లవు. వారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో దీర్ఘాయువులై మోక్షం పొందగలరు. ఇచట దాతృత్వ ఫలం మరెన్నో రెట్లుగా సిద్ధిస్తుంది" అని అనుగ్రహించింది.

మహాలక్ష్మి రూపంలోని శ్రీమహావిష్ణువుని గాంచి తన్మయుడై పద్మాలయ తీర్థంలో ప్రహ్లాదుడు భక్తిమీర సాలగ్రామ ప్రతిష్ఠ చేసి పూజించిన నాటి నుండి ఆ క్షేత్రం "నృసింహతీర్థం"గా ఖ్యాతి సంతరించుకున్నది.



## రాంక తీర్థం

తరువాత ప్రహ్లాదుడు సాగరాన్ని పోలిన ఓ సరోవర తీరంలో ప్రవేశించాడు. ఆ తీర్థం నిర్మలమైన నీటితో, కనువిందు కల్గించే తామరపూలతో నిండుగా వుంది. తీరమంతా ఫలపుష్పాలతో నిండుగా వున్న పూదోటలతో, పచ్చిక బయళ్ళతో భూదేవి ఆకుపచ్చని చీర చెరగు పరచినట్లుంది. ఆ చెట్లకు విరగకాస్తున్న ఫలాలకోసం కోతులు, వివిధ జాతుల పక్షులు మూకుమ్మడిగా చేస్తున్న ధ్వనులు, కిలకిలరావాలు ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి. ఆ తీర్థం ఎంతో మనోజ్ఞంగా వుంది.

పూర్వం ఓ మారు ఇచ్చట దీర్ఘకాలం భీకరమైన కరువు విలయతాండవం చేసింది. అపుడు పరమశివుడు- సమస్త దేవతలు, మునులు, ఋషులతో గూడి శ్రీమహాలక్ష్మిని కరువు రూపుమాపుమని ప్రార్థించాడు. అంత చంద్రసహోదరి సప్తసాగరాలలోని నీటిని పాతాళలోకం నుండి ఈ విశాలమైన సరస్సుకు ప్రభవింపచేసి, సమస్త భూమండలంలో నలుదిక్కుల హరితం వెల్లివిరిసేలా చేసింది. దట్టమైన పచ్చని అరణ్యాలతోను, పూతోటలతోను, ఆకు-కూరగాయల మడుల తోను సుసంపన్నం గావించింది. అలా సమస్త జీవరాసుల కష్టాలను తొలగించి అనుగ్రహించింది. విశాల తీర్థాన్ని పాకశాలగా మార్చి అందరకు మృష్టాన్నభోజనం ప్రసాదించి చిరకాల క్షుద్బాధ నివారణ గావించింది. ఆ ప్రాంతవాసులను దుష్టశక్తుల నుండి రక్షించి ప్రశాంత జీవనం సాగించేలా చేయడానికి శూలధారులైన భైరవులను అష్టదిక్కుల్లో నియమించింది. ఆనాటి నుండి శ్రీమహాలక్ష్మి దేవతలచే 'శాకంబరి'గా కీర్తింపబడుతోంది. అలా ఈ తీర్థం సృష్టి గావించబడిన నాటి నుండి తొలకరి జల్లులు సకాలంలో ప్రారంభమై ఈ ప్రదేశం సతతం జలసంపదతోను పచ్చని పంటలతోను, ఉద్యానవనాలతోను విరాజిల్లుతోంది.

ఘోరతపస్సు గావించిన రాంక భైరవుని భక్తికి మెచ్చిన సముద్రరాజ తనయ "ఈ తీర్థం 'రాంకతీర్థం'గా అతని పేరుతోనే చిరస్మరణీయం

కాగలదని, ఈ తీర్థంలో క్రూరశక్తులు ప్రవేశించనీయకుండా అతడు రక్షింపవలెనని" ఆదేశించింది. ఈ తీర్థంలో ప్రముఖంగా అశ్వనీ నక్షత్రయుక్త రవివారం రోజున స్నానమాచరించిన వారు సమస్త దుఃఖాలను ఎడబాసి సుఖసంతోషాలతో వర్ధిల్లగలరు" అని అను గ్రహించింది. ఈ తీర్థ ప్రభావం వల్ల కౄరరాక్షసులు సైతం మోక్షం పొందగలరు.

పూర్వం ఒక నగరంలో కన్యాకుబి అనే బ్రాహ్మణుడు నివసించేవాడు. అతడు గొప్ప పండితుడు. కాని మిగుల గర్విష్ఠి. తోటి పౌరులను, ఋషులను, మునులను లెక్కచేయక వుండేవాడు. అతని దుష్ప్రవర్తనకు, కోపించిన ఋషులు అతణ్ణి బ్రహ్మరాక్షసునిగా మారేలా శపించారు.

తక్షణం పశ్చాత్తప్తుడైన బ్రాహ్మణుడు శాపవిమోచన మార్గం ప్రసాదించుమని వారిని ప్రార్థించాడు. అంత ఋషులు "నీవు కరవీర నగరాని కేగి దేవి అనుగ్రహం కోసం ప్రార్థించు. అచట పరమపండితుడు, దివ్యజ్ఞానియైన బ్రాహ్మణుడొకడు పవిత్రజలంచే నిన్ను పునీతుని గావింపగలడు" అని అనుగ్రహించారు. అదేవిధంగా ఆ బ్రాహ్మణుడు కరవీరంలో పుణ్యస్నానాలు, పూజలు చేసి సంస్కారం పొంది దేవి అనుగ్రహంతో శాపవిమోచనం పొందాడు.

## లక్ష-అశ్వ-విశాల తీర్థాలు

ఉత్తర మానసతీర్థ ప్రాంతంలో పూర్వం విముక్తగా పిలువబడి ప్రస్తుతం లక్షతీర్థంగా వాసికెక్కిన ఈ తీర్థం ఎంతో మహిమాన్వితమైనది. పూర్వం ఓమారు లక్షమంది దుష్టరాక్షసుల్ని సంహరించడానికి శ్రీమహాలక్ష్మి ఇక్కడకు వేంచేసింది. రాక్షసులు మరణాసన్నకాలంలో జ్ఞానసిద్ధులై, విష్ణుప్రియను ఇలా ప్రార్థించారు. "తల్లీ! నీచేతితో మరణం మాకు ఎన్నో జన్మల పుణ్యఫలం. ఈ ప్రదేశం లక్షతీర్థం అని ప్రఖ్యాతిని పొందేలా, స్వయంగా పరమశివుడే ఇచ్చట నివసించేలా, తద్వారా మా జన్మ సార్థకం అయ్యేలా అనుగ్రహించండి".



ప్రసన్నురాలైన శ్రీలక్ష్మి ధర్మయుద్ధంలో వారిని హతమార్చి మోక్షాన్ని కలిగించింది. ఆనాటి నుండి ఈ తీర్థం దేవీ అనుగ్రహంతో "లక్షతీర్థం" అనే పేరుతో ప్రసిద్ధి గాంచింది.

ఇచ్చట ఓ అశ్వానికి మోక్షప్రాప్తి కలిగింది. సుశర్మ గొప్ప బ్రాహ్మణ పండితుడు. అతడు పుట్టు కుంటి అయినందున, ఒక అశ్వాన్ని వాహనంగా ఉపయోగిస్తూ అనునిత్యం త్రైలోక్యకుటుంబిని దర్శనం చేసుకొనేవాడు. శ్రీమహాలక్ష్మికి పప్పుబెల్లాలు, పాలు సమర్పించుకొనే భక్తులను అనుసరిస్తూ వారికి తగు రీతిన భక్తితో సేవలనందించేవాడు. అనేక తీర్థాల సందర్శన శ్రమవల్ల వృద్ధాప్యంవల్ల అవసానదశలో తుదిగా ఈ తీర్థంలో నీటిని సేవించి ఆ అశ్వరాజం తనువు చాలించి మహాలక్ష్మి అనుగ్రహ పాత్రురాలైంది. ఆనాటినుండి ఆ ప్రదేశం "అశ్వతీర్థం"గా వాసికెక్కింది.

కోలాసురుని కుమారుడైన విశాలుడు సమస్త దేవతలను యుద్ధంలో ఓడించి మిక్కిలి గర్వంతో విర్రవీగుతుండేవాడు. దేవతలను, మునులను, వారివారి విధులను, యజ్ఞయాగాదులను నిర్వహించనీయక ఆటంకాలు కల్పిస్తూ పైశాచిక ఆనందం అనుభవించేవాడు.

బ్రతుకుజీవుడా! అని దేవతలు శ్రీమహావిష్ణువుని శరణుజొచ్చారు. అంత విష్ణువు భీకరయుద్ధంలో విశాలుని ఛాతిపై పిడిగుద్దులతో క్రింద పడవేసి తన కుడికాలితో త్రొక్కిపట్టి నియంత్రించాడు. నిర్వీర్యుడైన విశాలుడు ఇలా ప్రార్థించాడు. "ఓ సర్వలోక వ్యాపీ! ఈ క్షేత్ర మాహాత్మ్యం వల్ల ఘోరపాపులు, భీకరమైన మృగాలు, విషనాగులు, గజదొంగలు సైతం పాపనివృత్తి పొందారు. నీచేత మరణంతో నాకు పునర్జన్మ రహితం కావాలి. నన్ను పాపాలనుండి విముక్తి కల్పించు. నీవు ఇచ్చటనే నిలిచి ఈ ప్రదేశాన్ని మహిమాన్వితం చేయ ప్రార్థన! ఈ పుష్యమి నక్షత్రంతో జోడైన అమావాస్య పుణ్యతిథిగాను, రవి వృశ్చికరాశి ప్రవేశకాలం మిక్కిలి ప్రాశస్త్యం పొందే విధంగా అనుగ్రహించు. అట్టి గ్రహస్థితిలో కేశముండనం గావించుకొని

మానవులు "ఆహారం, పాదరక్షలు, పడక, ఛత్రం దీపం మరియు మాతులుంగ ఫలాలను" దానం చేసి పితృదేవతలకు ఇచట పిండ ప్రదానాది కర్మలు నిర్వర్తిస్తే ఏడు తరాలవారికి మోక్షప్రాప్తి కలిగేలా అనుగ్రహించు".

అంత కరుణామయుడయిన శ్రీమహావిష్ణువు విశాలుని కోర్కెలు తీర్చి ఆ ప్రదేశం "విశాలతీర్థం" అనే పేరుతో విరాజిల్లేలా అనుగ్రహించాడు.

ఈ విశాలతీర్థంలో అన్ని దిక్కులా సమస్తదేవతలు పరివేష్టితులై వున్నందున ఇచట నిర్వహింపబడే శ్రాద్ధకర్మలు, గయలో జరుపబడిన వానికన్న మిక్కిలి ఫలప్రదాలు. ఇచ్చట కావించిన పుణ్యస్నానం వల్ల సర్వపాపాలు పరిహారమవుతాయి. దేవతార్చనవల్ల దివ్యజ్ఞానం సిద్ధిస్తుంది. విశాలతీర్థంలో ప్రవేశం కాశీలో నివాసఫలం కన్నా, ప్రయాగయందు స్నానఫలం కన్నా మిక్కిలి ఉత్కృష్టమయ్యేలా శ్రీ వైష్ణవిచే అనుగ్రహింప బడింది.

## గుణవతి తీర్థం

గౌతమి–పంచనదుల సంగమం మహర్షి గౌతముడు తపస్సు ఆచరించిన పవిత్ర క్షేత్రం. ఈ సంగమంలో పుణ్యస్నానం ఆచరించి ఉమా–త్రయంబకేశ్వరులను భక్తితో పూజించినవారు ఐహికబంధాల నుండి విముక్తులవుతారు. ధర్మశర్మ అనే బ్రాహ్మణుడు శివగణాలు తోడు రాగా శంకరుని దర్శించి కైవల్యప్రాప్తిని పొందాడు.

కరవీరపురంలో గుణవతి అనే ఒక పుణ్య స్త్రీ సార్థక నామధేయురాలు. ఆమె నిత్యం మహాలక్ష్మిని దర్శనం చేసుకొనేది. ఆ పుణ్యస్థలంలో వున్న శివలింగాలకు, పుష్పమాలలతో అలంకరించి అర్చనలు నిర్వహించేది. పుణ్యదినాలకు అనుగుణంగా ఉపవాసాది విధులను నిర్వర్తించేది. ఒకదినం ఆమె తీవ్ర అనారోగ్యానికి లోనైంది. మృత్యువు ఆసన్నం కాగా ఆమెను కైలాసానికి తీసుకొనిపోవ శివదూతలు విమానంతో అరుదెంచారు.



ఆమె ఆ శివదూతలను ఇలా ప్రార్థించింది. "ఈనాటి నా పుజావిధానం ప్రకారం నేను ఇచ్చటి అన్ని లింగాలను సందర్శించుకోవలసి ఉంది. ఈ ఆచారాన్ని అమలు చేయక ఉండలేను. నన్ను అనుగ్రహించండి".

అంత శివదూతలు ఆ భక్తురాలి కోరిక మేరకు అన్ని శివలింగాల దివ్యశక్తిని కలిపి ఒక మహాలింగాన్ని ఆమె ఎదుట ఆవిర్భవింప చేశారు.

ఆ లింగాన్ని దర్శించి, పూజించి ఆమె దైవానుగ్రహ పాత్రురాలైంది. ఆ తీర్థమే "గుణవతి తీర్థం" అయింది. వెంటనే గుణవతి తన దివ్య శరీరంతో శివ సాయుజ్యం పొందింది.

కొంతకాలానికి, లోకంలోని సమస్త మానవులకు జ్ఞానవైరాగ్య సిద్ధి కల్పించడానికి అగస్త్యుడు నాలుగు దినాలు నిరంతరంగా యజ్ఞయాగాది క్రతువులు ప్రారంభించాడు.

## ప్రేత శిల - విష్ణుగయ

సిద్ధేశ్వరానికి దక్షిణభాగాన పర్వతాగ్రాన ఓ ప్రేతశిల దర్శనమిస్తుంది. ఇచ్చట పిండ ప్రదానం, ప్రేత ప్రయాణం ఏ కారణంవల్ల కూడా భువివైపుకు మరలకుండా నివారిస్తుంది. ఒకప్పుడు అరవైవేలమంది సగరుని పుత్రులు కపిలమహాముని శాపకారణంగా ఒకేమారు మరణించారు. వారిని ఉత్తమ లోకాలకు చేర్చే మార్గాన్ని కశ్యపమహాముని భగీరథునికి ఈ విధంగా వివరించాడు.

"తక్షణం నీవు కరవీరపురాన్ని సందర్శించి అచ్చట గయ తీర్థానికి ఉత్తరంగా వున్న ప్రేతశిల వద్ద పవిత్ర గంగాజలంతో నిండిన కొత్త కుండను బద్దలు చేసి సపిండశ్రాద్ధాన్ని నిర్వహించు. దాని ఫలితంగా కపిల మహాముని సగరుని కిచ్చిన శాపవిముక్తి జరుగుతుంది". శాపవృత్తాంతం ఏమంటే–

పూర్వం అయోధ్యను ఇక్ష్వాకు వంశజుడు సగరుడనే చక్రవర్తి పరిపాలించే వాడు. అతనికి కేశిని, సుమతి అనే ఇరువురు భార్యలు.

ఎంతకాలానికి సంతానం కలుగకపోవడంతో అతడు భార్యలతో కూడి హిమవత్పర్వతాలలో దీర్ఘతపస్సు చేశాడు. ఆతని తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమయిన భృగుమహర్షి, కేశిని యందు వంశోద్ధారకుడైన ఒక పుత్రుడు, సుమతియందు మహాబలశాలులైన అరవైవేల మందిపుత్రులు కలిగేలా అనుగ్రహించాడు.

కొంతకాలానికి కేశిని ఒక పుత్రునికి జన్మనిచ్చింది. అతడే అసమంజసుడు. ఇతడు మిక్కిలి దుర్మార్గుడైనందున, అతని దుశ్చర్యలకు వెరచి సగరుడు అతన్ని దేశబహిష్కరణ గావించాడు. ఇతని కుమారుడు అంశుమంతుడు. ఇతడు మిక్కిలి సద్గుణవంతుడు. అంశుమంతుని కుమారుడు దిలీపుడు. దిలీపుని కుమారుడే భగీరథుడు.

ఆశ్చర్యం! సుమతి ఒక సొరకాయను కన్నది. ఆమె దానిని పారవేయ ప్రయత్నించగా, మహాజ్ఞానియైన ఔర్వమహాముని దాని యందలి అరవైవేల బీజాల నుండి ఆమెకు అరవైవేల మంది కుమారులు కలుగగలరని విశదపరచాడు. దైవనిర్ణయంగా అలా జనించిన సగరుని అరవైవేల మంది పుత్రులు ఎంతో దుర్మార్గులై, దేవ మానవులందరినీ హింసిస్తూ లోకకంటకు లయ్యారు. శరణు వేడిన దేవతలకు సృష్టికర్త ఇలా అభయ మిచ్చాడు. "పాతాళలోకంలోని కపిల మహాముని ఆగ్రహానికి పాత్రులై, అనతికాలంలోనే వీరు భస్మం కాగలరు"

ఓ మారు సగరుడు అశ్వమేధయాగం నిర్వహించాడు. ధనుర్విద్యలో ఆరితేరిన సగరుని మనుమడు అంశుమంతుడు యజ్ఞాశ్వాన్ని కాపాడుతూ అనుకరించాడు. దేవేంద్రుడు వాయుదేవుని సహాయంతో ఆ అశ్వాన్ని అపహరించాడు. కలత చెందిన సగరుడు భూమండలంలోను, పాతాళంలోను ఎక్కడున్నా అశ్వాన్ని వెదకి తెచ్చేందుకు తన అరవై వేల మంది కుమారులను ఆదేశించాడు.



భూమండలంపై యాగాశ్వాన్ని కనుగొనలేని సగరపుత్రులు, తమ గోళ్ళ తోను, వివిధ ఆయుధాలతోను భూమిని త్రవ్వి బ్రద్దలు కొట్టారు. అలా అరవైవేల యోజనాలు త్రవ్వి పాతాళం చేరారు. ఇలా భూమిని త్రవ్వే సమయంలో భయంకరమైన శబ్దాలయ్యాయి. కోటానుకోట్ల సర్పాలు, జంతువులు, ఇతర జీవాలు నలిగి చనిపోయాయి. ఎందరో మానవులు, దానవులు, పాతాళంలోని మహాత్ములు ప్రాణాలు కోల్పోయారు.

అలా సగర పుత్రులు విధ్వంసాన్ని సృష్టిస్తూ ఈశాన్య ప్రాంతంలో భూమిని పెకలిస్తుండగా వారికి ఒక దివ్యపురుషుడు కన్పించాడు. అతడే శ్రీమహావిష్ణువు అవతారమయిన కపిల భగవానుడు. ఆతని ప్రక్కనే యాగాశ్వం గడ్డి మేస్తూ తిరుగాడుతోంది. యాగాశ్వాన్ని కనుగొన్న ఆనందం వారిలో తృటిలో మాయ మయింది. అశ్వాన్ని అపహరించిన వ్యక్తి అమాయకంగా ధ్యానముద్రలో వున్నట్లు కపటనాటకం ఆడుతున్నాడు. వారి కోపం కట్టలు తెంచుకుంది. నానాదుర్భాష లాడుతూ ఆయన్ను చంపేందుకు ఏకంగా మీదకు దూకారు. వారి మాటలకు, వికృతచేష్టలకు కోపగించిన కపిలమహర్షి వారివైపు తీక్షణంగా చూశాడు. తక్షణం ఆతని కోపాగ్నికి వారంతా కాలి భస్మమయ్యారు.

పిన తండ్రులను వెదకుతూ ధీరోదాత్తుడైన అంశుమంతుడు పాతాళలోకానికి చేరాడు. పినతండ్రుల మేనమామ, గరుత్మంతుని ద్వారా జరిగిన విషయాన్ని గ్రహించాడు. జలతర్పణం చేయాలనుకొన్నాడు. సాధారణ జలతర్పణాలు ఫలించ వని, సాక్షాత్ గంగను పాతాళానికి కొనితెచ్చి ఆ జలంతో తర్పణ కావిస్తే, భస్మరాశియైన వారంతా పవిత్రులై స్వర్గం చేరగలరని గరుత్మంతుడు సలహా ఇచ్చాడు.

భగీరథుడు పదివేల సంవత్సరాలు హిమాలయాలలో కఠోరతపస్సు చేశాడు. గంగామాతను, శివుని ప్రసన్నులను చేసుకొని గంగపాయను

తనతోపాటు భువికి, ఆ తర్వాత పాతాళానికి చేర్చాడు. పాతాళంలో గంగ కపిలదేవుని పాదాలను తాకి భస్మరాసులపైగా ప్రవహించి సగర పుత్రులను ధన్యులను చేసింది. తరువాత భగీరథుడు "ప్రేతశిల" వద్ద, గంగాజల తర్పణం, సపిండప్రదానం నిర్వహించగా సగరుని పుత్రులు తిరిగి ఉత్తమలోకాలు పొందారు.

అగస్త్యుడు బ్రహ్మసరస్సును సందర్శించి బ్రహ్మచే నాటబడిన మామిడి వృక్షానికి పాదుచేసి నీరిచ్చాడు. పూర్వం ఇక్కడే సృష్టికర్తబ్రహ్మ 'గయ, లవణ, కొల్హ' అనే తన ముగ్గురు మానసపుత్రులను సృష్టించాడు.

వారిలో గయునకు, మానవులలో పాపాన్ని పరిహారం చేసే ప్రక్రియ కేటాయింపబడింది. గయుని పాపపరిహార ప్రక్రియ, యముని ధర్మ నిర్వహణకు ప్రతిబంధకమైంది. యముని ఫిర్యాదు మేరకు దేవతలందరు గయుని ఒక వరం కోరారు. దానికి అనుగుణంగా గయుడు తన శరీరాన్ని యజ్ఞభూమిగా మార్చి త్యాగం చేయాలి. అందుకు అంగీకరించిన గయుడు ప్రతిఫలంగా ఆ పవిత్ర సుందర యజ్ఞవాటిక తన పేరుతో ఆవిర్భవించి తన జన్మ సార్థకం కావాలని ప్రార్థించాడు. ఆమోదించారు దేవతలు.

అందుకు అంగీకరింపని లవణ, కొల్హాదులు కోపోద్రిక్తులయ్యారు. అంగీకరించి, అనుగ్రహించుమని సోదరులను ఎంతగానో ప్రాధేయపడ్డాడు గయుడు. అతని వేడ్కోలు నిష్ఫలమైంది.

సోదరునికి జరిగిన మోసాన్ని జీర్ణించుకోలేని లవణుడు క్రోధంతో దేవత లందరిని భీకర యుద్ధాలలో ఓడించి ముల్లోకాలను పాలించసాగాడు. ధర్మం గతి తప్పటం కారణంగా దేవతల వేడుకోలు మేరకు భక్తజనరక్షకుడైన శ్రీవిష్ణువు లవణుని పీచమణచాడు.

పశ్చాత్తాపంతో గయుడు శ్రీమహావిష్ణువుని ఇలా ప్రార్థించాడు. "జగన్నాయకా! నీ పాదస్పర్శచే నా జన్మ పావనమైంది. నా మరణానంతరం ఈ క్షేత్రం నా స్మరణతీర్థంగా విలసిల్లేలా అనుగ్రహించండి". భక్తవరదుడు శ్రీమహావిష్ణువు కటాక్షంతో ఆనాటినుండి ఆ క్షేత్రం "విష్ణుగయ"గా విరాజిల్లుతోంది.



## కరవీర తీర్థం

ఇరువురు సోదరుల మరణంతో కొల్హుడు ఆవేదనాభరితుడై కోపంతో దేవతలను తుదముట్టిస్తానని ప్రమాణం చేశాడు. బ్రహ్మను గూర్చి దీర్ఘతపస్సు ప్రారంభించాడు. ఇది అదనుగా సుకేశి అనే రాక్షసుడు హేతి, ప్రహేతి అనే తన ఇద్దరు కుమారులతో కలిసి అక్రమంగా రాజ్యాన్ని ఆక్రమించి పాలించ నారంభించాడు. గోవులను బ్రాహ్మణులను హింసించటం, దేవాలయాలను ధ్వంసం చేయడం, మానవులను భక్షించడం అతనికి పరిపాటి అయిపోయింది. మానవులు, దేవతల ప్రార్థన మేరకు చతుర్ముఖ బ్రహ్మ తన సైన్యంతో కొల్హుని మీదకు దండెత్తాడు. అయితే కొల్హుడు సృష్టించిన భీకర అగ్నిజ్వాలలు బ్రహ్మాది దేవతలను ఒక్కమారుగా కబళించసాగాయి. భీతిల్లిన దేవతలు సామరస్యంగా సమస్య పరిష్కరించుకొనేందుకు సిద్ధమయ్యారు. సంధి ప్రక్రియగా బ్రహ్మదేవుడు కొల్హుని యుద్ధపటిమను కొనియాడి ఓ వరం కోరుకొమ్మన్నాడు.

త్రిమూర్తుల నుండి తనకు చావు లేకుండా, భూమండలమంతా తన సామ్రాజ్య మయ్యేలా వరాలిమ్మని కోరాడు కొల్హుడు.

అందుకు సమ్మతించిన బ్రహ్మ, "అంగీకరించాను. అయితే నీవు గో, బ్రాహ్మణులను ద్వేషించకు. సర్వదా వారి హితాన్ని కోరుకో. తక్షణం దక్షిణకాశీ నగరానికేగి సుకేశిని సంహరించి ప్రజారంజకంగా రాజ్యపాలనం చేసి తరించు" అని అనుగ్రహించాడు.

కొల్హుడు-సుకేశిల మధ్య భీషణ సంగ్రామం ప్రారంభమైంది. ఆ ధాటికి ఇరువైపుల సైన్యం సమూలంగా నిర్మూలింపబడింది. చివరకు కొల్హుడు

విజయం సాధించాడు. హర్షాతిరేకాలతో దేవతలు కొల్హునిపై పూలవర్షం కురిపించారు. కొల్హుడు ఆ సామ్రాజ్యానికి చక్రవర్తిగా అభిషిక్తుడైనాడు.

మహాలక్ష్మి అనుగ్రహంతో కొల్హునకు నల్గురు పుత్రులు జన్మించారు. ప్రథమ కుమారుడు కరవీరుని పట్టాభిషిక్తుని చేసి, కొల్హుడు మోక్షప్రాప్తికై తపస్సు ఆరంభించాడు.

కాలక్రమాన కరవీరుడు మద్యపానీయాల మత్తులో మరెన్నో చెడు వ్యసనాలకు బానిసైనాడు. ప్రజల సంక్షేమానికి తిలోదకాలిచ్చాడు. ప్రజాకంటకుడైనాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాదులతో కయ్యం సాగించాడు. కరవీర సామ్రాజ్యంలో ప్రజాజీవనం కడగండ్లపాలైంది.

భక్తుల దీనాలాపనలకు కరుణించి, భక్తానుగ్రహకారిణి – శ్రీమహాలక్ష్మి భీకరయుద్ధంలో కరవీరుని నేలకూల్చింది. అంత్యదశలో కరవీరుడు పశ్చాత్తాపంతో భక్తి వినమ్రతలతో మహాలక్ష్మిని ఇలా ప్రార్థించాడు. "తల్లీ! నీపాదస్పర్శచే పునీతమైన ఈ ప్రదేశం నా నామంతో గుర్తింపబడి నాకు మోక్షసిద్ధి అయ్యేలా కటాక్షించు. నా శరీర భాగాలు పడిన ఎల్లెడలా, పుణ్యతీర్థాలు ఉద్భవించేలా అనుగ్రహించు".

అంత శ్రీదేవి ఆదేశంతో మహారుద్రుడు కరవీరుని శరీరాన్ని నూరు ఖండాలు గావించాడు. అలా ఈ మహాపుణ్యక్షేత్రం కరవీరంగాను, ఇచట వెలసిన బృహత్ సరస్సు కరవీరతీర్థంగాను, రుద్రుని క్షేత్రమైన రుద్రగయ గాను ప్రభవించి ప్రకాశిస్తున్నాయి.

## కొల్హాసుర మోక్షసిద్ధి

కుమారుని మరణవార్తతో ఆవేదనకు గురైన కొల్హాసురుడు జరిగిన అన్యాయానికి వగచి కోపోద్రిక్తుడై ఇలా ఆలోచించాడు. "ఈ దేవతలంతా నా బంధువులను నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. వారు శ్రీమహాలక్ష్మి అండ



చూచుకొని ఈ దుష్కార్యాలకు పాల్పడుతున్నారు. కాబట్టి, కారకురాలైన ఆమెను నేను అడ్డు తొలగించుకోవలసి ఉన్నది. వేళ్ళను సమూలంగా పెకలిస్తేగాని, ఈ కొమ్మల విస్తరణ ఆగదు".

ఈ ఆశయంతో నూరు సంవత్సరాలు కఠోర తపస్సు చేశాడు కొల్హాసురుడు. అతని తపస్సుకు మెచ్చిన సింహవాహిని ఓ వరం కోరుకోమంది.

"తల్లీ! నేను నా శత్రు నిర్మూలనం గావించవలసి వున్నది. కావున నీవు నూరు సంవత్సరాలు ఈ నగరాన్ని విడిచి వుండవలెను. అనుగ్రహించు" అని కోరాడు.

భక్తవరదయై కొల్హాసురుని కోరిక మేరకు వరాన్ని ప్రసాదించిన శ్రీమహాలక్ష్మి ఒకింత ఆవేదనతో కరవీరపురం వీడి ఒంటరిగా హిమాలయాలలో నివసించ సాగింది. కరవీరాన్ని వీడిన ఆవేదన ఆమెను కలచివేయసాగింది.

అదే అదనుగా సర్వ సామ్రాజ్యాధిపతి అయిన కొల్హాసురుడు "బ్రహ్మ విష్ణు మహేశ్వరు"లను వధింప తన సైన్యాన్ని ఆదేశించాడు.

రాక్షస సైన్యం ప్రథమంగా దేవలోకంపై దండెత్తింది. దేవతలు ప్రాణాలు అరచేత పట్టుకొని రహస్య స్థావరాలలో తలదాచుకోసాగారు. రాక్షస సైన్యం ముల్లోకాలలో భీభత్సం సృష్టిస్తూ కుసుమ కోమలులైన రాకుమార్తెలను బందీలను చేయసాగారు. దేవతలను, మునులను యథేచ్ఛగా వధిస్తూ యజ్ఞయాగాదులకు భంగం కల్గిస్తూ లోకంలో ధర్మానికి విఘాతం కల్గిస్తున్నారు. దేవతల మొర ఆలకించిన విష్ణుప్రియ దుష్టశిక్షణకై, యుద్ధానికి సన్నద్ధురాలై ఆయుధధారులైన అనుచరులు, "రాంకా భైరవుడు, కాల విఠలుడు, సిద్ధుడు, భాటుకేశ్వరుడు మరియు చాముండాది గణాలతో" కూడి రాక్షసలోకానికి తాను అనుగ్రహించిన కాలపరిమితి ముగిసేవరకు

వేచి చూసి, తరువాత రాజ్యంలోకి తిరిగి అడుగుపెట్టింది. తదనంతరం రాక్షససైన్యాన్ని తన అజేయశక్తితో తుదముట్టించి ఆర్తులను ఆదుకుంది.

కొల్హాసురుడు క్రోధంతో భీకరుడైన రక్తలోలుడనే రాక్షసుణ్ణి కదనానికి పంపాడు. దేవి ఉజ్వలాంబ రూపంలో భైరవుని సహకారంతో భీకరయుద్ధంలో రక్తలోలుని అంతమొందించింది. ఆగ్రహోదగ్రుడైన కొల్హాసురుడు దేవతల ఆయుధా లన్నింటిని మాయం చేసి వారిని నిరాయుధుల చేయసాగాడు.

అంత శ్రీమహాలక్ష్మి, గోబ్రాహ్మణ దేవతాది ఆర్తులను, రక్షించి శాంతిని నెలకొల్పటానికై దివ్యాలంకార భూషితయై, సమస్త ఆయుధాలను ధరించి తొమ్మిది కోట్ల కాత్యాయనులతోను, యాబది ఆరు కోట్ల చాముండ శ్రేణులతోను కూడి భీకర రాక్షసులను చంపి, వారి రక్తం గ్రోలి నృత్యహేల కావించసాగింది.

ఇలా ఉండగా సమస్త లోకాలలో సుఖశాంతులు పాదుగొల్పేందుకై శ్రీహరి, బ్రహ్మ, రుద్రాదులు, కొల్హాసురుని తమ దివ్యశక్తితో నదీగర్భంలో పడవేశారు.

కొల్హాసురుని మృత్యుకారక శక్తి అతని శిరస్సునందు కేంద్రీకృతమైనదన్న సత్యాన్ని అతని కనిష్ఠ సోదరి ద్వారా శ్రీమహాలక్ష్మి తెలుసుకున్నది.

తన తప్పిదాన్ని తెలుసుకొన్న కొల్హాసురుడు మృత్యువు ఆసన్నమవుతున్నదని గ్రహించి పరమశివుని శరణుజొచ్చాడు. దయాళువైన శంకరుడు "తాను, బ్రహ్మ, విష్ణువు అతని శరీరంలో దివ్యశక్తి ప్రసాదించే జీవకణాల రూపంలో నిలుస్తామన్న" వాక్కుతో అనుగ్రహించాడు.

అంత కొల్హాసురుడు పరమశివునితో "తండ్రీ! నీ అనుగ్రహానికి కృతజ్ఞుణ్ణి. భోగభాగ్యాలు, రాజ్యాధికారాలు దుఃఖకారకాలు. బంధువులు రాబందుల వంటివారు. త్రిమూర్తుల దర్శనంతో నా జన్మ పావనమైంది. మీ చేత మరణం, పాపభూయిష్టమైన ఈ ఐహికజీవితం కన్నా ఎన్నో రెట్లు



విలువైంది. ఆగ్రహంతో వున్న శ్రీలక్ష్మి నన్ను అనుగ్రహించి, మోక్షం ప్రసాదించేలా, నా అభ్యర్థనను ఆమెకు నివేదించండి" అని ప్రార్థించాడు. అంత పరమశివుడు శ్రీమహాలక్ష్మికి మ్రొక్కి "శ్రీహరిప్రియా! నీవు జగన్మాతవు. బిడ్డలనందరిని భేదభావం లేక పోషించి పాలించే దానవు. నీ ఆగ్రహం సముచితమే అయినా పశ్చాత్తాపంతో వ్యధనొందే కొల్హాసురుని ఆశీర్వదించి అనుగ్రహించు" అని పలికాడు.

అంత పెల్లుబుకుతున్న మాతృవాత్సల్యంతో శ్రీమహాలక్ష్మి కొల్హాసురుని ఉద్దేశించి "కుమారా! నీ యుద్ధపటిమకూ, నీ పశ్చాత్తాపానికీ పరిణతికి ప్రసన్నురాలనయ్యాను. కరవీరంలోని గయతీర్థంలో నీవు యుగాంతరాలుగా నివసించేలా అనుగ్రహిస్తున్నాను. ఆ క్షేత్రం భక్తులకు ఆముష్మిక స్థితి కల్పించే ప్రదేశంగా విరాజిల్లగలదు. ఇచ్చట స్వయంగా శంకరుడే పరివేష్టితుడై సమస్త లోకాలను రక్షిస్తుంటాడు" అని పలికింది.

కొల్హాసురుడు లక్ష్మీదేవితో "ఓ మహామాతృక! నీ అనుగ్రహానికి నా జన్మ ధన్యమయింది. బిడ్డల తప్పులను సరిదిద్ది సన్మార్గాన నడపటం తల్లి యొక్క విద్యుక్త ధర్మమని మీ క్షమాగుణం నిరూపించింది. నా చెంతనే నీవు ఇదే దివ్య రూపంతో శాశ్వతంగా కొలువైవుంటూ, నీ దర్శనమాత్రాన్నే భక్తులు పునీతులయ్యేలా అనుగ్రహించు. ఇప్పటినుండి ఈ ప్రదేశం "కొల్హాపురం" అని పిలవ బడేలా ఆశీర్వదించి, నా నామం అమరం అయ్యేలా అనుగ్రహించు" అని భక్తిపారవశ్యంతో ప్రార్థించాడు.

అలాగే అంటూ త్రైలోక్యకుటుంబిని కొల్హాసురుని వధించి మోక్షప్రాప్తి కలిగించింది. తక్షణం తన దివ్యశక్తితో యుద్ధంలో మరణించిన దేవతలందరని పునర్జీవితులను గావించింది.

భరతఖండంలో పదునాలుగు దివ్య లింగాలు వెలసి ఉన్నాయి. రుద్రేశ్వర అనే పేరుతో మహాశివుడు కొల్హాపురంలో పరివేష్టితుడై ఉన్నాడు.

ఇచ్చట "విష్ణు, అగ్ని, సూర్య-చంద్రులు, నాల్గువేదాలు, విష్ణుపాదాలు" అనే శక్తి స్థానాలు కేంద్రీకృతమై ఉన్నాయి. కలియుగంలో కరవీరపురం మిక్కిలి పవిత్రమైనదై అక్కడ భక్తితో అంబను పూజించిన వారికి - మోక్షప్రాప్తి, చేసిన పిండ ప్రదానాలు - పితృదేవతలకు ఉన్నతలోక ప్రాప్తి కల్పింపచేస్తోంది.

## వేదపరిజ్ఞానం

మూడున్నర కోట్ల పుణ్యతీర్థాలు "నివృత్తిసంగమం"లో నెలకొని వుండడంవల్ల కరవీరపురం సర్వకాల సర్వావస్థలలో ఆధ్యాత్మికశోభతో అలరారుతుంటుంది. సింహరాశి సహిత అష్టమి, గురు, శుక్రవారాలు, అధిక మాసాలు, ఇచ్చట శ్రాద్ధక్రియలకు శ్రేష్ఠం.

క్షణ మనేది కనురెప్పపాటు కాలంతో సమానమైంది. కాలం అనేది అనంతం మరియు విశ్వవ్యాపకం. అయితే లక్ష్యం మాత్రమే కాలానికి ప్రమాణమై నామ ఫలితాలను ఆపాదింపచేస్తుంది.

సూర్యగమనం దక్షిణ దిశలో జరిగే కాలం దక్షిణాయనమని, ఉత్తరదిశ యందు జరిగే కాలం ఉత్తరాయనమని ఆరు మాసాల చొప్పున ఒక సంవత్సర కాలం విభజింపబడింది.

దేవతలకు కావించే పూజాదికాలు మధ్యాహ్నం 12.00 గంటలలోపు గాను, పిండప్రదానాది పితృకార్యాలు మధ్యాహ్నం 12.00 గంటల తదుపరి నిర్వహించవలెనని శాస్త్రాలు వచిస్తున్నాయి.

గ్రహణకాలంలో, వ్యతీపాత యోగంలో, ఏనుగు నీడన, కపిల షష్టి కాలంలో, సంక్రాంతి కాలాన చేసిన దానాలు మరెన్నో రెట్లు పుణ్యఫలాన్ని అందిస్తాయి.

అర్ధరాత్రి సమయంలో చేయబడిన దానధర్మాదులు దుష్ఫలితాలను కలుగజేస్తాయి. అట్టి సమయంలో ఈనడానికి సిద్ధంగా వున్న ఆవును దానం



చేయడం శ్రేయస్కరం. పవిత్ర పుణ్యక్షేత్రాలలో చేసిన దానధర్మాలు అపరిమిత పుణ్యఫలం ప్రాప్తింప చేస్తాయి.

శ్రీచక్ర ప్రతిష్ఠితమై, శ్రీమహాలక్ష్మి స్థానమైన కొల్హాపురంలో పంచగంగ యందు పవిత్రస్నానం చేసి భక్తి శ్రద్ధలతో శ్రీమహాలక్ష్మిని పూజించటం మంగళప్రదం, అష్టైశ్వర్యప్రదాయకం.

పరుల సొమ్మును అపహరించడం, శాస్త్ర, ధర్మవిరుద్ధమైన చర్యలు, హింస, పరస్త్రీ సాంగత్యం, వంటి పాపకార్యాలు కరవీరపురంలో చేయకూడదు.

ఇచటి దక్షిణపర్వతం ధనుస్సు ఆకారంలో వుంటుంది. ఈ వింటికి "త్రయంబులి - సిద్ధబాటుక" అనే రెండు దివ్యక్షేత్రాలు రెండు కొనలుగా దర్శన మిస్తాయి. "మయూరి-జీవంతి" నదులను బాణాలుగా ప్రయోగిస్తూ శ్రీమహాలక్ష్మి ఈ కలియుగంలో మానవకోటి పాపాలను పరిహారం చేస్తోంది. అందుచేత ప్రపంచమంతా సర్వత్రా ప్రస్ఫుటమయ్యేలా అనంతమైన ప్రకృతి సంపద, అలౌకిక ఆనందానిచ్చే ఆధ్యాత్మిక జీవనం, సుఖసంతోషాలు వెల్లివిరుస్తున్నాయి.

ఉత్తర దిక్కున వున్న "వ్యాంకటేష్" - "హటకేష్" తీర్థాల్లో పూజలు సల్పిన, అమోఘమైన పుణ్యఫలం ప్రాప్తిస్తుందని ప్రతీతి.

పర్వతాలలో హిమాలయాలు, యాగక్రతువులతో అశ్వమేధం, స్త్రీలలో గౌరి, దాతృత్వంలో అన్నదానం - భీతిగొన్నవారికి రక్షణ కల్పించడం, అత్యున్నత ప్రమాణాలు. అలానే కలియుగంలో పుణ్యక్షేత్రాలలో కరవీరం మిక్కిలి ప్రసిద్ధి గాంచింది. అనన్యసామాన్యమైన "భోగవతి" నది సర్వపాప వినాశిని. భగవదనుగ్రహ సాధనకు, "నిబద్ధతతో కూడిన జీవనం-దృష్టి కేంద్రీకరణ- ఆత్మసమర్పణ" అత్యావశ్యకాలు. ప్రపంచమంతా ఆస్తికత్వం అనే గోళం, దైవభక్తి ఇరుసు కాగా పరిభ్రమిస్తున్నది. భక్తికి తగు ఫలం -

"సముచిత, సమయ, సందర్భ, ప్రాదేశిక" నియమానుసారం ప్రసాదించ బడుతుంది. ఇది యోగి పుంగవుల వేద పరిజ్ఞానమని చెప్పబడుతోంది.

## త్రయాంబులి

పునర్జన్మ పొందిన దేవతలు, నిర్బంధం నుండి విడుదలైన రాకుమార్తెలు, కొల్హాసురునిపై శ్రీమహాలక్ష్మి ఘనవిజయోత్సవాన్ని భక్తిప్రపత్తులతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. "ఓ దేవీ! పున్నమినాటి పూర్ణచంద్రుని వంటి నీ మోమును చూచిన వాళ్లందరూ నీ అనుగ్రహం పొంది వరసిద్ధులౌతారు" అని ప్రస్తుతించ సాగారు.

లక్ష్మీదేవి వారితో ఇలా చెప్పసాగింది. "భక్తులారా! మీరు నాకెంతో ప్రీతిపాత్రులు. మిమ్మల్ని నా పరిచారికలుగా అనుగ్రహిస్తున్నాను. మీరు యోగిని, ఢాకిని, కాళరాత్రి, రుద్రభేతాళి, మదన మొదలైన అరవైనాల్గు పేర్లతో వర్ధిల్లండి".

అష్టసంఖ్య గల వసు, రుద్ర, గంధర్వాది దేవతలు విశ్వవంద్య అయిన మహాలక్ష్మిని ఇలా స్తుతించసాగారు. "వసుప్రదా! నీ దివ్యశక్తితో ఈ విశ్వమంతా ప్రభావితమై 'సృష్టి, స్థితి, లయ'లు గతి తప్పక కాలచక్ర గమనానుసారం కదిలి పోతున్నాయి. నీవు దయాంబురాశివి. కొల్చిన వారికి నీవు కొంగుబంగారమైనట్టి దానవు. భక్తులకు ముక్తిప్రదవు. శిష్టరక్షణ, దుష్టశిక్షణలకు ప్రతీకవు. నీ దివ్య అంశ సామాన్యులకు అవగతం కానిది. కానీ తల్లీ! దుస్సాహసి అయిన కొల్హాసురుని నీవు వధించే సన్నివేశాన్ని వీక్షించలేనందుకు మాకు ఎంతో ఆవేదనగా వున్నది".

అంత శ్రీమహాలక్ష్మి వారిని అనుగ్రహించి వెంటనే ఒక బూడిదగుమ్మడి కాయను సృష్టించి ఖండాలుగా చేసి తన పాదాలతో తొక్కి ఆ వధ దృశ్యాన్ని కనులకు కట్టినట్టుగా చూపింది. ఆ దృశ్యంలో కొల్హాసురుని నిజరూపాన్ని కాంచిన దేవతలు మంత్రముగ్ధులైనారు. తదుపరి శ్రీమహాలక్ష్మి



అమృతవాహిని లోని జలాన్ని ప్రోక్షణ చేసి దేవతలనందరిని అమరులను చేసింది.

కౌండిన్యమహర్షి భార్య మహాసాధ్వి. ఒకదినం ఆమె సభక్తికంగా తన భర్త పాదసేవ చేస్తుండగా మైమరచి అతడు నిద్రించాడు. ఆహారం కోసం బిచ్చగాని కేక విన్న ఆ సాధ్వి లేచి వంటగదివైపు అడుగులేసింది. నిద్రాభంగమైన కౌండిన్యుడు ఆగ్రహంతో ఈ అపచారానికి ఫలితంగా "నీవు పరిచారికగా జీవింతువు గాక" అని శపించాడు. "ఇది అన్యాయం" అని ఆమె ఆక్రోశించింది. "నీవు ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, దేవతరూపంలో శ్రీమహాలక్ష్మికి పరిచారికవై, సేవించి, దేవి అనుగ్రహం పొందుతావు" అని, అలా శాపంతోనే దివ్యానుగ్రహం కల్పించాడు కౌండిన్యుడు.

విశాలాక్షి భార్గవుడనే బ్రాహ్మణుని భార్య. ఆమె ఎంతో దైవభక్తురాలు. ఆమె ప్రతి సంవత్సరం ఒక బాలికకు జన్మనిచ్చేది. కాని ఆ బిడ్డ జన్మించిన ఐదవ రోజునే మృతి చెందేది. ఈమారు పుట్టినబిడ్డ జీవిస్తే లక్ష్మీదేవికే సమర్పిస్తామని మొక్కుకున్నారు ఆ దంపతులు. దైవనిర్ణయంగా, శాపగ్రస్తయైన కౌండిన్యుని భార్య, విశాలాక్షి గర్భంలో ప్రవేశించింది. భార్గవుని సంసారంలో సుఖశాంతులు వెల్లి విరిసాయి. విశాలాక్షి సప్తమమాసంలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ బాలిక దైవస్వరూపిణిగా నాలుగుచేతులు కలిగివుంది. పాపను చూసినవారంతా ఆశ్చర్యచకితు లయ్యారు. శ్రీమహాలక్ష్మి తనకు అలాంటి బిడ్డను ప్రసాదించినందుకు విశాలాక్షి వేదనతో కుమిలి పోసాగింది. పుట్టిన ఆ బాలిక ఆమెను ఓదారుస్తూ ఇలా చెప్పసాగింది. "నదీ ప్రవాహంలో కొయ్య ముక్కలు కలుస్తూ వుంటాయి. విడిపోతూ వుంటాయి. అటువంటిదే మానవజీవితం. సత్యం మాత్రమే సర్వోన్నతమైనది. ఆ సృష్టి ధర్మసూత్రాన్ని అనుసరించి ఈ జగత్తులో గాలి వీయడం, సూర్యుడు ప్రకాశించడం లాంటివి గతి తప్పకున్నాయి.

దైవానుగ్రహం వలన, నీవు కోల్పోయిన నీ ఐదుగురు సంతానాన్ని తిరిగి పొందగలవు. దైవనిర్ణయం శిరోధార్యం. ఆవేదన మాని భగవత్ప్రేరితంగా ఈ ప్రసాదాన్ని స్వీకరించు". విశాలాక్షి కళ్ళు ఆనందంతో చెమర్చాయి.

ఆ బాలిక పెరిగి పెద్దదై అనునిత్యం పంచగంగ మొదలైన తీర్థాలలో పుణ్యస్నానాలను ఆచరిస్తూ లక్ష్మీదేవిని ఆరాధిస్తూ దినదిన ప్రవర్ధమానంగా ఎదుగసాగింది. ఒక దినం నగరంలోని దైవభక్తుడైన డబీరుని ఇంటిలోని స్వర్ణకమలాలను పాతాళరాక్షసులు దొంగలించారు. రాక్షసులను వధించి స్వర్ణ కమలాలను తిరిగి డబీరునికి చేర్చమని లక్ష్మీదేవి ఆ బాలికను ఆదేశించి, ఆశీర్వదించింది. ఆ బాలిక ఒకదినంలో ముమ్మారు పాతాళజలంలో ప్రవేశించి రాక్షసులను సంహరించి దేవి ఆదేశాన్ని అమలు చేసింది. ఈ బాలిక ఆనాటినుండి "త్రయాంబులి"గా ప్రసిద్ధి గాంచింది.

త్రయాంబులి చేతిలో తన తండ్రి మరణించడాన్ని జీర్ణించుకోలేని కొల్హాసురుని మనుమడైన కరాలిసుతుడు ఆగ్రహంతో తన సైన్యంతో కొల్హాపుర సామ్రాజ్యంపై దండెత్తాడు. కాని దేవి దివ్యశక్తిని ఎదుర్కోలేక కొల్హాపురాన్ని తప్ప ఇతర ప్రదేశాన్నంతటిని జయించి పరిపాలించసాగాడు. ఆ సంగ్రామంలో శ్రీమహాలక్ష్మి ఆగ్రహజ్వాలలకు గురై వేలాదిమంది రాక్షసులు భస్మమయ్యారు. కరాలిసుతుడు, కామాక్షుడు మొదలైన రాక్షసులు ప్రాణాలు అరచేత పట్టుకుని పాతాళానికి చేరి దేవతలను జయించాలనే కఠోరదీక్షతో తపస్సు ప్రారంభించారు.

## కామాక్షుని వధ

కామాక్షుని దీక్షకు మెచ్చి రాక్షసగురువు శుక్రాచార్యుడు ప్రత్యక్షమైనాడు. "యుద్ధ తంత్రానికి నాందీగా, కపిలుని వద్దనున్న యోగదండాన్ని ఎలాగైనా వశం చేసుకో. ఆ యోగదండం కుడివైపుకు మరలిస్తే దేవతలు గొర్రెల మందలుగా మారిపోతారు. ఎడమవైపుకు మరలిస్తే యథాతథంగా



దేవతలౌతారు. సరైన సమయంలో నిన్ను తోడేలుగా మారుస్తాను. దేవతాగణ నిర్మూలన సులభతర మౌతుంది" అని సలహా యిచ్చాడు శుక్రాచార్యుడు.

కామాక్షుడు పాతాళానికి చేరి తన సోదరి 'రక్త'తో కూడి కపిలుడి అనుగ్రహం కోసం సపర్యలు చేయసాగాడు. సేవలకు సంతృప్తి చెందిన కపిలుడు కామాక్షుని కోరిక మేర దండాన్ని ప్రసాదించాడు. దండాన్ని పొందిన గర్వంతో కన్నుమిన్ను గానక కామాక్షుడు కొల్హాపురంపై దండెత్తాడు. అతని పీచమణచడానికి శ్రీమహాలక్ష్మి తన సైన్యాన్ని పంపింది. ఇదే అదనుగా సందర్శకులైన భక్తులకు ఆహారంగా త్రయాంబులి పంపిన శనగ ధాన్యాన్ని దుష్టరాక్షసులు కొల్లగొట్టసాగారు.

బలి ప్రక్రియగా బూడిద గుమ్మడిని ఖండాలుగా చేసి, దేవతలు యుద్ధానికి సిద్ధమయ్యారు. సింహరూపం దాల్చిన కామాక్షునిపై శ్రీలక్ష్మి ఈటెను ప్రయోగించింది. కామాక్షుడు తన దండాన్ని ప్రయోగించగా దేవతలందరు గొర్రెలుగా మారిపోయారు. అదే అదనుగా సింహరూపంలోని కామాక్షుడు గొర్రెల రూపంలోని దేవతలను మింగి వేయసాగాడు. అతని సోదరి కొన్ని గొర్రెల పాలు పితికి వికృతంగా సేవిస్తూ వికటాట్టహాసంతో త్రయాంబులితో కదనానికి కాలు దువ్వింది.

మోసాన్ని మోసంతోనే జయించాలని త్రయాంబులి వృద్ధ పరిచారిక రూపం ధరించి ఆ ప్రదేశంలో బుట్టతో పిడకలు సేకరించడం మొదలెట్టింది. కామాక్షుడు అపరిచిత స్త్రీ సంచారాన్ని సందేహించి ఆమెను నిలువరించాడు. మారువేషంలోని త్రయాంబులి తాను యజ్ఞయాగాదులకు గాను పిడకలను సేకరిస్తున్నానని, భారమైన బుట్టను తన నెత్తిన పెట్టుకోవడానికి సహాయం చేయమని అర్థించింది. కామాక్షుడు గంప నెత్తే పనిలో నిమగ్నమై వుండగా త్రయాంబులి అతని వద్ద నున్న దండాన్ని స్వాధీనం చేసుకొని దాని దిశ మార్చడం ద్వారా దేవతలకు నిజరూపం కల్పించింది. కామాక్షుడి కోపం

అవధులు దాటింది. భీకర యుద్ధం సాగించాడు. త్రయాంబులి ఓ మహాపర్వతాన్ని అతనిపై విసిరి కాలితో నలిపి సంహరించింది.

యుద్ధరంగంలో తీవ్రంగా శ్రమించిన త్రయాంబులి తూర్పు దిక్కున వున్న ఓ శిఖరాగ్రాన ఏకాకిగా సేద తీరుతోంది. విజయానందపు సంబరాల్లో మునిగిన దేవతలు త్రయాంబులిని మరచారు. గుమ్మడికాయను ఖండించ రమ్మని ఆహ్వానించేందుకు దేవతలను త్రయాంబులి వద్దకు పంపింది శ్రీమహాలక్ష్మి. కృతఘ్నులైన దేవతలపై త్రయాంబులి ఆగ్రహం వ్యక్తం చేసింది. వారి ఆహ్వానాన్ని తిరస్కరించి అలుకతో ఇలా పలికింది. "లక్ష్మీదేవి దివ్య అనుగ్రహంతో శక్తి వంతురాలనైన నేను మీ క్షేమం కోసం ఎంతో శ్రమించాను. కానీ మీరు తక్షణం నా మేలు మరచారు. మీ ప్రవర్తన ఏరు దాటిన తదుపరి తెప్పను తగులబెట్టడం వలె వుంది. సహాయం పొందిన పిదప ఓడ సరంగును, వైద్యుని, వైద్యసేవికను విస్మరించడం ఈ లోకంలో సహజమే కదా!"

అంత, ఆహ్వానించేందుకు జలజవాసిని స్వయంగా ప్రత్యక్షం కాగా త్రయాంబులి సంభ్రమాశ్చర్యాలతో "తల్లీ! నీ దర్శనం వల్ల నేను ధన్యురాలి నయ్యాను. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పంచమి దినాన ముక్తి మండపంలో జరిగే కూష్మాండబలి (దేవతాప్రీతికై బూడిద గుమ్మడి బలి నివేదన) కార్యక్రమం నా మండప ద్వారంలోనే నిర్వహింపబడేలా అనుగ్రహించు. నన్ను సందర్శించిన పిమ్మటే భక్తునికి సంపూర్ణ తీర్థయాత్ర ఫలం సిద్ధించేలా వరమివ్వు" అని ప్రార్థించింది.

'అలాగే' అని శ్రీమహాలక్ష్మి అనుగ్రహించగా దేవతలందరు హర్షాతి రేకాలతో జేజేలు పలికారు.

దేవి త్రయాంబులి తన ఆగ్రహాన్ని ఉపసంహరించి, తనను భక్తితో కొలిచిన వారికి సమస్త సుఖసంపదలు సిద్ధిస్తాయని ఆశీర్వదించింది.



కామాక్షుడు దేవతలను గొర్రెలుగా మార్చినందున అతని వంశంలో ఇక గొర్రెలు మాత్రమే జనించేలాగా శపించింది. కావున ప్రజలు యజ్ఞయాగాదులందు గొర్రెలను బలి చేయటం, ఆహారంగా వినియోగించడం ఆచారమైంది.

## ఉజ్వల తీర్థ మాహాత్మ్యం

అగస్త్యుడు ఉజ్వలాంబ దేవిని, ఆమె సృష్టించిన పాప వినాశిని అయిన, వారణ నదిని భక్తితో పూజించాడు.

ఈ తీర్థంలో పూర్వం ఉజ్వలాంబదేవి క్రూర దానవుడు రక్తలోలుని సంహరించింది.

పూర్వం ఒక నగరంలో ధర్మభ్రష్టుడై, సదాచారాలను వీడి, దుష్కామకర్మ లకు బానిసయైన ఒక వ్యక్తి పాప పరిహారార్థం ఒక యోగిని ఆశ్రయించాడు.

"కరవీరనగరాన్ని సందర్శించి, నీ దక్షిణ హస్తంలో నల్లని సీసం ముద్దను ఉంచుకొని అక్కడి సర్వతీర్థాలలో స్నానమాచరించి దేవతా దర్శనం గావించు. సీసం శ్వేతవర్ణంగా మారిన సమయంలో నీ పాపం పరిహారమైనట్లు గమనించు" అని అనుగ్రహించాడు ఆ యోగి.

ఆ వ్యక్తి కరవీరంలోని అన్ని తీర్థాలలో స్నానం చేసి ఉజ్వలతీర్థంలో స్నానానంతరం ఉజ్వలాంబ దర్శనం చేసుకొనే సమయాన చేతియందలి సీసం తెల్లగా మారింది. ఇది ఉజ్వలతీర్థ మాహాత్మ్యం. ఈ తీర్థం కొల్హాపురానికి తూర్పుదిక్కున నెలకొని ఉన్నది.

## సాంబుని శాపవిముక్తి

అగస్త్యుడు తన యాత్రలో భాగంగా ఆగ్నేయదిశలోని "గోకుల సిర్గాం" చేరాడు. ఇచ్చట సూర్యకాంతి సోకిన సరోవర జలాలు వైడూర్యకాంతితో ప్రకాశిస్తున్నాయి. ఆ ప్రదేశమంతా వసంతం వెల్లివిరుస్తోంది. తన

పాపకర్మలను పరిత్యజించడానికి భగవానుడు శ్రీకృష్ణుడు ద్వాపరయుగంలో ఈ ప్రదేశాన్ని సందర్శించాడు. ఇది సాక్షాత్ శ్రీకృష్ణుని పాదస్పర్శ భాగ్యం పొందిన పావనమైన ప్రదేశం.

శ్రీకృష్ణుని బాల్య క్రీడలను శాశ్వతంగా భక్తులు, తాము, చూచి తరించేలా అనుగ్రహింపమని దేవకి, వసుదేవులు ప్రార్థించగా, శ్రీకృష్ణుడు గోకులేశ్వర క్షేత్రాన్ని సృష్టించాడు. ఈ తీర్థంలో శ్రావణ బహుళ పంచమినాడు ఆచరించిన పూజలు, దానాలు పుణ్యఫల ప్రదాయకాలు అయ్యేలా అనుగ్రహించాడు.

దుష్టసంహారం చేసి భూభారం తొలగించడానికి శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో యదువంశంలో దేవకీ వసుదేవులకు పుత్రుడై శ్రీకృష్ణునిగా అవతరించి, ద్వారకవాసియై లోకాల నేలుచున్న సమయం అది.

శ్రీకృష్ణునకు తన అష్టమహిషులలో ఒకతె అయిన జాంబవతి ద్వారా సాంబుడు జన్మించాడు. ఆ సాంబుడు పసివాడుగా ఉన్నప్పుడు ఒకరోజు వీధిలో తన స్నేహితులతో కలసి ఆడుకొంటుండగా నారదమహర్షి అచ్చట ప్రత్యక్ష మయ్యాడు.

ఆటపాటలలో మునిగిన ఆ కృష్ణనందనుడు నారదుని రాకను గమనించ లేదు. వినోదరతుడైన అతడు ఆడుచుండెనేగాని నారదునికి నమస్కరించ లేదు. సాంబుడు తనకు ప్రణతి చేయలేదన్న కోపాన్ని మనసులో దాచుకున్న నారదుడు, శ్రీకృష్ణుని హెచ్చరిస్తున్నట్లు "స్త్రీ వ్యామోహంలో ఏమారి వుంటే మొదలుకే మోసం కలుగుతుంది సుమీ!" అంటూ పరోక్షంగా సాంబుని ధూర్తునిగా పేర్కొన్నాడు. కానీ శ్రీకృష్ణుడు ఎంత వెదికినా సాంబునిలో చిన్నపాటి తప్పును కూడా ఎంచలేక పోయాడు.

త్రిలోకసంచారి నారదుడు కోపంతో సాంబుని అణచి వేసే సందర్భం కోసం ఎదురు చూడసాగాడు. ఓమారు నారదుడు ద్వారకలో ప్రవేశించి



సాంబుని చూచి, శ్రీకృష్ణునికి తన రాకను తెలియజేయమని ఆదేశించాడు. 'సమయం కాని సమయంలో తల్లిదండ్రుల ఏకాంతాన్ని భంగపరచటం అనుచితం. కానీ పోక తప్పదు. మహర్షి ఆజ్ఞ! ఏం చేయాలి?' అని మనసున వ్యాకులతతో సాంబుడు ఎట్టకేలకు అంతఃపురంలోని తల్లిదండ్రులకు నారదుని రాకను తెలియచేసి, వారి సరస సల్లాపాలకు అంతరాయం కల్గించాడు. దైవమాయ! ఏకాంత సమయభంగం అనే అపరాధ కారణంగా సాంబుని కుష్ఠువ్యాధి బాధితుడయ్యేలా శపించాడు శ్రీకృష్ణుడు.

పశ్చాత్తాపంతో, వినమ్రుడై సాంబుడు తండ్రికి – నారదునికి నమస్కరించి శాపవిముక్తిని తెలిసికొని దక్షిణకాశీనగరమైన కొల్హాపురం చేరి భక్తి ప్రపత్తులతో ఆదిత్యుని ఆరాధించి కుష్ఠువ్యాధి నివారణ పొందాడు.

## శ్రీకృష్ణుడు నిష్కృతి పొందడం

ఆశ్చర్యంతో అడిగింది సాధ్వి లోపాముద్ర. "నాథా శ్రీకృష్ణ దంతటివాడు పాపకార్యాలు చేయడం, వానిని పరిత్యజించటం ఏమిటి?"

అగస్త్యుడు ఇలా వివరించాడు. "దేవీ! సాక్షాత్ శ్రీమహావిష్ణువైన శ్రీకృష్ణుడు చేసిన పాపకార్యాలు ఏవీ లేవు. కాని మానవునిగా జన్మించి నందున ఆతడు లోక ధర్మం అనుసరించి, మార్గదర్శియై ఆదర్శప్రాయుడు కావలెను గదా! శ్రద్ధగా ఆలకించు".

ఒకదినం శ్రీకృష్ణుడు ధర్మనిరతులైన యోగిపుంగవులు, పండితులను రాజభవనానికి పిలిపించి,

"అయ్యా! స్త్రీలు మనోవాక్కాయ కర్మలలో పరపురుష సాంగత్య దోషాలను ఆచరిస్తే తత్ఫలం వారి భర్తల జీవితం పైనే గాక సంపూర్ణ కుటుంబంపై ప్రభావం చూపి పవిత్ర ప్రామాణిక కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం

అవుతుంది. అలాగే పరస్త్రీ సాంగత్య దోషం వలన పతితులైన పురుషులు నా కటాక్షానికి నోచుకోరు. ఇలాంటి దుష్కామ కర్మల వార్తలు నా చెవుల సోకినందున, అలాంటి దృశ్యాల వీక్షణం వలన కల్గిన పాపనిష్కృతికి, నేను దర్శించి సేవించదగ్గ పుణ్యక్షేత్రం ఏదో తెలియ జేయండి" అంటూ విన్నవించుకున్నాడు.

యోగిపుంగవులు ఆశ్చర్యంతో "ప్రభూ! నీ నామస్మరణంతోనే సమస్త పాపాలు నశిస్తాయి. నీ పాదస్పర్శతో రాతిరూపంలో వున్న సాధ్వి అహల్య నిజరూపాన్ని పొందింది. సర్వ సంపద్ప్రదాయిని అయి, శివుని శిరస్సున నాట్యం చేసే పవిత్ర గంగ నీ సృష్టే! అట్టి సర్వ జగద్రక్షకుడవు, నీవు మమ్మల్ని మార్గం సూచించమని కోరడం ఏమిటి?" అన్నారు వినయంగా.

వారికి అభివందనం చేసిన శ్రీకృష్ణుడు "భరతఖండంలో కోట్లాది తీర్థాలు వున్నాయని ప్రాశస్త్యం. వాటిలో ప్రముఖమైన క్షేత్రం ఏదో సెలవివ్వండి" అని ప్రార్థించాడు.

యోగిపుంగవులు భక్తితో "జగన్నాయకా! భరతఖండంలోని క్షేత్రాలలో ఏ ఒక్కటీ కరవీర క్షేత్రం పదహారవవంతుతో కూడా సమం కాకున్నవి. అచ్చటి కేదారతీర్థంలోని జలసేవనం, హవిస్సు అనంతరం యజ్ఞకర్తలచే సేవింపబడే సోమరసంతో సమానం.

అక్కడ సమస్త దేవతలు యోగులు సిద్ధులు సంచరిస్తుంటారు. తపస్సుకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన పవిత్ర ప్రదేశం ఆవశ్యకం అయినందున శ్రీమహా విష్ణువు తన చక్రంతో కరవీరక్షేత్రాన్ని విస్తృతం గావించి సమస్త ఐహిక, పారమార్థిక సౌఖ్యాల ప్రసాదినిగా అనుగ్రహించాడు. ఈ క్షేత్రపు నలుచెరగుల శ్రీమన్నారాయణుడు పరివేష్ఠితుడై ఉంటాడు. కలియుగాంతంలో సమస్త భూమండలం జల ప్రళయానికి లోనైనా కరవీరక్షేత్రం అందుకు మినహాయింపు" అని పలికారు.



అలా యోగిపుంగవుల వినమ్ర విన్నపంతో సంతుష్టుడైన శ్రీకృష్ణుడు కరవీర క్షేత్రాన్ని సందర్శించి పుణ్యతీర్థాలలో స్నానమాచరించి మహామాతృక దర్శనంతో నిష్కృతి పొందాడు. ఆపదకాలంలో యోగ సిద్ధుల మార్గనిర్దేశం ఎలాంటి వారికైనా ఆచరణీయమని ఆర్యోక్తి!

ఒకదినం శేషశయనుడైన మహావిష్ణువు నాభికమలం నుండి జన్మించిన సృష్టికర్త బ్రహ్మ 'సృష్టిమూలం' గూర్చి తెలుసుకోదలచి విష్ణు అనుగ్రహం కోసం ధ్యానించి, శ్రీలక్ష్మి మహావిష్ణువుల నివాసమైన కరవీరక్షేత్రం చేరాడు.

కనుక దక్షిణకాశి అయిన ఈ కరవీర క్షేత్రంలో "బ్రహ్మజ్యోతి" నిరంతరం ప్రకాశిస్తుంటుంది. ఐహిక కర్మల ఆచరణానంతరం జీవన్ముక్తికై ప్రతి మానవుడు కరదీపమైన కరవీరక్షేత్రాన్ని సందర్శించటం ఆవశ్యకమని వేదాలలో వచింపబడి వుంది.

## గోకుల తీర్థ మహిమ

పూర్వం మహాధనుడు అనే గొప్ప ధనవంతుడైన వ్యాపారి ఉండేవాడు. అతనికి పదుహైదు మంది అందమైన భార్యలు ఉండేవారు. కాలక్రమంలో వారు మహాధనుని వీడిపోగా అతడు కామిని అనే స్త్రీని వివాహమాడాడు. వారి కుమారుడే సుసంపదుడు. కొంతకాలం తరువాత మహాధనుడు, భార్య-కుమారునితో కలిసి వ్యాపార నిమిత్తం ఒక ఓడలో ప్రయాణం చేయసాగాడు. అదే సమయంలో ఈదురుగాలులు, చిరుజల్లులతో కూడిన వర్షం ఉధృతమై పెనుతుఫానుగా మారింది. సముద్రం అల్లకల్లోలమైంది. నౌక, సరంగు, సరుకుతో సహా మహాధనుడు సముద్రంపాలు కాగా, జాలర్ల సహకారంతో తల్లి బిడ్డలు మాత్రం సజీవులుగా మిగిలారు. కాని దైవనిర్ణయం కారణంగా ఇరువురు విడిపోయారు. విలాస జీవనానికి అలవాటు పడ్డ కామిని ఓ వేశ్యగా తన జీవితాన్ని గడపసాగింది. ఒక సంపన్న కుటుంబంలో ఆశ్రయం

పొందిన సుసంపదుడు సమస్త సంపదల మధ్య గారాబంగా పెరగసాగాడు. ఇలా ఇరవై సంవత్సరాలు వేగంగా దొర్లిపోయాయి.

ఒకరోజు లింగాయుతుడైన, ఓ ధనికయువకుడు, ధనకనకాది కానుకలతో కామినిని అలరించాడు. వృత్తి మర్యాదలతో, సేవలతో ప్రతిస్పందించిన కామిని ఆ స్ఫురద్రూపితో శృంగారంలో పాల్గొని సుఖించింది.

ఆ కాముకులు పరిచయం అనంతరం పూర్వపు అనుభవాలను ఆహ్లాదంగా పరస్పరం మననం చేసుకొనే సందర్భంలో వారికి అవగతమైంది తామెవరో! తమ అనుబంధం ఎంత పవిత్రమైందో! ఒక్కక్షణం కాలచక్రం ఆగిపోయింది! ఆ హఠాత్పరిణామానికి కామిని మూర్ఛిల్లింది. తరువాత కామినికి స్పృహరాగా ఇరువురకు అశ్రుధారలు ఏరులై పారాయి. శరీరాలు కంపించసాగాయి. వారెవరో కాదు! సముద్ర ప్రళయంలో విడిపోయిన తల్లి-తనయులు.

అత్యంత ఘోరమైన అపచారం జరిగిపోయింది. కామినికి మాతృ వాత్సల్యం పెల్లుబికింది. కంఠభాగంలో తన బిడ్డకున్న పుట్టుమచ్చను గమనించింది. తనయునిలో తన భర్త స్వరూపాన్ని సంపూర్ణంగా చూడగల్గింది. ఏ తల్లికి ఎదురు కారాని తన దుర్భరస్థితికి విలవిలలాడింది. సుసంపదుడు తన దౌర్భాగ్య స్థితికి ఎంతో చింతించాడు. అలవడిన వ్యసనాల పర్యవసానం ఎంతో పవిత్రబంధానికి మాయని మచ్చ తెచ్చింది. మూసుకున్న కండ్ల నుండి అశ్రుధారలు నిరాఘాటంగా ప్రవహించసాగాయి. పాదాల క్రింద భూమి బ్రద్దలై తను అధఃపాతాళానికి చేరుతున్న అనుభూతి. తల ఎత్తలేని పశ్చాత్తాపభారంతో క్రుంగిపోయాడు. జరుగకూడనిది జరిగిపోయింది. జరిగిపోయిన తప్పు సరిదిద్దుకోలేనిది! తెలిసికానీ, తెలియకకానీ చేసిన పాపం పాపమే మరి!

నోటమాటరాని సుసంపదుడు భక్తి వినమ్రతలతో తల్లి పాదాలకు మ్రొక్కి యోగులు ఆదేశించిన విధంగా పాపపరిహారానికై చక్రేశ్వరతీర్థం



సందర్శించి స్నానమాచరించి చక్రేశ్వరునికి మ్రొక్కి తనువు చాలించి శివసాయుజ్యం పొందాడు.

పోగొట్టుకున్న కన్నబిడ్డను తిరిగిపొందినా, ఆ తన్మయత్వాన్ని అనుభవించి జీవితాంతం ఆస్వాదించలేని తన దుర్భరస్థితికి పశ్చాత్తాపంతో జన్మ విరక్తి చెందింది కామిని. సాధువులు కరవీరపురాన్ని సందర్శించ వలసినదిగా ఆమెను ఆదేశించారు. ఆకలిదప్పులను త్యజించి, ఆమె శ్రీహరి ధ్యానంలో నిమగ్నురాలై, శుక్ల తీర్థంలో ముమ్మారు స్నానమాచరించింది. ఆశ్చర్యం! ఆమె ధరించిన వస్త్రాలు పరిశుభ్రమై ప్రకాశించసాగాయి. సాక్షాత్ భగవాన్ శ్రీకృష్ణుడు పాప నిష్కృతి గావించుకున్న దివ్య కరవీరాన్ని వీడి పోకూడదన్న దృఢనిర్ణయం తీసుకుంది కామిని. ఆ క్షేత్రంలోని కోటితీర్థంలో అనునిత్యం, శ్రీకృష్ణుని పాదముద్రల స్పర్శతోను, తన బాల్యాన్ని-బాల్యక్రీడలను, దేవకికి శ్రీకృష్ణుడు విశదపరచిన దృశ్యాల వీక్షణతోను కామిని పునీతురాలైంది.

ఈ తీర్థాన్ని సందర్శించినా, గోకులేశ్వరుని మహిమను విన్నా సమస్త ఘోర పాపాల నుండి నిష్కృతి లభిస్తుంది.

## కృష్ణతీర్థం - పాంచాలితీర్థం

కోలాసురుని భార్య కాలాంబ ఎంతో గొప్ప భక్తురాలు. ఆమె ప్రణవాత్మికయైన శ్రీమహాలక్ష్మి అనుగ్రహం కోసం తపస్సు ఆచరించింది. ప్రసన్నురాలైన మహాలక్ష్మి అచటి మహాశివలింగమందు ప్రత్యక్షమై ఆమెను అనుగ్రహించింది. శ్రీమహాలక్ష్మి అనుగ్రహంతో ఆ కాలాంబ కాలక్రమాన అంబగా ప్రసిద్ధి గాంచింది.

పాండవులు ఈ కరవీర క్షేత్రాన్ని సందర్శించినపుడు ద్రౌపది కృష్ణుని దర్శనార్థం భక్తిశ్రద్ధలతో భజించసాగింది. ఈ క్షేత్రంలోని తీర్థాలలో భక్తులకు

శ్రీకృష్ణుడు సర్వదా ప్రసన్నుడై సత్వరం అనుగ్రహిస్తాడన్నది ద్రౌపది నమ్మి, అనుభవించిన సత్యఫలం.

అన్నగారైన శ్రీకృష్ణుని దర్శించి ఆత్మీయంగా కష్టసుఖాలను పంచుకోవాలన్నదే ఆమె ఆత్రుత. భక్తసులభుడైన శ్రీకృష్ణుడు వెంటనే దర్శనమిచ్చాడు. అనిర్వచనీయ మైన ఆనందంతో ద్రౌపది కాళ్ళు కడిగి, ఆ పవిత్రజలం శిరస్సున చల్లుకొన్నది. పూజాపుష్పాలను తన సిగలో దాల్చింది. ప్రసన్నుడైన శ్రీకృష్ణుడు "చెల్లీ! ఈ ప్రదేశంలో భక్తులకు ఆహార ప్రసాదాన్ని పంచుతూ వర్ధిల్లు. యాచకుని 'శ్రీదత్తుని స్వరూపంగా" భావించి క్షుద్బాధ తీర్చిన వారి అన్ని కోరికలు భగవదనుగ్రహంతో తీరుతాయి" అని ఆమెను ఆశీర్వదించాడు. ఆ ప్రదేశమే కాలక్రమాన "కృష్ణతీర్థం"గా వాసికెక్కింది.

ద్రౌపది, నగరంలో నలుచెరగుల భక్తులకు, బీదలకు తనివితీరా ఆహార వితరణ చేస్తూ భక్తితో అంబను పూజించసాగింది. ఈ తీర్థంలో గోపాలుడు సైతం అంబను పూజించాడు. భక్తి బాంధవ్యాలతో గోపాలుని సేవించిన పాండవులు కష్టాలు తొలగి భోగభాగ్యాలతో జీవించారు. భగవంతుని ఎడల, భగవద్భక్తుల ఎడల, ద్రౌపది నివేదన అవ్యాజమైన భక్త్యానురాగాలకు ప్రతీకగా, ఈ క్షేత్రం "పాంచాలి తీర్థం" అని ప్రసిద్ధికెక్కింది.

కాలక్రమాన అగస్త్యుడు కాలాంబకు మ్రొక్కి ఆమె అనుగ్రహం పొందాడు.

## కాత్యాయని - భైరవతీర్థం

కొల్హాసురుడు ఈ క్షేత్ర రక్షణకొరకు రక్తబీజుని నియమించాడు. అను గ్రహించిన కాలపరిమితి ముగియగానే ధర్మపరిరక్షణార్థం కొల్హాసురునిపై యుద్ధం ప్రకటించింది శ్రీదేవి. పాతాళలోకం నుండి తన జైత్రయాత్రను ప్రారంభించింది. యుద్ధంలో రక్తబీజునికి ప్రతిగా భైరవుని నియోగించింది మహాలక్ష్మి. భైరవునికి, రక్తబీజునికి జరిగిన యుద్ధం భీకరంగా మారింది.



రక్తబీజుని శరీర గాయాల నుండి వెలువడిన ప్రతి రక్తపు బొట్టు నుండి తిరిగి లక్షలాదిమంది రాక్షసులు ఉద్భవించ సాగారు. భైరవుడు క్రమంగా, శక్తిహీనుడు కావడం గమనించిన శ్రీదేవి అతనికి సాయంగా కాత్యాయనిని పంపింది. కాత్యాయని అమృతకుండాలను (పూదేనెల సరస్సులు) సృష్టించి ఆ పూదేనెను సేవించిన వారి బలం ద్విగుణీకృతమయ్యేలా అనుగ్రహించి భైరవుని సైన్యంతో, తన తొమ్మిది కోట్ల శక్తి గణాలను చేర్చి ఉత్తేజపరిచింది. తిరిగి బలం పుంజుకున్న భైరవుడు రక్తబీజునితో యుద్ధం సాగించాడు. మాయావి అయిన రక్తబీజుడు చాటుగా జగన్మాతృకపై శరాన్ని సంధించాడు. అది గమనించిన కాత్యాయని మెరపుతీగ వేగంతో అతని చేతులను తన ఖడ్గంతో నరికివేసింది. అంత అతడు నిశ్చేష్టుడైన రక్తబీజుడు, అంబతో 'ఇతరుల సాయంతో సాధించిన విజయాలకు ఉప్పొంగిపోయి గర్వించకు' అని గేలి చేశాడు.

అంత అంబ, "ఓరీ మూర్ఖుడా! నేను ఈ జగంలో సర్వాంతర్యామిని. మానవ, దేవ, రాక్షసాది సమూహాలు జీవితానంతరం నాలో ప్రవేశిస్తాయి. వీక్షించు" అని పలుకుతూ తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. అజ్ఞానియైన రక్తబీజుడు అమ్మ ఔన్నత్యాన్ని గుర్తించలేదు.

మళ్లీ వారిరువురి మధ్య భీషణ యుద్ధం మొదలైంది. ఇరువురు పదునైన బాణాలు సంధించి పరస్పరం ఎదుర్కోవడం, పెకలించిన పెను వృక్షాలను, బండ రాళ్ళను విసురుకోవడం ద్వారానూ భీకరంగా పోరు కొనసాగింది. తుదిగా దుర్గ స్వరూపిణి అయిన ఆ జగన్మాత రక్తబీజుని క్రింద పడవైచి భీకర పద ఘట్టనలతో నిర్వీర్యుణ్ణి చేసింది. అతడు నేలపై రక్తపు మడుగులో దొర్లుతూ బాధతో ఆక్రందనలు చేయ సాగాడు. కాత్యాయని రక్తబీజుని కర్కశంగా తుదముట్టించింది. గుంపులు గుంపులుగా క్రిమికీటకాలు పల్లెలను చుట్టుముట్టి దాడి చేసేవిధంగా రాక్షసులు విభిన్న మారణాయుధాలతో భైరవుని సైన్యాన్ని చుట్టుముట్టారు. అంత దేవి తన తొమ్మిదికోట్ల దేవగణాలతో

వారిని భీకరంగా ఎదుర్కొని పరుగెత్తి పారిపోతున్న రాక్షసమూకల్ని పట్టి తుదముట్టించింది. ఆనందంతో భైరవుడు మైమరచి మహామాతృకను భక్తితో శ్లాఘించసాగాడు. ప్రసన్నమైన దేవి భైరవుని తనతోపాటు కరవీరపురంలో నివసించడానికి అనుగ్రహించింది.

భక్త్యావేశంతో పులకితులైన దేవతలు కాత్యాయనీ మాహాత్మ్యాన్ని వేనోళ్ళ పొగిడారు. ఈ కథను విన్నవారి సమస్త పాపాలు తొలగి, వేయి గోవులను దానం చేసిన పుణ్య ఫలం ప్రాప్తిస్తుందని ఆ దేవి వరమిచ్చింది. ఆనాటి నుండి ఆ ప్రదేశం భైరవ తీర్థంగా వాసికెక్కింది.

మహాలక్ష్మి దేవాలయపు దక్షిణదిక్కున కాత్యాయని వేంచేసి దర్శనమిస్తుంది.

## విఠలుడు - పుండరీకుని వృత్తాంతం

పూర్వం పండరీపురంలో జ్ఞానదేవుడు, ముక్తాబాయి అనే బ్రాహ్మణ దంపతులు నివసించేవారు. వారి కుమారుడే పుండరీకుడు. పుండరీకుడు తన అందమైన భార్య ఆకర్షణలో పడి తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేశాడు. పుండరీకుడు తన కుటుంబానికి మాత్రమే పరిమితుడై స్వార్థపరుడయ్యాడు. యవ్వన గర్వంతో తల్లిదండ్రుల యోగక్షేమాలను విస్మరించాడు. ప్రాపంచిక సౌఖ్యాలకు బానిసయ్యాడు. జన్మవిరక్తితో పుండరీకుని తల్లిదండ్రులు కాశీకి వెళ్ళి విశ్వేశ్వరుని సేవించి, తనువు చాలించ దలచి కాలినడకన ప్రయాణమయ్యారు.

మాతా పితరుల శ్రేయస్సును విస్మరించడమేగాక, వారిపట్ల, తోటి సమాజం పట్ల క్రూరప్రవర్తన పాపాల ఫలితంగా పుండరీకునికి భయంకరమైన ప్రాణాంతక వ్యాధి సోకింది. పుండరీకుడు పశ్చాత్తాపం చెంది భార్యాబిడ్డలతో కూడి కాశీలో వున్న తల్లిదండ్రుల వద్దకు చేరాలన్న తపనతో గుఱ్ఱపు బండిపై బయలుదేరాడు. అలా ప్రయాణిస్తూ మార్గమధ్యంలో



కుక్కుట మహాముని ఆశ్రమం వద్దకు చేరాడు. ప్రయాణ బడలికతో ఆ రాత్రి ఆ ఆశ్రమంలోనే బస చేశాడు. రాత్రి సమయంలో కొందరు అందమైన స్త్రీలు మురికి వస్త్రాలతో ఆ ఆశ్రమంలో ప్రవేశించడం గమనించాడు పుండరీకుడు. మరుసటి ఉదయాన వారు దేవతామూర్తులై తెల్లనివస్త్రాలను ధరించి బయటకు రాసాగారు. వారు ఎవరో తెలుసుకోవాలనుకొన్న పుండరీకుడు వారిని అనుసరించాడు. ఆశ్చర్యం! వారు గంగ, యమున, సరస్వతి మొదలైన పుణ్య నదీదేవతలు. మానవులు అనేకానేక పాపకార్యాలు చేసి, పరిహారానికి నదులలో పుణ్యస్నానం చేస్తున్నందున, వారి పాపాలను గ్రహించి వారిని పవిత్రులను కావిస్తున్న పుణ్యనదీమ తల్లులు. అలాంటి దేవతామూర్తులు ఈ ఆశ్రమంలోని మహామునిని రాత్రంతా సేవించి తమ దివ్యశక్తిని తిరిగి పొందగలుగుతున్నారు. ఈ విషయాన్ని ఆ దేవతామూర్తుల ద్వారా తెలుసుకొని పుండరీకుడు వినమ్రుడై ఆ దేవతలకు ఎంతో భక్తితో నమస్కరించాడు. దివ్యశక్తితో ఆతని ఔన్నత్యాన్ని గ్రహించిన గంగ ఆతని ఆజన్మ పాపాలను హరించి, జ్ఞానోదయం కావించింది. పుండరీకుడు కుక్కుట మహాముని దరి చేరి అతని దివ్యశక్తి సంపదకు మూలమేమని ప్రశ్నించాడు. జన్మనిచ్చిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని, వారి సేవయే పరమధర్మమని, వారికి చేసిన సేవయే తన ఉన్నతికి కారణమని బదులిచ్చాడు కుక్కుట మహాముని. ఇది విన్న పుండరీకుడు, తన అజ్ఞానానికి ఎంతో వగచాడు. తనకు జన్మ నిచ్చి, ఎన్నో కష్టాలకోర్చి, పెంచి పెద్దచేసిన తల్లిదండ్రుల ఎడల ఇన్నాళ్ళు తను ప్రవర్తించిన తీరు సిగ్గుతో తలవంచుకొనేలా చేసింది. పుణ్యమూర్తులైన తల్లిదండ్రులు ఈనాటికీ తనపై చూపించే ఆదరాభిమానాలు, అందులో వారు అనుభవించే అనిర్వచనీయమైన ఆనందం సైతం తనను విజ్ఞుణ్ణి చేయలేకపోయాయి. పశ్చాత్తాపం దహించివేయసాగింది పుండరీకుని. తీరని ఆవేదనతో, తానుకూడా వృద్ధులైన తల్లిదండ్రుల సేవ చేసి, తరించాలనుకున్నాడు. వెంటనే తల్లిదండ్రుల దరిచేరి వారి పాదాలను తన

కన్నీళ్ళతో కడిగాడు. తనలోని మార్పుకు, తన భార్యాబిడ్డల ముఖాల్లోని ఆనందం పుండరీకుని మరింత ఉత్తేజితుణ్ణి చేసింది. "తల్లిదండ్రుల ఎడల భక్తి- తాను వారికి చేస్తున్న సేవలు - చూపులతో వారందించే ఆశీర్వచనాలు". ఆ దివ్యానుభూతి ఇన్నాళ్ళు కోల్పోయినందుకు ఎంతో చింతించాడు. ఆనాటి నుండి పుండరీకునికి తన తల్లిదండ్రులను సేవించడం జీవిత పరమావధి అయింది. ఆ దివ్యానందంతో ఉదయాస్తమయాల తేడా తెలియక పోతోంది. రోజులు వేగంగా గడిచిపోతున్నాయి. పుండరీకుడు మాతాపితరుల ఎడల అకుంఠిత భక్తిభావంతో ప్రపంచానికే ఆదర్శప్రాయుడయ్యాడు.

వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రులను మిక్కిలి భక్తితో సేవిస్తున్న పుండరీకుని అనుగ్రహించి, ధన్యుని చేయడానికి విఠలుడు నంద్వాల పురానికి అరుదెంచి ఇంటి వాకిట నిలుచున్నాడు. ఆ సమయంలో తల్లిదండ్రుల సేవలో నిమగ్నమయిన పుండరీకుడు, విఠలుని గుర్తించక తన విధులు పూర్తయ్యేవరకు వేచి ఉండమంటూ, కూర్చోవడానికి ఒక ఇటుకను చూపించాడు. తల్లిదండ్రులపై ఆతని అపార ప్రేమాభిమానాలు, భక్తిశ్రద్ధలకు పరవశించిన విఠలుడు పుండరీకుని కోరిక మేర ఇటుకపై కూర్చొనక, భక్తవాత్సల్యంతో, అతని ప్రార్థనల్ని ఆలకించి అనుగ్రహించాడు. అలా పుండరీకుని అనుగ్రహించిన పాండురంగ విఠలుడు సాక్షాత్ శ్రీకృష్ణుడే.

ఆ పర్వతసానువులలో ఓ గుహలో జనించిన "భీమ"నది ఎంతో పవిత్రమైనది. మహావిష్ణునికి ప్రీతిపాత్రమైన ఆషాఢ, కార్తీక మాసాల ఏకాదశి పుణ్యతిథుల్లో ఈ నదిలో స్నానం చేసినవారు సమస్త పాపాల నుండి విముక్తులై స్వర్గప్రాప్తి పొందుతారు.

ద్వాపరయుగంలో నందుడు ఇచ్చట నివసించేవాడు. ఈ ప్రదేశంలో మువ్వగోపాల, వేవేల గోపెమ్మల అలౌకిక ఆత్మీయ నృత్యాలను, కళ్ళకు



కట్టినట్లు చూపించే వయ్యారపు పాదముద్రలు సాక్షాత్కరిస్తాయి. శ్రీకృష్ణుడు తన మాతాపితరులైన దేవకీ వసుదేవుల పేర ప్రతిష్ఠించిన రెండు శివలింగాలను కూడా ఇచ్చట వీక్షించవచ్చు. ఈ ప్రదేశం వాసుదేవస్థలిగాను, వాషిగాను ప్రసిద్ధికెక్కింది.

సమీప సిద్ధ పర్వతాగ్రాన సిద్ధ భాటుకేశ్వర లింగం ప్రతిష్ఠితమై వుంది. ప్రాతఃకాలాన తదేక దీక్షతో ఇచ్చట చేయబడిన పూజాదికాలు శంకరునకు మిక్కిలి ప్రీతిపాత్రమై దివ్యానుగ్రహ ప్రాప్తి కలిగిస్తాయి.

## రక్తాక్షుని వధ

రక్తబీజుని మరణవార్తతో కోలాసురుడు క్రోధంతో రెచ్చిపోయాడు. కరవీరపుర పశ్చిమ దిశ ద్వార సంరక్షణకై రక్తాక్షుని నియమించాడు. రక్తాక్షుడు దేవీభక్తులను, సామాన్య ప్రజలను తన దుశ్చర్యలతో హింసించసాగాడు. రక్తాక్షుని సంహరించి శాంతి నెలకొల్పేందుకు దేవి "గణేశుని, సిద్ధభాటుకేశ్వరుని" నియమించింది. సిద్ధ భాటుకేశ్వరుడు తన గణాలతో కూడి రక్తాక్షునిపై అంబులవర్షం కురిపించాడు. ఆగ్రహంతో రక్తాక్షుడు అనేక రకాల ఆయుధాలతో ఎదురు దాడి చేశాడు. ఆ ఆయుధాలను దేవి అనుగ్రహంతో సిద్ధ భాటుకేశ్వరుడు, త్రిప్పి కొట్టడంతో రక్తాక్షుడు గాయాల పాలయ్యాడు. దానితో రక్తాక్షుడు మాయావిగా యుద్ధం సాగించాడు. ఒకింత ఖిన్నుడైన సిద్ధ భాటుకేశ్వరునికి సాయంగా మూషిక వాహనంపై గణేశుడు యుద్ధం సాగించి, రక్తాక్షుని ఆయుధాలను నిర్వీర్యం చేయ సాగాడు. అశక్తుడైన రక్తాక్షుడు మతిభ్రమించి గణపతిని అపహాస్యం చేయసాగాడు. కోపంతో వక్రదంతుడు తన అంకుశంతో రక్తాక్షుని శిరస్సు ఖండించాడు. తదుపరి గణేశుడు, భాటుకేశ్వరుడు పశ్చిమ దిక్కున గల పర్వతాగ్రాన తూర్పు దిక్కున, ఉత్తర దిక్కున రెండు పుణ్యతీర్థాలను సృష్టించి "విశాలతీర్థ"మనే పేరుతో ఆ ప్రదేశాన్ని మహిమాన్వితం చేశారు. భాద్రపద

శుద్ధ చతుర్దశి రోజు, కాలాష్టమి దినాన ఈ తీర్థంలో పుణ్యస్నానాలాచరించి దేవికి మ్రొక్కిన భక్తులకు సమస్త కోరికలు ఫలించేలా అనుగ్రహించారు.

## విశాలతీర్థ ప్రాశస్త్యం

విశాలతీర్థ ప్రాశస్త్యాన్ని వివరించమని లోపాముద్ర కోరగా అగస్త్య మహర్షి ఈ విధంగా వివరించాడు.

పూర్వం శృంగుడు అను రాజు వుండేవాడు. అతడు ఒకనాడు తన తలపై ఒక కొమ్ము మొలవడం గ్రహించి, ఆవేదనతో దాని నివారణకై అనేకమంది వైద్యులను, విజ్ఞులను సంప్రదించాడు. కాని ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. ఒకనాడు ఆ రాజు దర్శనార్థం వచ్చిన నారదమహర్షి "అయ్యా! మీరు గత జన్మలో అనేకమైన పాపకర్మలను ఆచరించారు. అందువల్ల ఈ దుస్థితి దాపురించింది. దీని నివారణకై తీర్థయాత్ర చేస్తూ ఎక్కడ ఈ కొమ్ము రాలిపోతుందో ఆ క్షేత్రంలో యజ్ఞం చేయండి" అని విమోచన మార్గం సూచించాడు.

నారదుడు ఇంకా కొనసాగిస్తూ "ఓ శృంగ మహారాజా! గత జన్మలో నీవు అడవి దొంగవై బాటసారులను వెంటాడి, సంహరించి వారి సంపదను దోచుకొనే వాడివి. ఒకదినం నీచే హింసింపబడిన ఓ యాత్రికుడు "నీ కుటుంబ సభ్యులు నీ పాపంలో భాగం స్వీకరించడానికి అంగీకరిస్తారేమో తెలుసుకో" అనే ధర్మసూక్ష్మాన్ని తెలియజేశాడు. నీవు విచారించగా వారు అందుకు సంపూర్ణంగా నిరాకరించారు. పూర్వజన్మ సుకృతం వల్ల వివేకివైన నీవు ఆ మర్మాన్ని గ్రహించి ఆ యాత్రికుని ఆదరించి భోజనం సమకూర్చావు. అంత ఆ యాత్రికుడు, నీవు చేసిన పాపాలకు పరిహారంగా జీవితాంతం శివకేశవ నామాలను మననం చేస్తూ తరించమని సూచించాడు.

నీవు "విష్ణు, జనార్దన, పద్మనాభ, పురుషోత్తమ, చక్రపాణి, త్రివిక్రమ, గోవింద, వరాహ, జలశాయి, మధుసూదన, నారాయణ, శ్రీధర, వామన, మాధవ, నారసింహ, శ్రీరామ, శంభు, మహేశ్వర, విరూపాక్ష, సంకర్షణ, శూలపాణి, శశిశేఖర, భూతేశ, త్రిపురమర్దన, విశ్వేశ్వర, గౌరీశ, మహాదేవ, కృపానిధి, కాలకాల శంకర, వ్యోమికేశ, శ్రీశివ" అని భక్తితో జపిస్తూ ఆ యాత్రికుని వెంట అనేక తీర్థయాత్రలు చేశావు. భగవానుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటే, ముక్తిని కోరడానికి బదులుగా పేరాశతో మహారాజ భోగాలను ఆకాంక్షించి, భగవదనుగ్రహంతో పొంది, అనుభవించి, తుదిగా ప్రయాగలో దేహాన్ని త్యజించావు. ఆ కారణంగా ఈ జన్మలో నీకు ఈ శృంగం (కొమ్ము) సంప్రాప్తమయింది. కాబట్టి మరలా తీర్థయాత్రలు కొనసాగించు" అని విశదపరచాడు.

వెంటనే శృంగి తన రాజ్యబాధ్యతలను తన మంత్రులకు అప్పగించి భార్యతో కూడి తీర్థయాత్రలు చేస్తూ అనేక పుణ్యతీర్థాలలో స్నానమాచరించాడు. చివరకు విశాల తీర్థంలో స్నానమాచరించిన తక్షణం అతని శృంగం రాలిపోయింది. అంత ఆతడు అచట ఈశ్వరుని భక్తితో పూజించి మహాయజ్ఞం నిర్వహించి శివలింగ ప్రతిష్ఠ గావించాడు.

## రత్నాసురుని చర్పతాంబ వధించుట

అగస్త్యమహాముని కేదారేశ్వరుని గూర్చి ఇలా చెప్పసాగాడు.

కోలాసురుని కోరిక మేరకు శ్రీమహాలక్ష్మి కరవీరం వీడి హిమాలయాలకు వెళ్ళిన సమయంలో అతడు తన సైన్య ఆధిపత్యానికి రత్నాసురుని నియోగించాడు. రత్నుడు మదాంధుడై అమ్మవారిపై యుద్ధానికి ఇద్దరు యోధులను ప్రయోగించగా వారిని ఆమె సునాయాసంగా వధించింది. అంతట రత్నాసురుడు ప్రముఖ రాక్షసయోధుడైన మహిషాసురుని నియోగించాడు. కాళరాత్రి రూపంలో మహామాతృక మహిషాసురుని సంహరించిందని విన్న రత్నాసురుడు హతాశుడై, క్రోధంతో స్వయంగా దేవితో యుద్ధానికి తలపడ్డాడు. ఆ తల్లి తన చర్పదాంబ అంశను ప్రయోగించి

రత్నాసురుని సకల ఆయుధాల్ని విచ్ఛిన్నం చేసి, అతని తలను తెగ వేసి వధించింది. అంత కోలాసురుడు రక్తభోజుని యుద్ధానికి పంపాడు.

## కేదారేశ్వరుడు రక్తభోజుని వధించుట

చర్పతాంబ యుద్ధంలో అలసి వుంటుందని గ్రహించిన లక్ష్మీమాత కేదారుని ఆమెకు సహాయంగా పంపింది. కేదారుడు భీకర ఆయుధ ప్రయోగంతో రక్తభోజుని సైనికులను గాయపరచాడు. రక్తభోజుడు కేదారునిపై కరవాలంతో తలపడ్డాడు. నగర ఉత్తర మహాద్వార సమీపాన హోరాహోరీగా జరిగిన ఈ యుద్ధంలో కేదారుడు రక్తభోజుని శిరస్సును ఖండించి తుద ముట్టించాడు.

చర్పతాంబ, కేదారులు రత్నగిరి యందు కేదారేశ్వర లింగాన్ని ప్రతిష్ఠించి విశేషంగా అభిషేక పూజాదికాలు నిర్వహించారు. అక్కడే గౌతమి, హేమవతి, కర్పూరవాపి అనే తీర్థాలు వారిచే సృష్టి గావించబడి విరాజిల్లుతున్నాయి.

తల్లికి ప్రణామాలు చేస్తూ అగస్త్యమహర్షి "మహాద్వార చతుష్క" యాత్రకు ఉపక్రమించాడు. ఆయన ఆలా ప్రాంతంలోని రామేశ్వరుని, శివ పర్వతాన వేంచేసిన చక్రేశ్వరుని, కాళేశ్వర, మల్లికార్జునాది శివలింగాల్ని దర్శించి బ్రాహ్మణ సమారాధనలు, గో, భూదానాలు గావించాడు.

## అగస్త్యుడు - కార్తికేయస్వామి దర్శనం

ఒకానొక శుక్రవారం శుభఘడియలలో అగస్త్యమహర్షి శ్రీలక్ష్మీదేవిని దర్శించి కరవీరపురంలో తిరిగి నివసింప అనుమతి ఇమ్మని భక్తితో, దీనంగా ప్రార్థించాడు. అంత ఆ తల్లి "ఓరీ మూర్ఖుడా! నిన్ను కార్తికేయుని సందర్శించి రమ్మని ఆదేశించాను. నీవు ఈనాటికి నా ఆజ్ఞను పాటించలేదు. వెంటనే వెళ్లి పో! లేనిచో శపిస్తాను" అని కోపించింది. అంత అగస్త్యుడు తన తప్పును గ్రహించి కార్తిక పూర్ణిమ దినాన పాతాళగంగలో పుణ్య స్నానాలు



చేసి మల్లికార్జునుని ప్రార్థించి, పూజించాడు. తరువాత కార్తికేయస్వామిని సందర్శించి భక్తితో మోకరిల్లాడు.

## ధర్మరాజుకు తీర్థ ప్రశస్తిని తెలిపిన నారదుడు

అంత కార్తికేయుడు అగస్త్యునితో ఇలా అన్నాడు. "కౌరవ సోదరులతో జూదంలో ఓడిపోయి ధర్మరాజు పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం చేశాడు. ఆ సమయంలో అనేకమంది మహర్షులను దర్శించి, సేవించాడు. ఆ గడ్డుకాలంలో ఒక దినం త్రిలోక సంచారి నారదుడు ధర్మరాజు వద్దకు వచ్చాడు. ధర్మరాజు నారదునితో "మహాత్మా! ఈ కష్టదశ నుండి సత్వరం బయటపడడానికి దర్శించి, సేవించ అనువైన పుణ్యక్షేత్రం ఏదో సెలవీయండి" అని ప్రార్థించాడు. అంత ఆ మహాముని "ధర్మరాజా! ఏ క్షేత్రమైతే నారసింహ, పుష్కర, అట్టహాస, కోటి, త్రికూట మొదలైన ఇరవైఐదువేల పుణ్య ప్రదేశాలను తనలో కలిగివుండి విరాజిల్లుతుందో ఆ కరవీర మహాక్షేత్రం దివ్యమైనది. ఈ నగరం ఏడవ కల్పంలో 'కోలగిరి'గా ప్రసిద్ధి చెందింది. అక్కడ అనేకమంది యోగులు తమ ఐహిక వ్యామోహాలను త్యజించి, ముక్తిని పొందారు. దీనికి సాటియైన క్షేత్రం వేరొకటి లేదు" అంటూ ఆ క్షేత్రంలోని తీర్థాలను, వాటి ప్రాశస్త్యాన్ని ఇలా వివరించారు.

## కోలగిరి

కోలగిరి గా పిలువబడే ఈ ప్రాంతాన్ని పూర్వం పంచాసురుడు అనే రాజు పాలించేవాడు. ఆ కాలంలో ఓమారు కణ్వమహర్షి ఆ ప్రదేశాన్ని సందర్శింప రాగా మన్మథుడు అహంకారంతో "ఓరీ! వివేకహీనుడా! నీవు స్త్రీ సాంగత్య సుఖాలను తెలియని వాడివి. నీ జన్మ నిరర్థకం" అని పరిహసించాడు. అంత కణ్వుడు ఆగ్రహంతో "బుద్ధిహీనుడా! తక్షణం ఈ ప్రదేశాన్ని వీడిపో! నీవు ఈ ప్రాంతంలో ఏడు రాత్రులకు మించి ఉన్నట్లైతే సకుటుంబంగా నశిస్తావు" అని మదనుని శపించాడు. భయకంపితుడైన మదనుడు కురుక్షేత్రానికి చేరి తలదాచుకోసాగాడు.

ఈ క్షేత్రంలో పద్మావతి అనుగ్రహం వల్ల బ్రహ్మేశ్వర లింగం ఆవిర్భవించింది. అందుండి శివుడు ప్రత్యక్షమై బ్రహ్మను ఆశీర్వదించాడు. బ్రహ్మ భక్తిప్రపత్తులకు సంప్రీతి చెందిన పద్మావతి ఏదేని వరం కోరుకొమ్మంది. అప్పుడు బ్రహ్మ ఆనందంతో "తల్లీ! నీవు ఈ క్షేత్రంలో నిరంతరం దివ్యరూపంతో నెలకొని వుండి, భూమండలంలో సకల సంపదలను ప్రసాదిస్తూ, మహాలక్ష్మి నామంతో భక్తకోటిని సంరక్షించు" అని ప్రార్థించాడు. దయానిధి మహామాతృక, బ్రహ్మ కోర్కెను మన్నించి అనుగ్రహించింది.

## ఆ యా కల్పాల్లో వున్న పేర్లు

తరువాత కొంతకాలానికి ఆ రాజ్యానికి కోలాసురుడు పట్టాభిషిక్తు డయ్యాడు. ఆనాటి నుండి ఈ నగరం కోలగిరిగా ప్రసిద్ధి చెందింది.

మొదటి కల్పంలో మదనుడు కోలగిరిలో నివసించినందున ఈ క్షేత్రం కామగిరి పేరుతో ప్రసిద్ధి పొందింది.

కణ్వునిచే శపింపబడిన మదనుడు కామగిరి నుండి ఉత్తర కురుక్షేత్రానికి వెళ్ళిన నాటినుండి రెండవ కల్పంలో పద్మాలయంగా ప్రసిద్ధి చెందింది.

తన తల్లియైన మేనక చేత అవమానింప బడిన గౌరీదేవి దుఃఖిస్తూ సఖులతో కూడి హిమవన్నగాన్ని వీడింది. కోపించిన శివుడు హిమాలయానికి రాగా హిమవత్పర్వతరాజు శివుని అనుగ్రహం కోసం ప్రార్థించాడు. కావున మూడవ కల్పంలో పరమశివుడు పార్వతితో కూడి వేంచేసిన కోలగిరి శివాలయంగా ప్రసిద్ధి చెందింది.

నాల్గవ కల్పంలో బ్రహ్మ, ఐదవ కల్పంలో కుబేరులు ఈ ప్రదేశంలో తపస్సు చేసి శివుని అనుగ్రహం పొందారు. అందువల్ల ఈ ప్రాంతం బ్రహ్మాలయం, యక్షాలయంగా వినుతి కెక్కింది.



ఆరవ కల్పంలో ఈ ప్రాంతాన్ని సుకేశి మొదలగు రాక్షస రాజులు పాలించారు కాబట్టి రాక్షసాలయంగా కూడా ప్రసిద్ధి చెందింది.

## సకోలి, మణికర్ణిక, గాయత్రి, కుక్కుటేశ్వర, కపిల, బ్రహ్మ తీర్థాలు

కైలాసంలో ఓమారు ఉమాశంకరులు లాస్యవినోదంలో వున్న సమయంలో శివుని జటాజూటం నుండి ఉద్భవించిన జలధారలు సూర్యుని చేరి అట నుండి భువికి చేరి కోలగిరి నగరంలో "సకోలి" తీర్థంగా విరాజిల్లుతోంది.

ఒకమారు జగన్మాతృక కర్ణాభరణం జారి భూలోకం చేరింది. అన్వేషణలో దేవతలు, మునులు భూమిని త్రవ్వి వెలికి తీసి తిరిగి అందచేసినందున ఆమె ప్రసన్నమైంది. ఆ విధంగా త్రవ్విన ప్రదేశమే "మణికర్ణిక తీర్థం"గా భాసిల్లుతోంది.

గోమతినదీ తీరంలో అగస్త్యమహర్షి వేయి కుండాలతో గాయత్రీ యజ్ఞాన్ని నిర్వహించిన ఆ ప్రదేశం "గాయత్రీ తీర్థం"గా వాసికెక్కింది.

కోల్హాసురుని కుమారుడు కుక్కుటుడు దీర్ఘతపస్సు చేసి ఆరాధించిన శంభులింగం కుక్కుటేశ్వరలింగంగా ప్రసిద్ధి చెందింది.

ఆ ప్రాంతంలో శుక్ల, వాలఖిల్య, రావి, అప్సర, విశ్వవాసిక, నంది, భోగేశ్వర, నాగ, రుద్ర, యమకుండ, సావిత్రి, తారక, పంచాయతన, భేతాళ, జలాంగులి, వట, వారణాశి, కపి, స్కంధ తదాది పుణ్యతీర్థాలు ప్రభవిల్లుతున్నాయి. ఈ పవిత్ర ప్రదేశాలలో పూజించిన వారికి సకల ఫలాలు ప్రసాదింపబడేలా శ్రీవైష్ణవి కటాక్షించింది.

కపిలతీర్థంలో అరవై సంవత్సరాలకు ఒక పర్యాయం వచ్చే కపిల షష్ఠి పుణ్యతిథిన స్నానమాచరించి ఉపవాస దీక్షతో సూర్య భగవానునికి

మంత్ర సహితంగా అర్ఘ్య ప్రదానం చేసి, పాలు, నెయ్యి, చక్కెర కలిపిన పాయసాన్ని నివేదన చేసి, కపిలగోవును పూజించి, రాత్రివేళలో నాదోపాసనచే బ్రహ్మను సేవించి, భూసురునికి సువర్ణ రథాన్ని దానం చేస్తే సహస్ర యజ్ఞాలు చేసిన ఫలం ప్రాప్తిస్తుందని సృష్టికర్త అనుగ్రహించి ఉన్నాడు.

కులిందుడు అనే బ్రాహ్మణుడు పూర్వం అనేక పాపాలు చేశాడు. అయినప్పటికి అతడు కపిలతీర్థంలో స్నానం చేసి మరణాసన్నకాలంలో హరినామ స్మరణ చేసినందున ఆతనికి వైకుంఠ ప్రాప్తి కలిగింది.

చతుర్ముఖబ్రహ్మ అన్ని పుణ్యతీర్థాల జలప్రాభవంతో బ్రహ్మతీర్థాన్ని ఆవిర్భవింప చేశాడు. కావున ఇందలి పుణ్యస్నాన ఫలం అనన్య సామాన్యమైనది.

అగస్త్యుడు అక్కడి నుండి దక్షిణదిశగా తీర్థయాత్ర సాగించాడు.

## కరవీరపురం

ఈ ప్రాంతాన్ని కుబేరుడు పాలిస్తున్న సమయంలో సుకేశి అనే రాక్షసరాజు, అతని కుమారుడు హేలి, కుబేరునితో యుద్ధాన్ని ప్రకటించాడు. ఇరుపక్షాల సైన్యాల పోరుతో ఆకాశం ధూళి ధూసరితమైంది. రథాలు భగ్నమయ్యాయి. అశ్వాలు, గజాలు, కాల్బలం సర్వం నాశనమయ్యాయి. సుకేశి దొంగచాటుగా కుబేరుణ్ణి గాయపరిచాడు. తన ఓటమి ఘడియలు సమీపించడం గ్రహించిన కుబేరుడు పరమశివుని ధ్యానించి కైలాసానికి చేరాడు. శివుడు "ఈ కుబేర చరిత్రను విన్నవారు ఏనాడు దరిద్రులు కాబోరు" అని అనుగ్రహించాడు.

అనంతరం సుకేశి రాజ్యాధికారాన్ని స్వీకరించాడు. కాని బలగర్వంతో ప్రజాసంక్షేమాన్ని విస్మరించి అధర్మపరిపాలన సాగించాడు.



మునులు బ్రహ్మదేవుని ప్రార్థించి సుకేశిని దండింప వేడుకొన్నారు. బ్రహ్మ దేవుడు సుకేశిని రాజ్యం వీడిపొమ్మని, అలా కాని పక్షంలో అతని రక్తమాంసాలను రణచండికి సమర్పిస్తానని హెచ్చరికను పంపాడు. తీవ్రమైన క్రోధంతో సుకేశి బ్రహ్మదూత అయిన కోలునితో యుద్ధానికి తలపడ్డాడు. ఈ భీకర సంగ్రామంలో యోధులైన కోలుని నూరుగురు పుత్రులు చంపబడ్డారు. తుదిగా ఆ యుద్ధంలో మొదట సుకేశి తనయుడు, తదుపరి సుకేశి చంపబడ్డారు. ఈ విజయోత్సవం కరవీరపురంలో మహోత్సాహంతో జరుపబడింది.

ఏడవ కల్పంలో కోలుడు పట్టాభిషేకానంతరం "బ్రహ్మజ్ఞుల వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీమహావిష్ణువు వక్షఃస్థల శ్రీమహాలక్ష్మిని" భక్తి పారవశ్యంతో పూజించాడు.

శతపుత్రవియోగ దుఃఖాన్ని ఎలా బాపుకోవాలి? అని చింతించే కోలునికి చతురుడనే ముని ఓదారుస్తూ "ఓ కోలా! విధి వ్రాతకు అనుగుణంగా సకల జీవరాశులు వాని వాని కర్మఫలానుసారంగా ఇతర జీవులతో సంయోగ వియోగాలను పొందుతుంటాయి. ఆత్మ నిత్యం, సత్యం, శాశ్వతం, సర్వవ్యాపి. దానికి చావు పుట్టుకలు లేవు. యుద్ధరంగాన మరణించిన వారికి తప్పక కైవల్య ప్రాప్తి కలుగుతుంది. గత జన్మలో నీ పుత్రులు అనేకమంది బ్రాహ్మణులను వధించి వారికి ఉత్తర క్రియలు లేకుండా చేశారు. ఈ జన్మలో వారు ఇలా నీకు పుత్రశోకాన్ని మిగిల్చారు. వారి అంతిమ కోరికలైన "గంగాస్నానం, కాశీ విశ్వేశ్వరుని దర్శనం, మరియు సువర్ణ ఫలదానాలు నీవు నెరవేర్చు" అని జ్ఞానబోధ చేశాడు.

కోలుడు "స్వామీ! నేను ఇంకెంతో కాలం జీవించబోను. ఈ సుదీర్ఘ యాత్ర ఎలా సాధ్యం?" అని అభ్యర్థించాడు.

అందుకు చతుర మహర్షి "కోలా! శ్రీ మహాలక్ష్మి ఆవాసమైన కరవీర క్షేత్రమే దక్షిణకాశి. ఇచ్చట అనేక పుణ్యతీర్థాలు ఐహిక ఆముష్మిక

సుఖాలతోబాటు ఏకంగా ముక్తిని కూడా ప్రసాదిస్తాయి. కావున నీవు ఇచ్చట సూర్య భగవానుని ఆవాహన, ఆరాధన గావించి, పూజించి, సంతృప్తి పరచి శివుని జటాజూటం ద్వారా ప్రవహించిన పవిత్ర గంగోదకాన్ని నీ పుత్రులకు తర్పణ గావించి, విధియుక్తంగా మహాలక్ష్మిని సేవించి, బ్రాహ్మణులకు, కన్యలకు, కూష్మాండాలను, నారికేళఫలాలను దానం చేసి సంతర్పణ గావించు" అని ఆదేశించాడు.

ఆశ్వయుజ మాస ప్రాతఃకాలాన కోలుడు మౌనవ్రతం పూని బ్రహ్మచర్య నిష్ఠతో సూర్యకుండంలో స్నానమాచరించి, సూర్యదేవుని సహస్రనామ స్తుతితో పూజించి, తన దివంగత శతపుత్రులకు ఉదక ప్రదానం చేసి, మహర్షి ఆదేశాన్ని యధాతథంగా అమలు చేశాడు. పిమ్మట లక్ష్మీదేవి అనుగ్రహంవల్ల మళ్లీ కోలునకు 'కరవీరుడు, విశాలుడు, లజ్జాపరుడు, కులందకేతు" అను నలుగురు కుమారులు జన్మించారు.

కోలాసురుడు చిరకాలం ప్రజారంజకంగా రాజ్యపాలన చేసి, రాజ్యమంతా దేవాలయాలు, ఉద్యానవనాలు, విహారకేంద్రాలు పెంపొందించాడు. ప్రజలు పుష్కలంగా పాడిపంటలతోను అష్టైశ్వర్యాలతోను తులతూగారు. కోలుడు ఒకనాడు తన భార్యతో "వార్ధక్యము సమీపించి నందున, నేను వానప్రస్థ ఆశ్రమాన్ని స్వీకరించి ఋషి జీవితం గడప సంకల్పించాను, నీవు కుమారులతో కూడి ఇచ్చటనే నివసించు" అని పలికాడు.

అపుడామె 'నాథా! చిరు వయస్కులైన పుత్రులు ఈ విశాల సామ్రాజ్యాన్ని పాలింప సమర్థులా? వానప్రస్థమందు మీరు కీకారణ్యాలలో కష్టాల కోర్చి ఏకాంతంగా క్షుద్బాధను అనుభవించవలసి ఉంటుంది. గృహస్థాశ్రమంకూడా మిగుల ఉన్నతమై నట్టిదే కదా! తమ నిర్ణయాన్ని మరొక్కమారు సమీక్షించండి. కడవరకు మీతో కూడి జీవించే భాగ్యాన్ని



నాకు దూరం చేయకండి" అని పల్కింది. ఆమె మాటలు కోలాసురునికి రుచించలేదు.

కోలాసురుడు తన భార్యకు నచ్చచెప్పి జ్యేష్ఠ కుమారుడైన కరవీరునికి రాజ్యాభిషేకం కావించి తాను వానప్రస్థానికి పయనమయ్యాడు.

**నారద - మార్కండేయ సంవాదం సంపూర్ణం**

* * *

## శ్రీ మహాలక్ష్మికి నీరాజనం

క్షీరాబ్ధికన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం

జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల నీరాజనం ॥క్షీరాబ్ధి॥

చరణ కిసలయములకు సకియరంభోరుహులకు
నిరతమగు ముత్తేల నీరాజనం
అరిదిజఘనంబునకు అతివ నిజనాభికిని
నిరతి నానావర్ణ నీరాజనం ॥క్షీరాబ్ధి॥

సగటు శ్రీ వేంకటేశు పట్టణపురాణియై
నెగడు సతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగ చక్కదనముల కెల్ల
నిగడు నిజశోభనపు - నీరాజనం ॥క్షీరాబ్ధి॥

**- తాళ్లపాక అన్నమాచార్యులు**

# మహాలక్ష్మీదేవి సంస్థాన చరిత్ర ప్రశస్తి

సనాతన హైందవ సంస్కృతిలో పుణ్యక్షేత్ర దర్శనం ప్రాధాన్య అంశమై యున్నది. భారతీయ హైందవ జీవితంలో ఆధ్యాత్మిక ఉన్నతికి "క్షేత్ర దర్శనం, మహాత్ములు నడయాడి తపశ్శక్తులను విరజల్లి నిక్షిప్తం గావించిన తీర్థసేవనం" ప్రాచుర్యం సంతరించుకున్న అంశాలు. ఈ క్రమంలో "కాశీ పరమ పవిత్రమైన ముక్తిధామమేకాక అవిముక్త క్షేత్రం కూడా!" అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ పురాణ ఆగమ శాస్త్రోక్తుల ద్వారా శ్రీమహాలక్ష్మి పరదేవతా నివాస స్థానమైన కరవీరపురం, కాశీ కన్న వడ్లగింజ ప్రమాణంలో అధికం అని స్థిరీకరించబడింది. ఇచ్చటి ఆలయ ప్రాంగణమేకాక పుర విస్తీర్ణమంతా పరమ పవిత్రమైనది. కరవీరం లౌకిక సుఖాలతోబాటు ఏకంగా జీవన్ముక్తిని కూడా ప్రసాదింపగల మహామాతృక శక్తిపీఠం.

ఈ పట్టణం అనేక పురాణాలలో ప్రస్తుతింపబడింది. పరిశీలనాత్మక దృష్టితో చూస్తే పరశురామ అవతారకాలం నుండి రామాయణ కాలం, ద్వాపరయుగం వరకూ ప్రశస్తమైనట్లుగా తెలియవస్తున్నది.

ఈ పట్టణంలో పురాతనమై దివ్యమైన పవిత్ర ఆలయాలు, ప్రదేశాలు, ఉద్యానవనాలు ఎన్నో వున్నాయి. హైందవ సంస్కృతికి జీవం పోసి తదనంతర ప్రాభవానికి జవ సత్వాలందించేందుకు కొంకణ సామ్రాట్ కామదేవుడు, చాళుక్యుడు, శిలాహారుడు, యాదవ వంశానికి చెందిన రాజులు, ఆదిశంకరుల వంటి మహాతపస్వులు, ఆధ్యాత్మిక వేత్తలు, ఈ దివ్య క్షేత్రాన్ని సందర్శించారు. హైందవ సామ్రాజ్యోద్ధరణకు దీక్ష బూనిన ఛత్రపతి శివాజీ మహారాజుఈ పవిత్ర క్షేత్రాన్ని పరిరక్షించి ధన్యుడయ్యాడు.

శ్రీమహాలక్ష్మి పరదేవతా విగ్రహం నవరత్న ఖచితం. మణిమాణిక్యాదులచే పొదగబడి సుమారు నలుబది కిలోగ్రాముల బరువు కల్గినట్టిది. ఈ విగ్రహం



వెనుక సింహాకృతి, మధ్యభాగంలో సహజ పద్మం గోచరిస్తుంది. ఈ తల్లి చతుర్భుజి.

నాగ చిహ్నితమైన నవరత్న ఖచిత దివ్య మకుటధారిణి ఇచ్చటి మహాలక్ష్మి.

క్రీస్తుశకం 109వ సంవత్సరంలో "కరండో" అనే మహోన్నత వ్యక్తి అరణ్యంలో నిక్షిప్తమైన ఈ గుడిని వెలుగులోనికి తెచ్చాడు. 8వ శతాబ్దంలో ఈ దేవాలయం భూకంపాది ప్రకృతి విలయాలకు కృంగింది. 9వ శతాబ్దంలో "గంధవాదిక్స్" అను మహారాజు ఇచ్చట మహాకాళి మందిరాన్ని నిర్మించారు. 1178 - 1209 మధ్యకాలంలో రాజా జయసింగ్, సింధవ వీరిరువురు దక్షిణ ద్వారం, అతి బలేశ్వరాలయాలను నిర్మించారు. 1218 సంవత్సరంలో "తొలుం" అను యాదవరాజు మహాద్వారాన్ని నిర్మించి లక్ష్మీదేవికి అనేక మణిమాణిక్యాలు, రత్నహారాలు, దివ్యాభరణాలు సమర్పించాడు. శిలాహారుడు అను శిల్పకారుడు మహాసరస్వతి మందిరాన్ని నిర్మించడమేగాక చతుష్షష్ఠి దేవతావిగ్రహాలను చెక్కి స్థాపించాడు. ఈ కాలంలోనే పద్మావతిదేవి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం జరిగింది.

చాళుక్యుల కాలంలో గణపతి విగ్రహం ప్రతిష్ఠించబడింది. పదమూడవ శతాబ్దంలో శంకరాచార్యులు నగారఖానా కార్యాలయం, దీపమాలలు నిర్మింప చేశారు. 1712-1760 సంవత్సరాల మధ్యకాలంలో నరహరి భట్టశాస్త్రి తన స్వప్న వృత్తాంతాన్ని శంభుజీ మహారాజ్‌కు విన్నవించాడు. కథనం ఏమంటే "మొగలు చక్రవర్తుల కాలంలో తురుష్కుల దాడులకు భయపడిన భక్తగణం అమ్మవారి విగ్రహాన్ని దాచడం". ఈ స్వప్న వృత్తాంతాన్ని విశ్వసించిన శంభాజీ విగ్రహానికై అన్వేషణ ప్రారంభించాడు. చివరకు ఆ విగ్రహం కపిల తీర్థ దుకాణ సముదాయంలో ఒక ఇంటిలో కనుగొన్నట్లుగా అవగతమౌతోంది. 27-9-1712 వ తేది ఆశ్వయుజ విజయదశమి

సోమవారంనాడు సింథోజి హిందూరావ్ హోర్పడే ఈ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠ గావించారు.

కాలక్రమేణా సందర్శక భక్తుల సంఖ్య దినదిన ప్రవర్ధమానమై ఈ దేవి మహారాష్ట్రుల ఇలవేల్పుగా మారింది. కొంతకాలానికి అభిషేకాల ప్రభావం వల్ల ఈ విగ్రహం రూపు మారడం వల్ల శ్రీ శంకేశ్వర శంకరాచార్యులు జీర్ణోద్ధరణ గావించారు. 1954వ సంవత్సరంలో వివిధ యాగాల నిర్వహణానంతరం ఈ నూతన విగ్రహం కొల్హాపూర్ శంభాజీ రాజుచే తిరిగి ప్రతిష్ఠింపబడింది.

1960లో శ్రీ లోహియా ఆధ్వర్యంలో దేవాలయ నిర్వహణకు నూతన కార్యవర్గం ఏర్పాటు గావింపబడింది. తత్ఫలితంగా ఈ ఆలయ ప్రాంగణం విస్తారమైంది. ఇందులో 5 ప్రధాన దేవాలయాలు, 7 దీపమాలలు, ఏర్పాటు చేయబడ్డాయి. 35 ఉప ఆలయాలు, 20 వ్యాపార కేంద్రాలు నిర్మించబడ్డాయి. వీని సమీపంలో శ్రీహర్షే గారిచే నిర్మించబడిన గరుడ మండపం నెలకొన్నది. కొల్హాపూర్‌లో సుమారు 3000 దేవాలయాలు పశ్చిమ మహారాష్ట్ర దేవస్థాన కమిటీచే నిర్వహించబడుతున్నవి.

అలా భారతదేశంలోని సమస్త భక్త కోటికి ఇలవేల్పు - కొంగు బంగారమై విలసిల్లే ఈ పరాత్పరి సర్వజన సౌఖ్య ప్రదాయిని.

## నిత్య పూజలు

ప్రాతఃకాలం 4-30 గం॥లకు ఆలయ ద్వారాలు తెరవబడతాయి.

అమ్మవారి పాద పద్మారాధన కాకడ హారతి - స్తుతి గీతాలాపన

8-30 గంటలకు మహాపూజ

11-30 గం॥లకు కుంకుమార్చన, పంచామృతాభిషేకం, నివేదన

2-00 గంటల వరకు వేదపారాయణం



సాయంకాలం 7-30 గంటల తర్వాత భోగహారతి.

ప్రతి శుక్రవారం మహానివేదన

రాత్రి 10-00 గంటలకు షేజ్ హారతి.

దేవీనవరాత్రులు ఆశ్వయుజమాసంలో శుక్ల పాడ్యమి నాటినుండి ప్రారంభమవుతాయి. అన్ని ప్రాంతాల నుంచి వేంచేసే వేలాది భక్తులు ఈ తొమ్మిది దినాలలో పూజాది వివిధ ఉత్సవాలలో మిక్కిలి భక్తి శ్రద్ధలతో పాల్గొంటారు.

మృణ్మయ పాత్రలో ధూపం వేసి పూజిస్తారు. పంచమి రోజున మహాలక్ష్మిని పల్లకిలో వేంచేపు చేసి త్రయాంబులి స్వయంభువైన ప్రదేశాన్ని దర్శింప ఉత్సవంగా తీసుకెళ్తారు. ఈ ఉత్సవం అతివైభవంగా జరుగుతుంది. నేత్రపర్వమేగాక సర్వ సిద్ధి ప్రదాయకం.

'విజయదశమి' పర్వదినాన పురస్కరించుకొని, తి.తి.దేవస్థానం, తిరుపతివారు ప్రతి సంవత్సరం, దుర్గాష్టమి, మహానవమి రోజుల్లో తిరుమల శ్రీనివాసుని కానుకగా కొల్హాపురం శ్రీమహాలక్ష్మికి చీర, సారె, పసుపుకుంకుమలు, ప్రసాదాలు సమర్పించబడుతున్నవి.

అష్టమి దినం చాలా ప్రముఖం. ఆ రోజు దేవి నిద్రించదని, నగరంలో సంచరిస్తూ స్త్రీల శరీరాల్లోకి ప్రవేశించి సమస్త ఆరోగ్య ఐశ్వర్యాలను ప్రసాదిస్తుందని భక్తకోటి విశ్వాసం.

నవమి రోజున సప్తశతి పారాయణం జరుగుతుంది. ఆజ్యం, అన్నం, పేలాలతో హోమాలు జరుగుతాయి. దేవీ వస్త్ర, రూపాలవేషాలతో అనేకమంది పురుషులు. అలంకరించుకొని దేవిని పూజిస్తారు. సంగీత, నృత్యోత్సవాలు జరుగుతాయి.

దసరా ఉత్సవంగా జరుగుతుంది. రాజభోగంతో, ముజ్జగాల మహారాణి వైభవంతో అమ్మవారు పల్లకిలో దసరా ప్రాంగణంలోకి ప్రవేశిస్తుంది.

తరువాత ఆమె హరిజన నివాస స్థానాలకు వెళ్తుంది. తదుపరి శ్రీధరస్వామివారి ఆశ్రమ ప్రాంతాన్ని దర్శించి రాత్రి 9-00 గంటలకు తిరిగి ఆలయం ప్రవేశిస్తుంది.

ఈ విధంగా దసరా పండుగ ఉత్సాహంగా వైభవంగా పవిత్రంగా జరుగుతుంది.

శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం కోటగోడలవంటి ఎత్తైన ప్రాకారంలో దీర్ఘచతురస్రాకార ప్రాంగణంతో విరాజిల్లుతోంది. ప్రాకారానికి నాలుగు దిక్కులా నాలుగు ఎత్తైన ప్రవేశద్వారాలున్నాయి. అమ్మవారు పశ్చిమాభి ముఖంగా వేంచేసివుంది. భక్తులు ఏ ప్రవేశద్వారంనుంచైనా ప్రాంగణంలోకి ప్రవేశించవచ్చు.

**"ఇతిశమ్"**

* * *

## శ్రీ మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలోని చుట్టుగుళ్లు

ఈ ఆలయంలో శ్రీమహాలక్ష్మి పశ్చిమాభిముఖంగా వేంచేసి ఉన్నది. పశ్చిమ మహాద్వారంనుండి తూర్పుముఖంగా ఆలయంలోనికి ప్రవేశించాలి. వెంటనే

**అ) ఎడమచేతివైపునుండి వరుసగా (ప్రదక్షిణంగా)**

1. శ్రీ సిద్ధి వినాయక గణేశుని మందిరం
2. భద్రతాదళ సిబ్బంది కార్యాలయం
3. దేవస్థాన కార్యాలయం
4. శ్రీ ముక్తేశ్వరుని మందిరం
5. శ్రీ కనకేశ్వరుని మందిరం



6. శ్రీ యోగీశ్వరుని మందిరం
7. శ్రీ శాకంబరీదేవి మందిరాలు - దృగ్గోచరమవుతాయి.

**ఆ) అక్కడి నుండి తూర్పు దిక్కుకు తిరిగి చూపు సారిస్తే వామభాగంలో**

8. అన్నదానం మరియు ప్రసాద విక్రయశాల

9,10 మహంతుల దివ్యసమాధులు

11. నాగకుండలినీ శక్తి పరివేష్ఠితమైన, ఎత్తైన శిలా దీపస్తంభాలు.
12. ఔదుంబర వృక్షంతోపాటు శ్రీగురుదేవ దత్తాత్రేయుని భిక్షాటన దివ్యస్థలం
13. శ్రీదత్తుని మందిరం
14. శ్రీమహాలక్ష్మి మందిరం
15. ఆలయానికి ఉత్తర మహాద్వారం
16. నవగ్రహ మందిరం
17. శ్రీసూర్యనారాయణస్వామి, దుర్గాష్టమి, శ్రీసాయిబాబాల మందిరాలు
18. శ్రీమహాలక్ష్మి ప్రసాద కక్ష్య
19. శ్రీపాండురంగ విఠలుని మందిరం
20. శ్రీముద్గళేశ్వరుడు, ఆదిశంకరుల మందిరం
21. శ్రీరాధాకృష్ణుల మందిరం
22. శ్రీ స్వామిసమర్థ, సతి పంచగంగ మందిరం
23. శ్రీ దశావతార మందిరం

ఈ దిక్కున వటవృక్షం భక్తులకు ఉష్ణతాపానికేగాక భక్త్యావేదనకు కూడా ఉపశమనం కల్గిస్తుంటుంది.

**ఇ) అచ్చటి నుండి దక్షిణదిక్కుకు తిరిగి దృష్టి మరలిస్తే వామభాగంలో**

24. శ్రీహనుమత్సేవిత సీతారామలక్ష్మణుల మందిరం
25. ఆలయానికి తూర్పు దిక్కు మహాద్వారం
26. అతి పవిత్ర పింపావృక్షం
27. శ్రీశేషసాయి మందిరం
28. శ్రీమహావిష్ణు మందిరం
29. శ్రీ మారుతి ప్రసన్న మందిరం
30. శ్రీ లక్ష్మీనారాయణుల మందిరం
31. శ్రీ ఖండోబా ప్రసన్న మందిరం
32. శ్రీ నాగాయిదేవి మరియు బ్రహ్మదేవుల మందిరం

**ఈ) ఇచ్చటి నుండి పడమటి దిక్కుకు తిరిగి దృష్టి సారిస్తే వామభాగంలో**

33. శ్రీ అతిబలేశ్వరుని మందిరం
34. దక్షిణ విద్యాపీఠ మహాద్వారం (ఆలయానికి దక్షిణ మహాద్వారం)
35. శ్రీరాధాకృష్ణ మందిరం
36. శ్రీ కళామయి యోగీశ్వరి మందిరం
37. శ్రీ సిద్ధి వినాయకుని మందిరం
38. శ్రీ సింహవాహిని దుర్గాదేవి మందిరం
39. శ్రీ తులజాభవాని మందిరం
40. శ్రీ శనైశ్చర ప్రసన్న మందిరం
41. శ్రీ రాధాకృష్ణ మందిరం
42. శ్రీ గజలక్ష్మి మందిరం
43. అతి సూక్ష్మరూపంలో శ్రీమహాలక్ష్మి మందిరం



కనువిందు గావిస్తూ ఆలయ ప్రవేశ మాత్రాన్నే సకల జనులను, భక్తి సంద్రంలో ఓలలాడిస్తూ జీవన్ముక్తి దాయకమవుతున్నది.

పైన పేర్కొన్న దేవతా సన్నిధులన్నీ ఆలయం చుట్టూరా ప్రాంగణంలో నెలకొన్నాయి.

ఇక ప్రధానమైన ఆలయంలోని గర్భమండపంలో పశ్చిమాభిముఖంగా నిలిచివున్న భంగిమలో శ్రీమహాలక్ష్మీ అమ్మవారు చతుర్భుజాలతో దర్శనమిస్తున్నది.

పై రెండు చేతుల్లో ఖడ్గం – డాలు, క్రింది రెండు చేతుల్లో మాతులుంగ ఫలం, అమృతకలశం ధరించి వున్న శ్రీమహాలక్ష్మికి 'కోలాసుర భయంకరి', 'కరవీరపురనివాసిని' అనే పేర్లు ఉన్నాయి. అష్టాదశశక్తి పీఠాల్లో శ్రీమహాలక్ష్మి పేరుతో "కొల్హాపురే మహాలక్ష్మీ" అని ప్రసిద్ధిగన్న జగన్మాత ఈమె. ఈ ఆలయంలోనే కుడివైపున శ్రీ మహాకాళీ సన్నిధి, ఎడమవైపున 'మహాసరస్వతి' సన్నిధి మందిరాలు వున్నాయి. శ్రీమహాలక్ష్మి ఎదురుగా వున్న ముఖమండపంలో శ్రీ మహాగణపతి కొలువుదీరి పూజలందుకొంటున్నాడు.

శ్రీమహాలక్ష్మి గర్భాలయానికి పైన మరో మందిరం ఉంది. సరిగ్గా శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి శిరోభాగాన వున్న ఆ మందిరంలో 'శివలింగం' ప్రతిష్ఠింపబడివుంది.

నివేదన మరియు మహామంగళహారతిని శ్రీమహాలక్ష్మికి సమర్పించిన తరువాత గర్భాలయం పైన వున్న మండపంలోని మహాశివలింగానికి కూడ సమర్పించబడుతుంది. ఒక్క మహామంగళహారతి సమయంలో మాత్రమే శ్రీ మహాలక్ష్మికి శిరస్సుపైన వున్న ఊర్ధ్వమండపంలోని శివలింగాన్ని దర్శించడానికి వీలవుతుంది.

మహా అద్భుతమై సుమారు 3000లకు పైగా ఆలయాలతో, తీర్థాలతో పరివేష్టితమై వున్న దివ్యస్థలంగా అష్టాదశశక్తి పీఠంగా విరాజిల్లుతూ వున్న శ్రీకొల్హాపుర శ్రీమహాలక్ష్మి పుణ్యక్షేత్రాన్ని జీవితంలో ఒక్కసారైనా దర్శించడం ప్రతిభక్తుని అవశ్యకర్తవ్యం. విధి కూడా

**ఓం శ్రియై నమః**